ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కరీంనగర్ : fb.com/vaartha
PUBLISHED FROM KARIMNAGAR, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
3-10-2022 సోమవారం సంపుటి : 28 సంచిక : 244, పేజీలు : 8+16 వెల : 6.50

ముంబయిలో రూ.1476 కోట్ల డ్రగ్స్ పట్టివేత

62.33 కోట్లకు పెరిగిన కరోనా వైరస్ కేసులు

5లో



గాంధీ ఆసుపత్రి ఆవరణలో ఆదివారం మహాత్ముని విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సిఎం కెసిఆర్

## గాంధీజీ సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శం

విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి

గాంధీజీ, శాస్త్రిజీకి ఘనంగా నివాళులర్పించిన సిఎం కెసిఆర్

**సికింద్రాబాద్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** మనిషికి ఎన్ని ఆస్తులు ఉన్నా శాంతిలేకపోతే బ్రతుకు ఆటవికమేనని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆన్నారు. ప్రపంచంలో శాంతి ఉంటేనే మనమంతా సుఖంగా ఉంటామని పేర్కొన్నారు. అలాంటి సుఖాన్ని మనం పొందాలంటే దేశంలో ఏమి జరుగుతుందో అందరు తెలుసుకోవాలని, ఆలోచించాలని అన్నారు. గాంధీఆస్పత్రి వద్ద రూ. 2కోట్ల వ్యాయంతో ఏర్పాటు చేసిన 16 అడుగుల ధ్యానముద్రలో ఉన్న గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభయలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సమాజాన్ని చీల్చే ≫2

## రాజ్‌ఘాట్‌ను సందర్శించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

5లో

# టిఆర్ఎస్ కాదు.. బిఆర్ఎస్!

## పేరు మార్పు ఖరారు



పార్టీ పేరు మార్పుపై 6న ఢిల్లీలో ఇసికి అఫిడవిట్ దాఖలు

కొత్త పార్టీ ఎన్నికల గుర్తు కారు, జెండా రంగు గులాబీయే

కెసిఆర్ కొత్త పార్టీలో విలీనానికి సిద్ధమైన పలు పార్టీలు

రంగంలోకి దిగిన మాజీ సిఎంలు కుమారస్వామి, వాఘేలా

కొత్త పార్టీకి జాతీయ కోఆర్డినేటర్ల నియామకాలు షురూ

దక్షిణాది రాష్ట్రాల సమన్వయ బాధ్యత ప్రకాశ్ రాజ్‌కే

3 రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన మంత్రి కెటిఆర్

దసరా రోజు మధ్యాహ్నం 1.19 గంటలకు ముహూర్తం

డిసెంబర్ 9న ఢిల్లీలో కెసిఆర్ కొత్త పార్టీ బహిరంగ సభ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబర్2:** ఎట్టకేలకు టిఆర్ఎస్ అధినేత,ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కొత్త జాతీయ పార్టీ పేరును ఖరారు చేశారు. ఆయన జాతీయ పార్టీన ప్రకటించేందుకు తేదీ కూడా ఫిక్స్ అయింది. ఈ మేరకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం ప్రగతి భవన్‌లో పార్టీ నేతలతో కెసిఆర్ సమావేశం అయ్యారు. టిఆర్ఎస్ అధినేత తన కొత్త జాతీయ పార్టీకో భారత రాష్ట్ర సమితి' (బిఆర్ఎస్)గా నామకరణం చేయనున్నారు. అనేక పేర్లను వెతికిన తర్వాత ఆ పేరును ఎంపిక చేసిన కెసిఆర్ దసరా పండుగ రోజున అంటే బుధవారం కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నారు. బుధవారం మధ్యాహ్నం 01.19గంటలకు పార్టీ పేరును అధికారికంగా ప్రకటించనున్నారు. జాతీయ పార్టీని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా కెసిఆర్ ఢిల్లీలోని సర్దార్ పటేల్ మార్గ్‌లో తాత్కాలికంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. పార్టీ ఆవిర్భావ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రి కెటి రామారావు గత మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్నారు. జాతీయ కోఆర్డినేటర్ల నియామకాల్లోనూ బీజీగా ఉన్నారు. కెటిఆర్‌తో పాటు మాజీ సిఎంలు కుమారస్వామి, శంకర్ సింగ్ వాఘేలా,సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల సమన్వయ బాధ్యతలు ప్రకాశ్‌రాజ్‌కి దక్కే అవకాశం ఉంది. మొత్తంగా ఈనెల 5న దసరా పండుగ రోజున టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ జాతీయ పార్టీని ప్రకటించనున్నారు. ఈమేరకు ప్రగతి భవన్‌లో టిఆర్ఎస్ నేతలతో కెసిఆర్ ఆదివారం సమావేశమయ్యారు. భేటీకి మంత్రులు, ఎంపీలతో పాటు టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పార్టీ ఏర్పాటుపై నేతలతో సిఎం చర్చించారు. దసరా పండుగ రోజున టిఆర్ఎస్ కార్యవర్గ పార్టీ సమావేశం జరుగనున్నది. జాతీయ పార్టీగా మార్పుపై 283 మంది టిఆర్ఎస్ సభ్యులతో విస్తృత స్థాయి తీర్మానం ప్రవేశపెట్టి.. ఆమోదం తెలుపనున్నారు. అదే రోజున మధ్యాహ్నం 01.19 గంటలకు ముహూర్తం నిర్ణయించగా, జాతీయ పార్టీపై సిఎం కెసిఆర్ ప్రకటన చేయనున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 9న ఢిల్లీలో బహిరంగ సభ నిర్వహించాలని కెసిఆర్ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. కొత్తగా జాతీయ పార్టీని ఏర్పాటు చేస్తే సమస్యలు వచ్చే అవకాశం ఉందని, అందుకే ఉన్న టిఆర్ఎస్ పార్టీనే జాతీయ పార్టీగా మారిస్తే సాంకేతిక సమస్యలు రావని భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఎన్నికల గుర్తు కారు గుర్తును కూడా మార్చుకోవాల్సిన అవసరం ఉండదని ఆయన నేతలకు తెలిపినట్లు సమాచారం. జాతీయ పార్టీ కలర్ కూడా గులాబీ రంగు ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం. వచ్చే మునుగోడు ఉప ఎన్నికలో కొత్తజాతీయ పార్టీ తరఫునే అభ్యర్థిని బరిలోకి దింపాలని సిఎం కెసిఆర్ యోచన చేస్తున్నారు. మునుగోడు ఉపఎన్నికలో తాజా సర్వేల ప్రకారం ఓటర్లంతా టిఆర్ఎస్ వైపు ≫2

## బిజెపి పేరు మార్చుకోవాలి

**మంత్రి కెటిఆర్ సూచన**

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** బిజెపి తన పార్టీ పేరును బిజె ఈసి, సిబిఐ, ఎన్ఐ, ఐటి, ఈడిపిగామార్చుకోవాలంటూ రాష్ట్ర మంత్రి ఎద్దేవా చేశారు. ఈమేరకు ట్వీట్ చేశారు. ఎలక్షన్ కమిషన్ కంటే ముందే బిజెపి నేత లే ప్రకటించడంపై ట్వీట్ చేశారు. మునుగోడు ఉప ఎన్నికపై బిజెపి కోర్ కమిటీ సమావేశమై ఈనెల 15వ తేదిలోపు నోటిఫికేషన్ వస్తుంటే బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సునిల్ బన్సాల్ పేర్కొన్న నేపథ్యంలో ట్వీట్ చేశారు. ఎలక్షన్ కమిషన్‌కంటే ముందే బిజెపి నేతలు ఎన్నికల తేదీలను ప్రకటిస్తున్నారని, ఈడి కంటే ముందే సోదాలు చేసే వారిక పేర్లు చెబుతున్నారన్నారు. ఎన్ఐఏ కంటే ముందే బ్యాన్ విధిస్తున్నారని, ఐటి అధికారుల కంటే ముందే నగదు వివరాలు చెబుతున్నారని, సిబిఐ కంటే ముందే నిందితుల పేర్లు వెల్లడిస్తున్నారని అన్నారు. అందుకే బిజెపి పార్టీ తన పేరును మార్చుకోవాలన్నారు.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం



పోలీసులు అరెస్టు చేసిన ఉగ్రవాదులు

జంటనగరాలలో బాంబు దాడులకు యత్నం

సిటీ పోలీసులకు చిక్కిన ముగ్గురు వాంటెడ్ ఉగ్రవాదులు

పాకిస్థాన్‌లోని ఐఎస్ఐ ఉగ్రవాదుల నుంచి నిధులు, హ్యాండ్ గ్రెనేడ్ల చేరవేత

**హైదరాబాద్, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో బాంబు దాడులకు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పన్నిన కుట్రను సిటీ పోలీసులు భగ్నం చేశారు. దసరా పండగ వేళ జనసమూహం వున్నచోట హ్యాండ్ గ్రేనేడ్లతో దాడులు చేసి మారణహోం సృష్టించేందుకు కుట్ర పన్నిన ముగ్గురు ఉగ్రవాదులు ఈ సందర్భంగా పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి నాలుగు హ్యాండ్ గ్రేనేడ్లతో పాటు భారీగా నగదు, సెల్‌పోన్లను స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా ఉగ్రదాడులకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) పన్నిన కుట్రలను భగ్నం చేసిన పోలీసులు ఈ క్రమంలో ఇతర ఉగ్ర సంస్థలతో పాటు వాటి సానుభూతిపరులపై నిఘా వుంచగా సిటీ పోలీసులకు ఆదివారంనాడు ముగ్గురు కరుడుగట్టిన ఐఎస్ఐ ఉగ్రవాదులు పట్టుబడ్డారు. మలక్‌పేట్‌లోని మూసారాంబాగ్‌కు చెందిన అబ్దుల్ జాహెద్ అలియాస్ మోటు (40), అదే ప్రాంతంలోని అక్బర్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ సమీరుద్దీన్ అలియాస్ అబ్దుల్ సమీ (39), హుమాయూన్‌నగ ్ర్‌కు చెందిన మాజ్ హసన్ ఫారూక్ అలియాస్ మాజ్ (29) అనే ముగ్గురు ఉగ్రవాదులు జంట నగరాలలో దసరా పండగ వేళ నగరంలో జనం ఎక్కువగా వుండే ప్రాం తాలలో గ్రేనేడ్లతో దాడులు చేసి మారణహోమం సృష్టించాలని వ్యూహం రచించారు. ఈ ముఠాకు జాహెద్ నాయకుడు. ఇతనిపై అనేక ఉగ్ర కేసులున్నాయి. ఇందులో 2005లో బేగంపేట్‌లో అప్పట్లో వున్న సిటీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన ఆత్మాహుతి దాడి కేసు కూడా వుంది. ఈ కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా వున్న బం గ్లాదేశ్‌కు చెందిన దాలిన్‌తో పాటు ఇతన్ని అడ్డుకున్న హోంగార్డు సత్యనారాయణ కూడా బలయ్యాడు. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. దేశంలో పారా మిలటరీ, రక్షణ బలగాల కార్యాలయాలు మినహా శాంతి భద్రతల పోలీసు కార్యాలయాలపై ఈ తరహా దాడులు జరగడం అదే మొదటిసారి. ఈ కేసులో జాహెద్ సహా అనేక మంది నిందితులున్నారు. కాగా ఈ ఘటన తరువాత జాహెద్ అరెస్టయి బెయిలుపై విడుదలై పారిపోయి అజ్ఞాతంలో వుంటూ పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ ఉగ్రవాదులతో కలిసి ≫2



ఇండొనేషియా ఫుట్‌బాల్ స్టేడియంలో తొక్కిసలాట దృశ్యం

## ఇండొనేషియా ఫుట్‌బాల్ స్టేడియంలో తొక్కిసలాట

174 మంది మృతి, 180 మందికి గాయాలు

**అభిమానుల మధ్య గొడవ, చెదరగొట్టేందుకు పోలీసుల టియర్ గ్యాస్**

**జకర్తా:** ఇండోనేషియాలోని ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య గంటగంటకూ పెరుగుతోంది. ఆదివారం మధ్యాహ్నానికి 174మంది మృతి చెందగా, 180మంది వరకూ గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు పోలీసులు కూడా ఉన్నారు. 100మందికిపైగా తీవ్రంగా గాయపడగా, వారిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. తూర్పు జావా మలాంగ్ ≫2

## 4 నుంచి 6 వరకు భారీ వర్షాలు

-వాతావరణ కేంద్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్2:** రాష్ట్రంలో ఈనెల 4 నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏపీ తీరంలోని పశ్చమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి నైరుతి దిశగా వంపు తిరిగి ఉందని పేర్కొన్నది. అలాగే ఈశాన్య బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడిన మరో ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది.వీటి ప్రభావంతో 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రాథమిక హెచ్చరిక జారీ చేసింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 440 మండలాల్లో పొడి వాతావరణం ఏర్పడినట్లు టిఎస్‌డిపిఎస్ తెలిపింది. మిగిలిన వాటిల్లో 10 మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురువగా... పలుచోట్ల చిరు జల్లులు కురిశాయని వివరించింది.



**కరోనా సమాచారం**

ప్రపంచంలో

మొత్తం బాధితులు 62.33 కోట్లు

మరణాలు-65.50 లక్షలు

దేశంలో

తాజా కేసులు - 3364

మరణాలు - 7

రాష్ట్రంలో కొత్తగా 66 కేసులు

మృతులు జీరో

2లో

## ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు దుర్మరణం

మృతులంతా అన్నదమ్ముల పిల్లలు

యాచారం ప్రాంతంలో విషాదఛాయలు

**యాచారం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** దసరా సెలవుల్లో సరదా కోసం ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు దుర్మరణం చెందిన సంఘటన యాచారం మండల పరిధిలోని గొల్లగూడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, సిఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తాడిపర్తి అనుబంధ గ్రామమైన గొల్లగూడ గ్రామానికి చెందిన ఖాసిం కుమారుడు కష్లీద్(12), కుమార్తె సమ్రీన్(14)తో పాటు తన తమ్ముడు, చెల్లెలి కుమారులు ఎండి రెహాన్(10), ఎస్‌కె ఇమ్రాన్(09), బంధువులతో కలిసి గొల్లగూడలోని దర్గాకు వెళ్లారు. ఈ క్రమంలో నలుగురు గొల్లగూడ రెవిన్యూ పరిధిలోని ఎర్రకుంట ట్యాంకును సందర్శించి మార్గమధ్యలో ఇంటికి తిరిగి వచ్చే సందర్భంగా చెరువులో ఈత కొట్టేందుకు చొక్కాలు తీసేసి ఈత కొట్టడం ప్రారంభించారు. ఈత కొట్టడం, నీటిలో మునిగిపోవడం ఎవరికీ తెలియదు. అనంతరం మద్యాహ్నం 2గంటల సమయంలో అటుగా వెళ్లిన అదే గ్రామానికి చెందిన అనమోని కృష్ణయ్య వారి చొక్కాలను పరిశీలించి వారి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారంఅందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఖాసిం, ఆయన తమ్ముడు, చెల్లెలు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, అందుకు ప్రతిఫలంగానే సమ్రీన్ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో పాటు మిగిలిన ముగ్గురు కూడా చదివిలో ప్రతిభ కనబరుస్తున్నారని, ఇంతలోనే ప్రమాదం సంభవిస్తుందని అనుకోలేదని మృతుల తల్లిదండ్రులు, బంధువులు రోధిస్తున్నారు. గ్రామానికి చెందిన నలుగురు ఒకేసారి నీటిలో మునిగి మృతి చెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదచాయలు అలుముకున్నాయి.






ఆదివారం మైసూర్‌లో భారీ వర్షంలో మాట్లాడుతున్న రాహుల్

## మైసూరు చేరుకున్న రాహుల్ యాత్ర

**మహాత్ముడికి నివాళులర్పించి కొనసాగించిన కాంగ్రెస్ అగ్రనేత**

జోరు వానలోనూ ముమ్మరంగా సాగిన యాత్ర

**మైసూర్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఆదివారం 25వ రోజున మైసూర్ చేరుకుంది. ప్రస్తుతం కర్నాటకలో యాత్ర సాగిస్తున్న రాహుల్..జాతిపిత మహాత్ముడి జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం ఆయనకు నివాళులర్పించి ఆ తర్వాత ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1927లో కర్నాటక మైసూర్ జిల్లాలోని బాదనవాలులో గాంధీ సందర్శించిన ఖాదీ గ్రామోదయ కేంద్రంలో మహాత్ముడికి రాహుల్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రసంగిస్తూ..గాంధీ సిద్ధాంతాన్ని వల్లించడం కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి సులభంగానే ఉంటుంది. కానీ, ఆయన అడుగుజాడల్లో నడవడం మాత్రం కష్టమంటూ విమర్శించారు. జాతిపితను చంపిన సిద్ధాంతమే గడిచిన ఎనిమిదేళ్లుగా దేశంలో అసమానత్వం, విభజనవాదాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ ఆరోపించారు. దేశం కన్న గొప్ప బిడ్డ గాంధీ అని రాహుల్ అన్నారు. అహింస, ఐక్యత, సమానత్వం, న్యాయం ఆయన సిద్ధాంతమని రాహుల్ గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో భారత్ జోడో యాత్రను కొనసాగిస్తున్నామన్నారు. బ్రిటీష్ పాలనకు ≫2

గాంధీజీ, శాస్త్రిజీలకు ఘన నివాళులు

ఆదివారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీజీకి, విజయ్ ఘాట్ వద్ద లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

# టిఆర్ఎస్ కాదు.. బిఆర్ఎస్!

≫ మొగ్గు చూపుతున్నారని సిఎం కెసిఆర్ ఆదివారం నాటి సమావేశంలో వెల్లడించారని తెలుస్తోంది. సమావేశం అనంతరం మంత్రి సత్యవతి మాట్లాడు తూ దసరా రోజున జాతీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

రేగా కాంతారావు మాట్లాడుతూ ఈనెల 5న సిఎం కెసిఆర్ సంచలనాత్మక ప్రకటన చేయబోతున్నారని తెలిపారు. దేశ ప్రజలు,యువత సిఎం కెసిఆర్ రాక కోసం చూస్తున్నారని, కొన్ని పార్టీలు విలీనం కావడంతో పాటు మరికొన్ని పార్టీలు కలిసివచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విషాయలన్నింటినీ పార్టీ అధ్యక్షుడు సిఎం కెసిఆర్ వివరిస్తారన్నారు. ఈనెల ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో సమావేశమై... పార్టీలో అందరితో చర్చించి తీర్మానం పెట్టనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.19 గంటలకు పార్టీ అధినేత కెసిఆర్ ప్రకటన చేస్తారన్నారు. ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సిఎం కెసిఆర్ అభివృద్ధి చేశారన్నారు. రైతుబంధు, వ్యవసాయానికి ఉచిత కరెంట్, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు ఇవ్వడంతో పాటు ఎన్నో సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి.... తెలంగాణను దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. సిఎం కెసిఆర్ నాయకత్వాన్ని అందరూ కోరుకుంటున్నారని తెలిపారు.సిఎం కెసిఆర్ మేధస్సును భారత ప్రజలంతా కోరుకుంటున్నారని,కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఈనెల 5న గొప్ప నిర్ణయాన్ని ప్రకటించనున్నారని తెలిపారు. భారతదేశ ప్రజల తలరాతను మార్చే గొప్ప నిర్ణయం దసరా రోజు ప్రకటిస్తారన్నారు. సమావేశంలో భారతదేశ రాజకీయాల్లోకి రావాలని తాము సిఎంను కోరినట్లు కవిత తెలిపారు. తెలంగాణ బిడ్డలు అందుకుంటున్న అభివృద్ధి ఫలాలను..యావత్ దేశప్రజలకు అందించేందుకు జాతీయ రాజకీయాల్లోకి రావాలని కోరినట్లు పేర్కొన్నారు. బిజెపి మొండి వైఖరి కారణంగా తెలంగాణకు రావాల్సిన నిధులు,ప్రాజెక్టులు ఇవ్వడం లేదని, రాష్ట్ర యువత జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపించారు.

జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర సమితి పేరు మార్చాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. దసరా రోజున మధ్యాహ్నం టిఆర్ఎస్ విస్తృత స్థాయి భేటీలో పార్టీ పేరు మారుస్తూ తీర్మానం చేయనున్నారు. పార్టీ పేరును మార్చడం వల్ల కారు గుర్తు యథాతథంగా కొనసాగుతుందని నాయకులకు కెసిఆర్ వివరించారు. దేశ వ్యాప్తంగా తెలంగాణ మోడల్ పాలన అందించేందుకు జాతీయ రాజకీయాల్లోకి రావాలని వివిధ వర్గాలు కోరుతున్నాయని కెసిఆర్ వివరించారు. స్వతంత్ర భారత దేశంలో బిజెపి, కాంగ్రెస్ రెండూ పాలనలో విఫలమయ్యారని కెసిఆర్ చెప్పారు. పుష్కలమైన సహజ, మానవ వనరులు ఉన్నప్పటికీ దేశాన్ని ఆశించినంత అభివృద్ధి చేయలేక పోయాయన్నారు.

**తెలంగాణ మోడల్‌ను విస్తరించేందుకే...**

కొత్త రాష్ట్ర మైనప్పటికీ తెలంగాణను అన్ని రంగాల్లో శరవేగంగా ముందుకు తీసుకెళ్లి దేశాన్ని ఆకర్శించగలిగినట్లు కెసిఆర్ వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల పట్ల దేశ మంతా ఆకర్శితులవుతున్నారని తెలిపారు. తెలంగాణ మోడల్‌ను దేశమంతటికీ విస్తరించేందుకే జాతీయ రాజకీయాల్లోకి రావాలన్న వివిధ వర్గాలు కోరుకుంటున్నాయని తెలిపారు. కాబట్టి పార్టీ శ్రేణులు అంగీకరిస్తే టిఆర్ఎస్‌ను దేశ వ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉందని కెసిఆర్ చెప్పడంతో... మంత్రులు,జిల్లా అధ్యక్షులు ముక్తకంఠంతో ఆమోదించారు.

**భారత రాష్ట్ర సమితి పేరుకే మొగ్గు...**

జాతీయ పార్టీ ఏర్పాటుపై నేతలకు కెసిఆర్ స్పష్టత నిచ్చారు. వివిధ అంశాలపై లోతైన అధ్యయనం చేశాక ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర సమితి పేరు మార్చనున్నట్లు కెసిఆర్ వివరించారు. పార్టీ పేరుపై అభిప్రాయాలు కోరగా.. భారత రాష్ట్ర సమితి.. నయా భారత్‌సమితి వంటి పేరన్లను నాయకులు సూచించారు. కొత్తగా పార్టీ ఏర్పాటు చేస్తే కారు గుర్తు కొనసాగకపోవచ్చు కాబట్టి, ఉన్న పార్టీ పేరునే మారిస్తే సాంకేతికంగా ఇబ్బంది ఉండదని కెసిఆర్ వివరించారు. కెసిఆర్ సహా ఎక్కువ మంది నేతలు భారత రాష్ట్ర సమితి పేరుకే మొగ్గు చూపారు.

**డిసెంబర్ 9న ఢిల్లీలో బహిరంగ సభ...**

ఈనెల 5న ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు,ఎమ్మెల్సీలు,జిల్లా పరిషత్ ఛైర్మన్లు,రాష్ట్ర కార్యవర్గం సహా కీలక ప్రతినిధులు సమావేశం కానున్నారు. టిఆర్ఎస్ పేరు మారుస్తూ తీర్మానంపై సంతకాలు చేశాక... మధ్యాహ్నం ఒంటిగంటా 19 నిమిషాలకు కెసిఆర్ ఆమోద ముద్ర వేయనున్నారు. ఆ రోజు వివిధ రాష్ట్రాల నుంచి పలువురు నేతలు,ప్రతినిధులను ఆహ్వానించాలని నిర్ణయించారు. 6వ తేదీన టిఆర్ఎస్ పేరు మార్పుపై ఎన్నికల కమిషన్‌కు అఫిడవిట్ సమర్పించనున్నారు. పార్టీ పేరు మార్పును ఈసీ ఆమోదించిన తర్వాత పూర్తి స్థాయి జెండా, అజెండా ప్రకటించనున్నారు. డిసెంబర్ 9న ఢిల్లీలో బహిరంగ సభ నిర్వహించాలని కెసిఆర్ నిర్ణయించారు. టిఆర్ఎస్ జాతీయ పార్టీగా ఎందుకు మారాల్సి వచ్చిందనే పూర్తి విషయాలను కెసిఆర్ ఢిల్లీ సభలో వెల్లడించనున్నారు.

## ఇండోనేషియా ఫుట్‌బాల్ స్టేడియంలో తొక్కిసలాట

≫ నగరంలోని కంజూర్‌హాన్ స్టేడియంలో శనివారం రాత్రి నిర్వహించన ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన జరిగింది. ఆధునిక ప్రపంచంలో క్రీడల సందర్భంగా జరిగిన అత్యంత దారుణ ఘటన ఇదేనని చెబుతున్నారు.

ఫుట్‌బాల్ జట్ల అభిమానుల మధ్య జరిగిన ఘర్షణే తొక్కిసలాటకు దారితీసింది. పెర్సె బాయసురబాయ జట్టు చేతిలో అరెమా ఎఫ్‌సి జట్టు ఓడిపోయింది. ఆ సందర్భంగా ఇరు జట్ల అభిమానులు ఘర్షణకు దిగారు. అభిమానులను చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి, లాఠీఛార్జి చేశారు. దాంతో స్టేడియం నుంచి బయటకు వెళ్లేందుకు ప్రేక్షకులు ఒక్కసారిగా గేట్‌వైపు పరుగుపెట్టడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్టేడియంలో లాఠీఛార్జి చేయాల్సినంత గొడవేమీ జరగలేదని, పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడం కూడా తొక్కిసలాటకు కారణమైందని వారు చెబుతున్నారు. మ్యాచ్ చూడటానికి మహిళలు, చిన్నారులు కూడా వచ్చారన్న జ్ఞానం లేకుండా భద్రతా సిబ్బంది దురుసుగా వ్యవహరించిందని వారు విమర్శిస్తున్నారు.

స్టేడియం పూర్తి సామర్థ్యం 42 వేలు కాగా, టికెట్లన్నీ అమ్ముడుపోయాయని అధికారులు తెలిపారు. గొడవ జరిగినపుడు దాదాపు మూడువేలమంది వరకూ మైదానంలోకి వచ్చారని, వారిని అదుపు చేయడానికే టియర్ గ్యాస్ ప్రయోగించామని పోలీసులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఆందోళనకారులు పోలీసుల వాహనాలను ధ్వంసం చేశారు. 13 వాహనాలను తగులబెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో.. దీనిపై దర్యాప్తునకు ఆదేశించారు. పరిస్థితులు చక్కబడేవరకూ ఎలాంటి ఫుట్‌బాల్ మ్యాచ్‌లూ నిర్వహించవద్దని అసోసియేషన్‌కు సూచించారు.

## భారీ ఉగ్రకుట్ర భగ్నం

≫ హైదరాబాద్‌లో బాంబు దాడులకు కుట్రలు పన్నుతూనే వున్నాడు. ఈ క్రమంలో పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల నుంచి జాహెద్‌కు భారీగా నిధులతో పాటు హ్యాండ్ గ్రానేడ్లు అందాయి. ఈ గ్రానేడ్లను వాడి దసరా రోజున జంట నగరాలలో విధ్వంసం సృష్టించేందుకు జాహెద్ వ్యూహం రచించాడు. ఇందుకుగానూ తనకు నమ్మకంగా వున్న స మీయుద్దీన్, హాసన్ ఫారుక్‌లను ఎంచుకు న్నాడు. ఈ ఇద్దరు కూడా ఉగ్రవాదులే కావడం గమనార్హం. వీరికి కూడా పాక్‌లోని ఉగ్రవాదుల నుంచి దండిగా డబ్బులు అం దాయి. ఇదే సమయంలో పాక్‌లో రహస్యంగా వున్న హైదరాబాద్‌కు చెందిన ఉగ్రవాదులు షర్వతుల్లా ఘోరీ అలియాస్ సిద్ధిఖీ, సిద్దిఖీ బిన్ ఉస్మాన్ అలియాస్ రఫీక్, అ బ్దుల్ హంజా అలియాస్ మజీద్‌లు జాహెద్‌కు సహకారం అందించారు. పాక్‌లో తలదాచుకున్న షర్వతుల్లా ఘోరీ, సిద్దిఖీ బిన్ ఉస్మాన్, అబ్దుల్ హంజాలు నగరంలో గత ంలో జరిగిన అనేక ఉగ్రదాడుల్లో నిందితులుగా వున్నారు. 2002లో దిల్‌సుక్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద జరిగిన బాంబు దాడి, 2005లో సిటీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన ఆత్మాహుతి దాడి, 2004లో సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ గణేష్ దేవాలయం వద్ద పేలుడుకు జరిగిన కుట్రలోనూ నిందితులుగా వున్నారు.

దీంతో పాటు ముంబాయిలో జరిగిన ఉగ్ర దాడుల్లో కూడా వీరి పాత్ర వెలుగు చూసింది. కాగా హైదరాబాద్‌లో దసరా పండగ వేళ వరుస దాడులకు పన్నిన కుట్ర భ గ్నం అయిన తరువాత ఇందులో కీలక నిందితుడుగా వున్న జాహెద్‌ను పోలీసులు విచారించగా అనేక విషయాలను వెల్లడించాడు. పాకిస్తాన్‌లో వున్న షర్వతుల్లా ఘోరీ, సిద్దిఖీ బిన్ ఉస్మాన్, అబ్దుల్ హంజాలతో తాను నిత్యం మాట్లాడుతూనే వున్నానని, వారు తనకు అక్కడి ఉగ్రవాదులతో కలిసి భారీగా డబ్బులు పంపడంతో పాటు దస రా పండగ నాడు బాంబు దాడులకు పథకం రచించాలని ఆదేశించారని వెల్లడించాడు. వీరి ఆదేశాలతోనే తాను తనతో నమ్మకంగా వుండే సమీయుద్దీన్, మాజ్ హాసన్ లను ఉగ్రవాదులుగా భర్తీ చేశానని, వారికి కూడా డబ్బుల ఆశచూపి తనతో వుండేలా చేసుకున్నానని జాహెద్ తెలిపాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సిటీ పోలీసు లు వీరి ఇళ్లపై దాడులు చేయగా నాలుగు హ్యాండ్ గ్రే నేడ్లతో పాటు భారీగా నగదు లభ్యమయ్యింది. ఇందులో జాహెద్ ఇంట్లో రెండు హ్యాండ్ గ్రేనేడ్లతో పాటు మూడు లక్షల 91 వేల 800 రూపాయల నగదు, రెండు సెల్‌ఫోన్లు లభించగా సమీయుద్దీన్ వద్ద ఒక హ్యాండ్ గ్రేనేడ్ లక్షా 50 వేల రూపాయల నగదు, ఒక సెల్‌ఫోన్ పట్టుబడింది. మూడవ ఉగ్రవాది మాజ్ హాసన్ వద్ద ఒక హ్యాండ్ గ్రేనేడ్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు లభించాయి. ఈ కేసులో మరింత మంది ఉగ్రవాదులు వుండవచ్చనే అ నుమానంతో పోలీసులు జంట నగరాలతో పాటు శివార్లలో పలుచోట్ల సోదాలు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించసాగారు.

# టిఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి

### ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేయండి

### బిజెపి కోర్ కమిటీ సమావేశంలో సునీల్ బన్సాల్

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను మరింగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని బిజెపి నేతలకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సునిల్ బన్సాల్ సూచించారు. ఆదివారం బిజెపి కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నేతలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, వివేక్, గరికటపాటి, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, విజయశాంతిలు హాజరు కాగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కరీంనగర్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునుగోడు ఉప ఎన్నికకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఇప్పటికే మండల ఇంచార్జ్‌లు, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో జర్చించిన బన్సల్ ఎన్నికలలో ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న అంశాలపై నేతలకు దిశానిర్దేశనం చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక స్థానంపై సమావేశంలో జర్చించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటిని నెరవేర్చడంలో ఏవిధంగా విఫలం అవుతుందన్న అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా బిజెపి ప్రభుత్వం చేపట్టి కార్యక్రమాలను వివరించాలన్నారు. ఆపరేషన్ ఆకర్ష్ వేగవంతం చేయాలన్నారు. మునుగోడు ఉప ఎన్నిక ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీతో సమావేశమైన పలు సూచనలు చేశారు.

**టిఆర్ఎస్ నకిలీ ఓట్లు నమోదు చేయిస్తుంది: వివేక్**

ఈనెల 7న మునుగోడు నియోజవకర్గంలోని అన్ని గ్రామాల్లో బిజెపి ఆధ్వర్యంలో బైక్ యాత్రలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపి వివేక్ అన్నారు. మొత్తం 189 గ్రామల్లో బైక్ యాత్రలు జరుగుతాయన్నాఉ. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు, మండల ఇంచార్జ్‌లు, ముఖ్యనేతలు పాల్గొంటాన్నారు. బూత్ కమిటీలను వెంటనే వేయాలని బన్సాల్ సూచించరన్నారు. ఈనెల 10న బూత్ కమిటీ సభ్యులతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సమావేశం అవుతారన్నారు. మునుగోడులో నకిలీ ఓటర్లను టిఆర్ఎస్ నమోదు చేయిస్తుందన్నారు. ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. కెసిఆర్ అసమర్ధ పాలనను గ్రామగ్రామాన వివరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## మైసూరు చేరుకున్న రాహుల్ యాత్ర

≫ వ్యతిరేకంగా గాంధీ పోరాడినట్లే, మహాత్ముడిని చంపిన సిద్ధాంతంపై తాము యుద్ధం ప్రకటించామని రాహుల్ అన్నారు. సాయంత్రం కూడా రాహుల్ తన యాత్రను కొనసాగించారు. రాహుల్ యాత్ర మైసూర్ చేరుకున్న సందర్భంగా భారీ జన సమీకరణ జరిగింది. జోరున వర్షం కురుస్తున్నా రాహుల్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా రాహులో భారత్‌ను ఐక్యం చేయకుండా మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరు. భారత్ వాణిని వినిపించకుండా మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు సాగే భారత్ జోడో యాత్రను ఎవరూ అడ్డుకోలేరు అంటూ హిందీలో ట్వీట్ చేశారు.

### దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ఎపి సిఎం జగన్

**విజయవాడ, అక్టోబరు2, ప్రభాతవార్తప్రతినిధి:** అమ్మ లగమ్మ అమ్మ శ్రీకనకదుర్గమ్మ మూల నక్షత్రం రోజున శ్రీసరస్వతి దేవిగా సాక్షాత్కరిస్తున్న సంద ర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీఎం జగన్ పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రిఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అందునా మూల నక్షత్రం కావడంతో భక్తులు దుర్గమ్మను దర్శించుకునేందుకు లక్షల సంఖ్యలో భక్తుల తరలివచ్చారు.వారి నడుమ సంప్రదాయక దుస్తులను ధరించిన సీఎం జగన్ శిరస్సుపై ప్రత్యేక పళ్ళెరంలో అమ్మవారికి పట్టుభద్రతలను సమర్పించేందుకు తరలివచ్చారు. భారీ బందోబస్తు ఆయన సందర్భంగా ఏర్పాటు చేసారు.ఏపీ ప్రభుత్వం తరపున అమ్మవారికి పటువస్త్రాలను అందించేందుకు వచ్చిన సీఎం జగన్‌కు వేదపఠనం చేస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారితో పాటు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ,హోం మంత్రి తానేటి వనిత,గృహ నిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుశాసనసభ్యులు వెల్లంపల్లిశ్రీనివాస్,మల్లాది విష్ణు, కొడాలి వెంకట్రామయ్య (నాని),ఎంఎల్‌సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌లు వారితో పాటు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు.ఈ క్రమంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ దుర్గమ్మతల్లికి సమర్పించే నిమిత్తం పటువస్త్రాలతో పాటు,పసుపు కుంకుమలు అందజేసారు.

# గాంధీజీ సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శం



గాంధీ ఆసుపత్రి ఆవరణలో ఆదివారం మహాత్ముని విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం సభలో ప్రసంగిస్తున్న సిఎం కెసిఆర్

≫ చిల్లరమల్లర ప్రయత్నాలు జరుగుతున్నాయని వాటిని ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. కొన్ని రోజులుగా మహాత్ముడితే కించపరిచే విధంగా సూటిపోటీ మాటలు వినిపిస్తున్నాయని, అలాంటి మాటలు విన్నప్పుడు చాలా బాధకలుగుతోందని తెలిపారు. భిన్నమైన సంస్కృతులు, అనేక మతాలు, జాతులు,వేశ, భాషలువేరైనప్పటికి దేశం లో జీవించే ప్రతి భారతీయుడిలో స్వతంత్ర్య కాంక్షను రగిలించి స్వాతంత్ర్యం వైపు నడిపించిన మహాత్మగాంధీని ప్రపంచ దేశాలలోని అనేక మంది మహాత్ములు కూడా ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. చేపే ప్రతి పనిలో ఏదోఒక సందేశాన్ని అందించారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్‌పటేల్, మౌలాన అబ్దుల్ కలాం ఆజాద్‌లాంటిఎంతోమంది నాయకులు మహాత్మగాంధీ ద్వారా ప్రేరణ పొందారన్నారు. ఆస్తీని, కుటుంబాన్ని త్యాగం చేసి స్వాతంత్ర్య పోరాటం చేసిన గాంధీగురించి కించపరిచే విధంగా మాట్లాడుతున్నారన్నారు. చిల్లర వ్యక్తులు చేసే పనుల వల్ల మహాత్ముడి ప్రభ తగ్గదని, మరుగుజ్జులు ఏనాటికి మహాత్ములు కాలేరని విమర్శించారు. వారు వెకిలిగానే చరిత్రలో మిగిలిపోతారన్నారు. జై జవాన్, జైకిసాన్ నినదించిన లాల్‌బహుదూర్ శాస్త్రి జన్మదినం ఈరోజేనని తెలిపారు. జవానుల, కిసాన్‌లు దహించకుపోతున్నారన్నారు.మద్దతుధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటివి మేధావులు గుర్తించాలన్నారు. మార్టిన్ లూథర్ వంటివారు గాంధీమార్గాన్ని అభినందించారని, బౌద్ధ గురువు దలైలామ కూడా గాంధీ సిద్ధాంతాన్ని అభినందించారన్నారు.

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కొనియాడిన ముఖ్యమంత్రి**

దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో మహాత్మగాంధీ చేసిన కృషి ఎంతో గొప్పదని ముఖ్యమంత్రి కేసీఆర్ కొనియాడారు. సమస్యలకు యుద్దాలు పరిష్కారం కాదని చాటిచెప్పిన మహనీయుడు గాంధీజీ అని, ప్రేమ, ఆప్యాయత ద్వారా అసహాయతను ఎదుర్కోవచ్చని చెప్పిన మహనీయుడు మహాత్మగాంధీ అని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. అలాంటి మహానుభావుడి విగ్రహం,అదీకూడా ద్యాన ముద్రలో ఉన్న గాంధీ విగ్రహాన్ని, ఎంతో ప్రతిష్టాత్మకమైన గాంధీ ఆస్పత్రి వద్ద 16 అడుగులతో ఏర్పాటు చేయడం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంస్కారానికి నిదర్శనమన్నారు. ఆయన శ్రమకు చిరస్థాయిగా కీర్తి దక్కుతుందన్నారు.

**ప్రాణాలను ఫణంగా పెట్టిన వైద్యులు**

కరోనా మహమ్మరి దడదడలాడించే సమయంలో అత్యంత ధైర్యంగా వైద్య సేవలు అందించిన విధానం ఎంతో గొప్పదన్నారు. గాంధీగారిచ్చిన ధైర్యాన్ని పుణికి పుచ్చుకొని వైద్యం అందించారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల వారు వైద్యం చేయలేమని పంపించిన వేసిన పేషెంట్లకు కూడా ఇక్కడ వారికి వైద్యం చేసి ప్రాణాలను కాపాడారు. వైద్యశాఖ మంత్రిగా హరిష్‌రావు కృషిని అభినందించారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అత్భుతమైన వైద్య సేవలు అందించి అనేకమంది ప్రాణాలను కాపాడారని కొనియాడారు.

ఇలాంటి వైద్యులు నిరంతరం శ్రమించడంవల్లే గాంధీ ఆస్పత్రికి కీర్తిప్రతిష్టలు దక్కుతున్నాయన్నారు. ఈ కార్యాక్రమంలో మంత్రులు హరిష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దానంనాగేందర్, మాగంటి గోపినాథ్, ముఠాగోపాల్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తదిరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**3-10-2022 సోమవారం**

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం

ఆశ్వయుజ మాసం, శుక్ల పక్షం, కార్తె హస్త

అష్టమి మ.3-36; పూర్వాషాఢ రా.12-25

వర్జ్యం ఉ.11-01 ల 12-30

రా.కా.ఉ.7-30 - 9-00 వ

యమగండం ఉ.10-30 ల 12-00 వ

దుర్ముహూర్తం మ.12-24 ల 1-12; మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** ధర్మ రక్షణకై పాటుపడతారు చిరు వ్యాపారులకు పోటీ అధికం.

**వృషభం:** దేవాలయాలు సందర్శిస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యం.

**మిథునం:** స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. రోజంతా ఉత్సాహంగా గడుస్తుంది.

**కర్కాటకం:** ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులు.

**సింహం:** ఉద్యోగులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ముఖ్యమైన పనులు పూర్తి.

**కన్య:** ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. భూ వివాదాలు తీరుతాయి.

**తుల:** సాహస నిర్ణయాలు అమలు. ఆకస్మిక సంఘటనలు జరిగే సూచనలున్నాయి.

**వృశ్చికం:** చోర భయం పొంచి వుంది, విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త.

**ధనుస్సు:** ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.

**మకరం:** కుటుంబ గౌరవం పెంపొందుతుంది. విద్యార్థులకు పరీక్షల్లో విజయం.

**కుంభం:** శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. తీర్థ యాత్రలు చేస్తారు.

**మీనం:** చిరకాల వాంఛ నెరవేరుతుంది. సన్నిహితుల సహకారం లభిస్తుంది.

*- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్*

## బిజెపి కార్యాలయంలో గాంధీ, శాస్త్రి జయంతి

### పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

**హైదరాబాద్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మహాత్మగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ రాజకీయాలతో పాటు సేవ చేయటం బిజెపికి సాధ్యం అన్నారు. ప్రధాని జన్మదినం సందర్భంగా 15 రోజులు పాటు సేవా పక్షం పేరుతో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారిని ఆదుకోవడానికి మోడి ఆదేశాల మేరకు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలన్నారు. జై కిసాన్ నినాదాన్ని వెలుగులోకి తెచ్చింది లాల్‌బహుదూర్‌శాస్త్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు సునిల్ బన్సాల్, ఈటల రాజేందర్, విజయశాంతి, వివేక్, గరికపాటి, జితేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డిలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో తాజా కేసులు 66

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్2:** రాష్ట్రంలో కరోనా పాజిటీవ్ కేసులు మెల్లగా తగ్గుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ఒక్క రోజులో 66 కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.ఇప్పటివరకు రాష్ట్రంలో 8,38,035పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు.రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది.ఒక్క రోజులో 6511 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,76,92,503మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటి వరకు కరోనా నుంచి 8,33,294 మంది కోలుకోగా (99.43శాతం) ఆదివారం 79 మంది కోలుకున్నారు,మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 630కు చేరింది. ఆదివారం నమోదైన కేసుల్లో జిహెచ్ఎంసి పరిధిలో 44 కరోనా పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో1, భద్రాద్రి కొత్తగూడెంలో0,జగిత్యాలలో0, జనగామ్‌లో0 ,జయశంకర్ భూపాలపల్లిలో0,జోగులాంబ గద్వాలలో0, కామారెడ్డిలో0, కరింనగర్‌లో1 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి.

## వాంటెడ్ టెర్రరిస్టు జాహెద్‌సహా ఎనిమిది మందిపై సిసిఎస్‌లో కేసు

ట్రై కమిషనరేట్లలో భద్రత కట్టుదిట్టం.. అనుమానిత ప్రాంతాల్లో సోదాలు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** జంట నగరాలలో దసరా పండగ వేళ వరుస బాంబు దాడులతో మారణహోమం సృష్టించాలని పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పన్నిన కుట్రను సిటీ పోలీసులు భగ్నం చేసిన నేపథ్యంలో ఈ ఘటనపై సిసిఎస్‌లో ఆదివారం నాడు ఎనిమిది మంది ఉగ్రవాదులపై కేసు నమోదయ్యింది. ఇందులో హ్యాండ్ గ్రేనేడ్లతో పాటు పోలీసులకు పట్టుబడ్డ జాహెద్, సమీయుద్దీన్, మాజ్ హసన్‌లతో పాటు పోలీసుల అదుపులో వున్నట్లుగా వార్తలు వస్తున్న సుజి, ఆదిల్, అఫ్రోజ్, అబ్దుల్, సోహైల్ ఖురేషిలపై ఉగ్రవాద నిరోధక చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా ఉగ్రవాదుల కుట్ర భగ్నం దరిమిలా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధుల్లో భద్రత పెంచారు. దసరా వేడుకలు జరిగే ప్రాంతాలతో పాటు ఇతర అనుమానిత ప్రదేశాలలో సోదాలు చేబట్టారు. భద్రతపై ఉన్నతాధికారులు సమీక్షించారు. దసరాతో పాటు దీపావళి పండగలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆ దేశించారు. పాతబస్తీతో పాటు ఇతర చోట్ల గతంలో ఉగ్రవాద కేసుల్లో అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన వారితో పాటు కేసుల నుంచి విముక్తి పొందన వారు, ఉగ్రవా దులకు సానుభూతిపరులుగా వున్న వారి ఇళ్లలో పోలీసులు ముమ్మరంగా సోదాలు చేబట్టారు. ఈ సందర్భంగా కొన్నిచోట్ల అనుమానిత వస్తువులతో పాటు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సాహిత్యం లభ్యమైనట్లు తెలిసింది. అనుమానిత వస్తువులు, ఉగ్రవాద సాహిత్యం వుంచుకున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

**ఐఎస్ఐ ఉగ్రవాదులకు ముందుగానే సమాచారం?**

ఇదిలావుండగా దసరా పండగ వేళ జంట నగరాలలో బాంబు దాడులతో మారణహోమం సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రేరేపిత హైదరాబాద్ ఉగ్రవాదులు పన్నిన కుట్ర చివరి నిమిషంలో భగ్నం అవడం అటుంచితే దీనిపై హైదరాబాద్, ముంబాయి, తిహార్ జైళ్లలో వున్న కరుడుగట్టిన ఉగ్రవాదులకు ముందుగానే సమాచారం అందినట్లు గా తెలిసింది. ఈ మూడు జైళ్లలో 25 మందికి పైగా కరుడుగట్టిన ఐఎస్ఐ ఉగ్రవాదులు వుండగా వీరి కదలికలపై నిరంతరం నిఘా వుంచినా ఇందులో కొందరి వద్ద ప లుమార్లు సెల్‌ఫోన్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇదంతా అవాస్తవమని జైళ్ల అధికారులు ఖండించినా వాస్తవంలో జరుగుతున్నది మరోలా వుందనేది బహిరంగ ర హస్యమే. ఐఎస్ఐ ఉగ్రవాదులను కట్టుదిట్టమైన భద్రత మధ్య జైళ్లలో ప్రత్యేకమైన బ్యారెక్‌లలో వుంచుతున్నా వీరిలో కొందరు తరచూ జైలు సిబ్బందితో గొడవపడుతూ ప్రతిచిన్న కారణంతో అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జైళ్ల బయట వున్న సర్కారు ఆసుపత్రుల్లోనే వీరు చికిత్స పొందుతున్నా అక్కడ వీరిని కొందరు వ్యక్తులు కలుస్తున్నారని, ఈ సమయంలోనే పాక్‌లో వున్న తమ బాస్‌లతో ఇక్కడి ఉగ్రవాదులు మాట్లాడుతున్నారని అనేకమార్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్, ముంబాయి. తిహార్ జైళ్లలో వున్న కరుడుగట్టిన ఉగ్రవాదులకు దసరా పండగ వేళ జంట నగరాలలో వరుస బాంబు దాడులతో మారణహోమం సృష్టిం చాలనే పథకం ముందుగానే సమాచారం అందిందని విశ్వస నీయంగా తెలిసింది. దీనిపై జైళ్ల శాఖ అధికారఉలతో పాటు పోలీసులు కూడా విచారణ చేబట్టారని సమాచారం.

## ఫోన్ ట్యాపింగ్ సరిపోవడం లేదా?

ఇంటలిజెన్స్ అధికారులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలోకి వచ్చిన ఇంటలిజెన్స్ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బిజెపి రాష్ట్ర రాష్ట్రంలో మునుగోడు ఉప ఎన్నికకు సంబంధించి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బన్సాల్ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. అయితే ఈ సమావేశంలోకి ఇంటలిజెన్స్ అధికారులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నది సరిపోవడం లేదా? కార్యాలయంలోకి వస్తే బాగోదన్నారు. ప్రగతిభవన్, తెలంగాణ భవన్ లో ఐబి వాళ్లను పెడతా ఒప్పుకుంటారా అంటూ ప్రశ్నించారు. అక్కడ ఒప్పు కుంటే ఇక్కడ రాష్ట్ర ఇంటలిజెన్స్ వారికి పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కేబిన్ చేయిస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హీటెక్కిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక!



**పరస్పరం పరోక్ష విమర్శలతో ప్రారంభించిన ప్రచారం**

**పార్టీ బలోపేతానికే పోటీ : మల్లికార్జునఖర్గే**

**తానైతే సంస్థాగత మార్పులు తెస్తా : శశిథరూర్**

**న్యూఢిల్లీ, అక్టోబరు 2 :** కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల రేస్‌లో మిగిలిన ఆ పార్టీ సీనియర్ నేతలు మల్లికార్జునఖర్గే, శశిథరూర్‌లు గాంధీజయంతి రోజున ప్రచారానికి తెరతీశారు. వారిద్దరూ తానే సరైన అభ్యర్థినవుతానంటూ ఎవరికి వారు ఆయా మీడియా సంస్థల ముందు తమ అనుభవాలను, అధ్యక్ష స్థానానికి ఎన్నికైతే సంస్థాగతంగా తాము చేపట్టాలనుకుంటున్న సంస్కరణల గురించి చెప్పుకొచ్చారు. అంతేకాదు ఒకరిపై ఒకరు పరోక్ష విమర్శలకూ దిగారు. ఆదివారం ఈ ఇరువురూ మీడియా సంస్థలకిచ్చిన ఇంటర్వ్యూల్లో తామెందుకోసం పోటీలో నిలిచింది చెబుతూనే ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు.

అధ్యక్ష స్థానానికి ఏకాభిప్రాయం ఉన్న నేతను ఎంచుకోవడమే సరైందని థరూర్‌కు తాను సూచించానని ఖర్గే అన్నారు. తాను పోటీ పడటానికి కారణం సీనియర్ నేతల ప్రోత్సాహమేనని ఖర్గే తెలిపారు. తాను ఎవరికీ వ్యతిరేకంగా పోటీ పడటంలేదని, కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం, పార్టీని బలోపేతం చేయడం కోసం పోరాడుతున్నానని ఖర్గే అన్నారు. మహాత్ముడి జన్మదినం రోజునే తన నిలిచానని ఖర్గే అన్నారు. తనను దళిత నేతనంటూ పరిమితం చేయొద్దని గతంలోనూ ఖర్గే అన్నట్లు రాజకీయ పరిశీలకులు ఆయన వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తున్నారు. ఖర్గేకు పలువురు సీనియర్ నేతలతోపాటు పరోక్షంగా సోనియా, రాహుల్‌ల మద్దతుగా కూడా ఉన్నందున ఆయన గెలుపు ఖాయమని పరిశీలకులు చెబుతున్నారు.

ఇక థరూర్ విషయానికొస్తే.. ఆయన వ్యవహారశైలి పలు సందర్భాల్లో వివాదాస్పదమైంది. ఈ ఎన్నికల సమయంలోనూ థరూర్ తన ప్రచారం కోసం వినియోగించిన దేశపటంలోనూ లోపాలున్నట్లు గుర్తించడంతో ఆయన ఆ తర్వాత వాటిని సరి చేసుకోవడం గమనార్హం. మరోవైపు అధిష్ఠానానికి వ్యతిరేకంగా గళం విప్పిన జి 23 రెబెల్ నేతల్లో ఒకరిగా థరూర్‌కు పేరుంది. దాంతో, సోనియా కుటుంబ విధేయులెవ్వరూ థరూర్‌కు మద్దతు ఇచ్చే పరిస్థితి లేదు. దాంతో, తనదైన పద్ధతిలో ఆయన ప్రచారాన్ని సాగిస్తున్నారు. పార్టీలో యువ కార్యకర్తల గళం వినక తప్పదని థరూర్ అంటున్నారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే పార్టీ సంస్థాగత నిర్మాణంలో మార్పులు ప్రచారం ప్రారంభిస్తున్నానని ఖర్గే తెలిపారు. తనకు పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా చాలా ఏళ్లు పని చేసిన అనుభవం ఉన్నదని ఖర్గే చెప్పుకొచ్చారు. అవే సిద్ధాంతాలు, నైతిక విలువలను ముందుకు తీసుకువెళ్లడానికే తాను పోటీ పడుతున్నానని ఖర్గే అన్నారు. తాను ఈ ఎన్నికల్లో దళిత నేతగాగాక, కాంగ్రెస్ నేతగా పోటీలో తెస్తానంటున్నారు.

సీనియర్లను గౌరవిస్తూనే జి 23 అసమ్మతి నేతల డిమాండ్లను కూడా పరిశీలిస్తానని థరూర్ మరోసారి స్పష్టం చేశారు. అభ్యర్థుల మధ్య బహిరంగ చర్చ ఉండాలన్నదే తన అభిప్రాయమని కూడా ఆదివారం ఓ మీడియా ముందు వెల్లడించారు.

ఇటీవల బ్రిటన్‌లో అధికార కన్సర్వేటివ్ పార్టీ తమ నేతను ఎన్నుకునేందుకు అభ్యర్థుల మధ్య చర్చాగోష్ఠులు నిర్వహించడాన్ని థరూర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎదుర్కొంటున్న సవాళ్ల నుంచి బయటపడాలంటే సమర్థవంతమైన నాయకత్వం, సంస్థాగత సంస్కరణలు అవసరమని ఆయన అన్నారు. ఖర్గేలాంటి నాయకులు పార్టీలో మార్పులు తీసుకురాలేరని, ఇప్పుడున్న వ్యవస్థే కొనసాగుతుందని థరూర్ కాస్త ఘాటుగానే వ్యాఖ్యానించారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే కార్యకర్తల అంచనాలకు అనుగుణంగా పార్టీలో మార్పులు తెస్తానని థరూర్ అన్నారు. అలాగే తాను నెహ్రూ..గాంధీ కుటుంబానికి వ్యతిరేకిని కాదన్న అభిప్రాయం కూడా ఆయన మాటల్లో వ్యక్తమైంది. వారు చేసిన సేవలకు పార్టీ కార్యకర్తల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంటుందని థరూర్ అన్నారు.

# భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ఆర్‌ఎస్‌ఎస్ నిరంతర కృషి

● దక్షిణ భారత సమక్షేత్ర ప్రచారక్ శ్రీరామ్‌భరత్



ప్రార్థన చేస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు

**హైదరాబాద్ (నార్సింగి), అక్టోబరు 2, ప్రభాతవార్త :** భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) నిరంతరం కృషి చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ భారత సహక్షేత్ర ప్రచారక్ శ్రీరామ్‌భరత్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ గోల్కొండ భాగ్ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీర్ గ్రామంలో "విజయ దశమి" వేడుకలను నిర్వహించింది. ఈ సందర్భంగా గణవేష్ ధరించిన వందలాదిమంది స్వయం సేవక్‌లు బండ్లగూడ జగీర్ గ్రామ పురవీధుల్లో నిర్వహించిన "పథ సంచలన్" ప్రజలందరిని విశేషంగా ఆకట్టుకుంది. గ్రామస్థులు స్వయం సేవక్‌లపై పూలవర్షం కురిపించారు. సభా వేదికపై నుంచి శ్రీరామ్ భరత్ మాట్లాడుతూ రావణుడిని శ్రీరాముడు, మహిషాసురుడిని కాళికాదేవి అంతమొందించిన రోజును విజయదశమిగా జరుపుకోవడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తున్నదని వివరించారు. ప్రజలలో సంఘటిత శక్తిని పెంచేందుకు సంఘ శాఖలు నిత్యం కృషి చేస్తున్నాయన్నారు. స్త్రీని దేవతగా కొలిచే ఏకైక ధర్మం హిందూ ధర్మం అని తెలిపారు. రోగాలను బట్టి వైద్యం ఇస్తున్నట్లే రాక్షసులను తుదముట్టించేందుకు దేవుడు వివిధ రూపాలలో అవతరించాడని వివరించారు.

1925లో విజయదశమి రోజే ఆర్‌ఎస్‌ఎస్‌ను డాక్టర్‌జీ ప్రారంభించారని తెలిపారు. హిందూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు సంఘ శాఖలు పని చేస్తున్నా యన్నారు. సంఘటిత సమాజ స్థాపనే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమన్నారు. మన విద్యా వ్యవస్థ, సేవా కార్యక్రమాలన్నింటిని బ్రిటిష్‌వారు ధ్వంసం చేసి, మనలో మనకు పోట్లాటలు పెట్టి వెళ్లారన్నారు. మనవైన పద్ధతులను పునరుద్ధరించుకుంటేనే మనలోని సహజ శక్తి వికసిస్తుందన్నారు. ఈ దేశ విచ్ఛిన్నానికి కుట్ర పన్నుతున్న పిఎఫ్ఐని నిషేధిస్తే ప్రతిపక్షాలు ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. పిఎఫ్ఐ నిషేధాన్ని మెజారిటీ ముస్లిం వర్గం కూడా స్వాగతిస్తుం దన్నారు. ధర్మ రక్షణకు మనమంతా పాటుపడుదామని శ్రీరామ్ భరత్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, వందలాదిమంది స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు 'బతుకమ్మ' సెలవు ఇవ్వకపోవడం దారుణం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** ఉద్యోగులకు బతుకమ్మ పండగ సెలవు ఇవ్వకపోవడం దారుణం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. ఈ మేరకు ప్రజలందరూ సంతోషంగా జరుపుకునే పండగకు సెలవు ఇవ్వకుండా కెసిఆర్ రాక్షాసానందం పొందుతున్నారన్నారు. తెలంగాణ అంటే బతుకమ్మ, బతుకమ్మ అంటేనే తెలంగాణ అన్నారు. అంతటి విశిష్టమైన బతుకమ్మ పండగకు సెలవు ఇవ్వకపోవడాన్ని ఏమనుకోవాలని ప్రశ్నించారు. అసలు కెసిఆర్ రాష్ట్రానికి ముఖ్యమంత్రినా? వేరే రాష్ట్రానికి సిఎంగా ఉన్నారా? అంటూ ప్రశ్నించారు. అవసరం అయితే తెలంగాణ ఉద్యోగులు అంతా విధులను బహిష్కరించాలన్నార. బతుకమ్మ పండగను సంతోషంగా జరుపుకోవాలంటూ, ప్రభుత్వ ఉద్యోగులను బండి సంజయ్ పిలుపునిచ్చారు.

**సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు**

రాష్ట్ర ప్రజలందరికి సద్దుల బతుకమ్మ పర్వదినం సందర్భంగా బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు పూలను పూజిస్తూ అత్యవంత వైభవంగా నిర్వహించుకునే గొప్పపండగ బతుకమ్మ, విజయ దశమిని స్వాగతిస్తూ ముగిసే సద్దుల బతుకమ్మ పండగను ప్రజలంతా ఘనంగా జరుపు కోవాలన్నారు.

## బిజెపి పాలనలో పెరిగిన ఆర్థిక అసమానతలు

సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క



**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** గాంధీ ఆలోచన విధానం ప్రజల ఆలోచన విధానం, ప్రభుత్వ పరిపాలన విధానం కావాలని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. మన దేశంలో మహాత్మా గాంధీ పుట్టడం అదృష్టం అని, ఆయన ఆలోన విధానాలు ఆచరణ యోగ్యం అన్నారు. హిందూ ముస్లిం భాయ్‌భాయ్ అంటూ జాతిని ఏకం చేసిన గాంధీ ఆలోచనలకు భిన్నంగా దేశ మత ప్రాతిపదికగా విభజించాలని బిజెపి ప్రయత్నం చేస్తుందన్నారు. దేశంలో విభజన, అశాంతి అంశాలను ప్రజలను ఎంతో ఆందోళనలకు గురి చేస్తున్నాయన్నారు. అసమానతలు లేని దేశం కావాలని గాంధీ కోరుతున్నారన్నారు. బిజెపి పాలనలో దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయన్నారు. బిజెపి ఎనిమిది సంవత్సరాల పాలనలో ఇద్దరు వ్యాపారులు మాత్రమే ప్రపంచ కుబేరులుగా ఎదరిగారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో దేశంలో స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ, సమానత్వం లోపించిందన్నారు. రాజకీయాల్లో మతాన్ని చొప్పించి లబ్ధి పొందాలని బజెపి చూస్తుందన్నారు. గాంధీ ఆలోచన విధానంతోనే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నారన్నారు. తెలంగాణలో రాహుల్‌గాంధీ చేపట్టే భారత్ జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలు కలిసి విజయవంతం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని అన్ని బస్తీల్లో సిఎల్‌పి తరుపున పర్యటన చేస్తామని, బస్తీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వస్తామన్నారు. ఏఐసిసి అధ్యక్ష బరిలో ఖర్గే నిలవడాన్ని స్వాగతిస్తున్నామని, ఖర్గే ఎన్నికకు దేశంలో కాంగ్రెస్ నాయకులు అందరూ సహకరించాలన్నారు. శశిథరూర్ కూడా తన నామినేషన్‌ను ఉపసంహారించుకుని ఖర్గేకు మద్దతు ప్రకటించాలని కోరుతున్నామన్నారు. సిఎం కెసిఆర్ ఫ్లైట్ కొనడం, ఆయన వ్యక్తిగత విషయం అన్నారు. కెసిఆర్ పార్టీ ఇంకా ఊహాజనితంగానే ఉందన్నారు.

## మహాత్ముడికి కాంగ్రెస్ నేతలు నివాళులు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్భంగా గాంధీవిగ్రహం వద్ద మహాత్మగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంత్రి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసిసి కార్యదర్శి రోహిత్‌చౌదరి, మాజీ పిసిసి అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రి దామోదరరెడ్డి, కుమార్‌రావు, వినోద్‌కుమార్, నర్సింహారెడ్డి, కోట్ల శ్రీనివాస్, సాయికుమార్, నగేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## దేశ ప్రజల తలరాత మార్చనున్న కెసిఆర్: కోలేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** భారత దేశ ప్రజల తలరాతను మార్చే గొప్ప నిర్ణయం దసరా నాడు రానుడంటంతో అన్ని వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. జాతీయ స్థాయిలో తాము కెసిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్న తరుణంలో పార్టీ ఏర్పాటుకు ముహూర్తం నిర్ణయం కావడంతో ప్రజలు ఆనందోత్సాహాలతో దసరా వేడుకలను జరుపుకుంటున్నారని ఓ ప్రకటనలో తెలిపారు. కెసిఆర్‌తోనే దేశం పురోగమన దిశలో పయనిస్తుందని తమ కలలు నిజం కాబోతున్నాయని ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారని దామోదర్ పేర్కొన్నారు. తెలంగాణ లక్ష్య సాధన కోసం డిప్యూటీ స్పీకర్ పదవి సైతం త్యజించి 2001లో టిఆర్‌ఎస్ స్థాపించిన కెసిఆర్‌ను పట్టువదలని విక్రమార్కుడిగా ప్రజలు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. సిఎం కెసిఆర్ స్థాపించే జాతీయ పార్టీలో దేశ వ్యాప్తంగా పలు పార్టీలు విలీనం కావడానికి సిద్ధం అయ్యాయని దామోదర్ చెప్పారు. దీంతో దేశంలో నూతన రాజకీయ సమీకరణాలకు కెసిఆర్ నాయకత్వం నాంది కావాలని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. సిఎం కెసిఆర్ మేధస్సును భారత ప్రజలంతా కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కనక దుర్గమ్మ ఆశీస్సులతో సిఎం కెసిఆర్ దసరా రోజు గొప్ప నిర్ణయాన్ని ప్రకటించనుండటం ఆనందంగా ఉందన్నారు. అన్ని రంగాలలో దేశాన్ని భ్రష్టు పట్టించి తిరోగమన దిశగా తీసుకువెళ్లిన పాలకులకు చరమగీతం పాడటం కెసిఆర్‌తోనే సాధ్యమవుతుందని అన్నివర్గాల ప్రజాభిప్రాయమని వెల్లడించారు.

**ఇబ్రహీంపట్నం ఘటనలో**

## డాక్టర్ శ్రీధర్ సస్పెన్షన్‌ను రద్దు చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సిహెచ్‌సీ నిర్వహించిన వైద్య శిబిరంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించి నలుగురు మరణించిన ఘటనలో కేంద్రం ఇన్‌చార్జీ డాక్టర్ శ్రీధర్‌ను సస్పెండ్ చేయడాన్ని హైకోర్టు రద్దు చేసింది. సస్పెన్షన్ ఉత్తర్వులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను ఆదేశించింది. నలుగురు మహిళల మృతికి కారకులుగా పేర్కొంటూ పలువురిని వైద్య విధాన పరిషత్ సస్పెండ్ చేసింది.వీరిలో ఇబ్రహీంపట్నం సిహెచ్‌సి ఇన్‌చార్జీ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ శ్రీధర్ కూడా ఉన్నారు. ఈ ఉత్తర్వులను ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి తాజాగా విచారణ చేపట్టారు. పిటీషనర్ తరఫున పీవీ కృష్ణయ్య వాదనలు వినిపించారు. ఆగస్టు 25న ఇబ్రహీంపట్నంలోని సీహెచ "సీలో పలువురికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని, అయితే, ఆ రోజున పిటీషనర్ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానిక హాజరయ్యానని చెప్పారు. దీనికి సంబంధించిన ఐడీకార్డును, ఫోటోలను కోర్టుకు అందజేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారని వివరించారు. సస్పెండ్ చేయడం శిక్షేమీ కాదని,నలుగురు మృతికి ఎవరు కారణమో జరిగే విచారణ పూర్తి అయ్యే వరకు సస్పెన్షన్‌లో పెట్టడం తప్పుకాదని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి... డాక్టర్ శ్రీధర్ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణకు సహకరించాలని పిటీషనర్‌ను ఆదేశించింది.

## ఐటీలో టీటాది ప్రత్యేక ఒరవడి

**ఐటి చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** ఐటీ పరిశ్రమలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీటా) ప్రత్యేకతను కలిగి ఉందని తెలంగాణ రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ప్రశంసించారు. ఆదివారం టీహబ్ వేదికలో టీటా గ్లోబల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందీప్ మఖ్తల చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ టీటా ఐటీ ఉద్యోగులకు అండగా ఉండటమే కాకుండా ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ ప్రత్యేకతను చాటుకుందని ప్రశంసించారు. కంప్యూటర్, అక్షరాస్యత, టీవ్యాలెట్, టీ ఫైబర్, ఇయర్ ఆఫ్ ఏఈ సహా అనేక కార్యక్రమాల్లో టీటా బృందం క్రియాశీలకంగా పాల్గొందని అన్నారు. టీటా చేపట్టిన వివిధ కార్యక్రమాలకు వరుసగా మూడు సంవత్సరాలు పాటు ఉత్తమ సంస్థ అవార్డును తెలంగాణ ప్రభుత్వం అందజేయటం టీటాను సందీప్ నడిపించిన తీరుకు నిదర్శనమని ప్రశంసించారు. 2023-26 వరకు సందీప్ కుమార్ మఖ్తల ప్రెసిడెంట్‌గా పనిచేయనున్నారు. టీటా గ్లోబల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందీప్ కుమార్ మఖ్తలను రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అభినందించారు. మరోవైపు బతుకమ్మ సంబురాల్లో భాగంగా, టీహబ్ వేదికగా అట్టహాసంగ పూల పండుగను టీటా నిర్వహించింది. ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ప్రభుత్వ విప్‌లు గొంగిడి సునీత, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ పాల్గొన్నారు.

# తాలిబన్ల పాలనలో ఏకాకీగా మారుతున్న అఫ్ఘానిస్థాన్

**పాఠశాలలు, మసీదుల్లో వరుస బాంబుదాడులు, ఆత్మహుతి దాడులతో పెరుగుతున్న హింస**

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** దక్షిణాసియాలో ముఖ్యమైన దేశమైన ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల పాలనకు ఏడాది దాటినా ఆ దేశం ఎలాంటి ముందడుగు వేయక పోగా గడచిన కొన్ని నెలలుగా వరుసగా బాంబు దాడులు, ఆత్మాహుతి దాడులు జరుగుతుండడంతో హింస పెరుగుతోంది. ఇదే సమయంలో తాలిబన్లు ఆది మానవుల యుగంవైపు పరిపాలనను సాగిస్తుండడంతో అన్నింటా ఆ దేశం పూర్తిగా వెనుకబడి పోయింది. పాకిస్తాన్, చైనా మినహా ప్రపంచ దేశాలు ఆఫ్ఘనిస్తాన్‌ను గుర్తించక పోవ డంతో ఏకాకీగా మిగిలింది. తమను గుర్తించాలని భారత్ సహా ప్రపంచ దేశాలను ఆఫ్ఘన్ పాలకులు వేడుకుంటున్నా అక్కడి పరిస్థితులరీత్యా ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు.

ఏ దేశం మనుగడ సాధించాలన్నా బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ.. అంతే బలమైన రక్షణ, పౌర, అంతర్గత భద్రత వ్యవస్థలు వుండాల్సిన అవసరం వుంద నడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇందులో ఏ ఒక్కటి సవ్యంగా లేకున్నా ఆ దేశ మనుగడ ప్రశ్నార్థకంగా మారి అంతర్గత పోరు తప్పదనేది అంతే వాస్తవం. అఫ్ఘానిస్థాన్ విషయంలో ఇది పూర్తిగా నిజమయింది. నాలుగు కోట్ల 80 లక్షల జనాభా గల పేద దేశం. అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా దళాలు 2021 ఆగస్టు నెలలో వైదొలగడం తెలిసిందే. అనంతరం ఆఫ్ఘనిస్తాన్‌లో జరుగుతున్న పరిణామాలు, ప్రజల హక్కులను అక్కడి పాలకులు కాలరిస్తున్న తీరు, కొన్ని నెలలుగా వరుసగా చోటుచేసుకుంటున్న బాంబు దాడులు, ఆత్మాహుతి దాడులు ఆ దేశంలో మరింత హింసను పెంచుతోంది. అమెరికా సైన్యం ఆ దేశం నుంచి వెళ్లే నాటికి రెండు లక్షల మంది సైన్యం, లక్ష మందికి పైగా పోలీసు బలగం కలిగిన ఆఫ్ఘనిస్తాన్ దేశం 50 వేల మంది బలగం కూడా లేని తాలిబన్లకు లొంగిపోవడంపై రాజకీయ, సైనిక విశ్లేషకులు విస్తుపోవడం తెలిసిందే. ఆ దేశంలో తాలిబన్లు జరుపుతున్న అరాచకం నిత్యం మీడియాలో వస్తూనే వున్నా అగ్ర రాజ్యం అమెరికా సహా అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ సర్కారును గుర్తించిన పాకిస్తాన్, చైనాలు కూడా ఏమీ చేయలేక పోతున్నాయి. 2001లో అమెరికాలోని ట్విన్ టవర్లపై అల్ ఖైదా ఉగ్రవాదులు దాడిచేసిన తరువాత ఆ దేశంపై అగ్రరాజ్యం దాడికి దిగి ఆ దేశంపై యుద్ధం ప్రకటించిన విషయం విదితమే. ఈ యుద్ధం ఆఫ్ఘనిస్తాన్ నుంచి పాకిస్తాన్‌లోని ఆటోబాబాద్‌లో తలదాచుకున్న అల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ అంతమొందే వరకు కొనసాగింది. ఈ క్రమంలో లక్ష మందికి పైగా తాలిబన్లతో పాటు ఆఫ్ఘనిస్తాన్ దేశ పౌరులు మరణించగా పది వేల మంది వరకు అమెరికా నాటో దేశాల బలగాలు కూడా ప్రాణత్యాగం చేశాయి. లాడెన్ అంతమైన తరువాత కూడా చాలాకాలం పాటు అమెరికాతో పాటు నాటో దేశాలు తమ బలగాలను అఫ్ఘానిస్థాన్‌లో కొనసాగించడం విశేషం. అమెరికా నాటో బలగాల మద్దతుతో అఫ్ఘానిస్థాన్‌లో 20 ఏళ్లగా పలు పౌర ప్రభుత్వాలు ఏర్పడి పాలన సాగించినా తాలిబన్లను నిర్మూలించలేక పోవడం ఒక వైఫల్యమైతే ఆ దేశంలో బలమైన మిలటరీ, పోలీసు విభాగాలను నెలకొల్పలేక పోవడం మరో వైఫల్యంగా చెప్పాలి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు అగ్రరాజ్యం అమెరికాతో పాటు నాటో బలగాలు కాపలాగా వున్నంత కాలం తాలిబన్లు గప్‌చిప్‌గా వున్నా వారు అక్కడి నుంచి వెళ్లిపోవడం ప్రారంభించగానే ఆక్రమణలకు దిగి చివరగా యావత్ దేశాన్ని తమ పాలన కిందకు తెచ్చుకున్నారు.

**ప్రధాని సహా అనేక మంత్రులు విదేశాలకు పరారీ**

అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ల అరాచకం కారణంగా ఆ దేశ అధ్యక్షుడు అష్రఫ్ ఘనితో పాటు పార్లమెంట్ స్పీకర్ సహా అనేక మంది మంత్రులు ముందుగానే రాజీనామా చేసి పాకిస్తాన్‌తో పాటు పలు దేశాలకు పారిపోయారు. అనంతరం తాలిబన్ల పాలన మొదలు కాగానే మొదట్లో తాము పూర్తిగా మారిపోయామని, తాజా పాలనలో తాము అందరి హక్కులను గౌరవిస్తామని, మహిళలకు విద్యా అవకాశాలు వుంటాయని చెబుతూ వచ్చారు. అయితే ఇవన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారిందనడానికి ఎం తో కాలం పట్టలేదు. ప్రస్తుతం ఆ దేశంలో పౌర హక్కులు లేవు. మహిళలకు చదువు లేదు. వున్నదంతా అరాచకమే. తాము చెప్పినట్లు వినకుంటే మరణ దండనే అ న్నట్లుగా తాలిబన్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే తమ ప్రత్యర్థులను బహిరంగంగా ఉరితీస్తున్న తాలిబన్లు ఏ దేశం మాట లెక్క చేయడం లేదు. తాలిబన్ల ఏలుబడిలో అవివాహిత అమ్మాయిలు, వితంతువులు, బాలికల వివరాలు సేకరిస్తున్న తాలిబన్లు అంతులో తమకు ఇష్టమైన వారిని బలవంతంగా వివాహాలు చేసుకుంటున్నారని అ క్కడి ప్రజలు ఘోషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే లక్షల సంఖ్యలో ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు పాకిస్తాన్‌తో పాటు పొరుగు దేశాలైన కజకిస్తాన్, తుర్కమెనిస్తాన్, ఉజ్జబెకిస్తాన్ సహా పలు యూరప్ దేశాలకు వలస వెళ్లగా ఇది ఇప్పటికీ కొనసాగుతూనే వుందని మీడియాలో వార్తలు వస్తున్నాయి. అప్పట్లో కాబుల్ నుంచి విదేశాలకు విమానాల్లో వెళ్లేం దుకు యత్నించిన పలువురు మరణించారు కూడా. ఇక తాలిబన్ల పాలనను ఇప్పటి వరకు పాకిస్తాన్, చైనాలు మాత్రమే గుర్తించాయి. ఇంకొన్ని దేశాలు తమను గుర్తించినట్లు తాలిబన్లు చెబు తున్నా ఇందులో వాస్తవం లేదని అంతర్జాతీయ పౌర సమాజం చెబుతోంది. భారత్‌తో సంబంధాల కోసం తాలిబన్లు ఏడాదిగా అనేక ప్రయత్నాలు చేసినా వారిని భారత్ గుర్తించక పోవడం గమనార్హం. ఇక నాలుగైదు నెలలుగా ఆఫ్ఘనిస్తాన్‌లో పాఠశాలలు, మసీదులను లక్ష్యం చేసుకుని జరుగుతున్న బాంబు దాడులు, ఆత్మాహుతి దాడులు పదుల నుంచి వందల సంఖ్యలో అమాయకులను బలిగొంటున్నాయి. ఈ బాంబు దాడులకు తాలిబన్ల మధ్య వున్న గ్రూపు తగాదాలే కారణమని అంతర్జాతీయ మీడియా చెబుతోంది.


**ఇండియన్ స్మాల్ ఫైనాన్స్ కంపెనీ ప్రై లిమిటెడ్** (isfc)

నమోదిత కార్యాలయం: యూనిట్ 8-2-269/2/52, ప్లాట్ నం.52 సాగర్ సొసైటీ, రోడ్ నం.2, బంజారాహిల్స్, హైదరాబాద్ 500034

**స్వాధీనతా ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 (అనుబంధం IV) యొక్క విభాగం 8(1) మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క విభాగం 13 (4) క్రింద.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 3తో చదువబడే విభాగం 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఇండియన్ స్మాల్ ఫైనాన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ (ఇటుపై ISFC గా రిఫరు చేయబడును) యొక్క అధీకృత అధికారి దిగువ సంతకందారు అయినందున నదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించుటకు ఇటుపై దిగువ పేర్కొన్న రుణగ్రహీత/సహరుణగ్రహీత/హామీదారులకు డిమాండు నోటీసు జారీచేసినారు. డిమాండు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారులు విఫలమైనందున సాధారణ ప్రజానీకం మరియు రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారులకు ఇందుమూలంగా సూచించునది ఏమనగా నదరు నిబంధనల యొక్క నిబంధన 8(1)తో చదువబడే నదరు చట్టం యొక్క విభాగం 13(4) క్రింద అతనిపై సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఇటుపై దిగువ పేర్కొన్న ఆస్తులను ISFC తరఫున దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. సాధారణ ప్రజానీకం మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు/సహరుణగ్రహీతలు/హామీదారులను ఇందుమూలంగా హెచ్చరించునది ఏమనగా దిగువ పేర్కొన్న ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు నదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలైనా ఆటుపై తదుపరి వడ్డీతో దిగువ పేర్కొన్న విధంగా మొత్తం కొరకు ISFC యొక్క ఫస్ట్ ఛార్జీకిలోబడి ఉండును.

| క్ర. సం. | రుణగ్రహీత/సహరుణగ్రహీతల చిరునామా మరియు రుణం నం. | సెక్యూర్డ్ ఆస్తి వివరణ (స్థిరాస్తి) | 1. స్వాధీనతా తేదీ 2. డిమాండు నోటీసు తేది 3. బకాయి మొత్తం రూ.లలో |
| --- | --- | --- | --- |
| 1 | రుణగ్రహీత పేరు మరియు వారి చిరునామా: కొమ్ము దుర్గాప్రసాద్, కొమ్ము పద్మప్రియ, చుక్కా రామయ్య హైస్కూల్. ఇం.నం. 4-6-77, ఎన్‌టిపిసి జ్యోతినగర్, రామగుండం, సోమనపల్లె, కరీంనగర్, ఆంధ్రప్రదేశ్ - 505215, 18-489, ఎల్‌ఐసి కాలనీ, మంచిర్యాల, ఆదిలాబాద్, తెలంగాణ- 504208. రుణఖాతా నం: 175138000001 & 175137000001 మంజూరు చేసిన రుణం- రూ. 24,13,930/- (రూపాయలు ఇరవై నాలుగు లక్షల పదమూడు వేల తొమ్మిది వందల ముప్పది మాత్రమే).175138000001 కోసం, రూ. 3,52,100/- (రూపాయలు మూడు లక్షల యాభై రెండు వేల ఒక వంద మాత్రమే) 175137000001 కోసం. | ఐటమ్ నెం.1. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా, అన్నాగామ్ మండలం, కుందనపల్లి గ్రామంలోని సర్వే నెం.112 యందలి 358 చ.గజముల విస్తీర్ణం గల ఖాళీ స్థలం. సరిహద్దులు: తూర్పు: బి. లక్ష్మణ్‌గౌడ్ ఇల్లు. పడమర: మీర్జా ఫారూఖ్ అహ్మద్‌బేగ్ ఇల్లు. ఉత్తరం: రోడ్డు. దక్షిణం: గులాం బియాబనీ ఇల్లు మరియు ఖాళీ స్థలం. ఐటమ్ నెం.2: తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా అన్నాగామ్ మండలం, కుందనపల్లి గ్రామంలోని సర్వే నెం.112 యందలి 489 చ.గ.ల విస్తీర్ణం గల ఇం.నెం.5-71/1. సరిహద్దులు: తూర్పు: శాంతినికేతన్ స్కూలు. పడమర: మీర్జా ఫారూఖ్ అహ్మద్ బేగ్‌కు చెందిన ఇం.నం.5-72. ఉత్తరం: రోడ్డు. దక్షిణం: మొహమ్మద్ నూరుద్దీన్‌కు చెందిన భూమి. తనఖాదారు పేరు: దుర్గాప్రసాద్ కొమ్ము. | 1. 30.09.2022 2. 09.05.2022 3. రూ.28,23,988/- (రూపాయలు ఇరవై ఎనిమిది లక్షల ఇరవై మూడు వేల తొమ్మిది వందల ఎనభై ఎనిమిది మాత్రమే) 09.05. 2022 నాటికి, 10.05. 2022 నుండి సంపూర్ణ చెల్లింపు వరకు వడ్డీ వర్తిస్తుంది. |

ప్రదేశం : పెద్దపల్లి, తెలంగాణ
తేది: 03.10.2022

అధీకృత అధికారి
ఇండియన్ స్మాల్ ఫైనాన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్

వార్త

నిలకడ లేని మనసున్నవారు ధర్మమార్గాన్ని అనుసరించలేరు.

–రోజర్

# జాప్యానికి ఉక్రెయిన్ మూల్యం!


ప్రపంచదేశాధినేతల్లో సామ్రాజ్యవాదం, విస్తరణ కాంక్ష మరింతగా పెరుగుతోంది. నిన్నమొన్నటివరకూ చైనాను మాత్రమే ఈ కోణం నుంచి చూసాం. సరిహద్దుల్లో కొద్ది కొద్దిగా ముందుకువస్తూ ఆప్రాంతాలను చివరకు తమవిగా ప్రకటించుకుంటూ చైనా అక్కడే తిష్టవేసి శాశ్వత స్థావరాలను నిర్మించుకుంటున్న సంగతి తెలిసిందే. ఇపుడు అదే కోవలోకి తన చిరకాల మిత్రదేశం రష్యా చేరుతోంది. ఒకప్పుడు యుఎస్ఎస్ఆర్‌గా వెలుగొందిన సోవియట్ రష్యాను మళ్లీ పాతపద్ధతిలోనే పునర్నిర్మించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ శ్రీకారం చుట్టినట్లు కనిపిస్తోంది. 2014లోనే ఇందుకు సంబంధించి క్రిమియాపై దాడిచేసి ఆ ప్రాంతాన్ని సోవియట్ భూభాగంగా ప్రకటించిన రష్యా ఈ ప్రాంతానికి నేరుగా వెళ్లేమార్గం కూడా ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అనుగుణంగానే గడచిన ఏడునెలలుగా చిన్న దేశం అయిన ఉక్రెయిన్‌పై నిర్వహిస్తున్న దండయాత్రలో తన పరిధిలోకి వచ్చిన నాలుగు కీలక నగరాలను సోవియట్ భూభాగంలో చేరినట్లు ప్రకటించారు. అంతేకాకుండా ఎవరు ఈ భూభాగంపై దాడులు చేసినా రష్యా భూభాగంపైనే దండయాత్ర చేసినట్లు పరిగణిస్తామని, ప్రతిగా కఠిన ప్రతిఘటన ఉంటుందని కూడా హెచ్చరించడం చూస్తే పుతిన్‌లో కూడా సామ్రాజ్యవిస్తరణ కాంక్ష రగులుతోంది. పాత రష్యా కూటమి దేశాలను మళ్లీ చేర్చుకుని అమెరికాకు ధీటుగా అత్యంతశక్తివంతమైన ప్రపంచదేశంగా తీర్చిదిద్దుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు ఉక్రెయిన్‌నుంచే ఆయన శ్రీకారం చుట్టినా నాటో సైనిక కూటమి నుంచి అందుతున్న అప్రతిహత సహకారంతో ఉక్రెయిన్ అలుపెరగని పోరాటం చేస్తోంది. నాటోలో తమకు ఇప్పటికైనా నేరుగా సభ్యత్వం ఇవ్వాలని అప్పుడే రష్యా చర్యలను కట్టడి చేయగలుగుతామని ఉక్రెయిన్ దేశ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలన్‌స్కీ మరోసారి నాటో కూటమికి ప్రతిపాదనలు చేసారు. జాప్యం జరిగేకొద్దీ ఉక్రెయిన్ భారీ మూల్యం చెల్లించే స్థితికి చేరుతుందని, అయినా ప్రాణాలకు సైతం తెగించి పోరాడి తమ భూభాగాన్ని రక్షించుకుంటామని ఆయన ప్రకటించారు. ఇవేమీ పట్టించుకోని పుతిన్‌మాత్రం నాలుగు ప్రధాన నగరాలు డోనెట్స్క్, లుహాన్స్క్, ఝపోరిఝియా, ఖెర్సన్ ప్రాంతాలను తమ దేశంలో విలీనం చేసుకున్నారు. యూరోపియన్ కూటమిలోని 27 దేశాలు ఈ ఏకపక్ష దండయాత్రను నిష్కర్షగా ఖండించాయి. ఏడు దేశాల కూటమి జి7లోని బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా దేశాలు, యూరోపియన్ కూటమి ఉన్నతస్థాయి ప్రతినిధి కూడా ఈ దండయాత్రను, స్వాధీనాన్ని నిర్ద్వందంగా ఖండించాయి. అయినా కూడా పుతిన్ వెనక్కి తగ్గలేదు. తన ఏకపక్ష నిర్ణయంతోనే ఈ ప్రాంతాలపై సైనిక చర్యకు దిగితే రష్యా రక్షణ చర్యలు చేపడుతుందని స్పష్టంచేయడం చూస్తే ఉక్రెయిన్ మొత్తాన్ని ఆయన బలవంతంగా అదుపులోకి తెచ్చుకునే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇప్పటికైనా ఉక్రెయిన్ యుద్ధం మాని తమతో సంప్రదింపులకు రావాలని, లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరికలు కూడా చేసారు. ఈ ఏకపక్ష నిర్ణయాలకు ప్రతిగా యూరోపియన్ కూటమి రష్యా నుంచి ఎగుమతులపై ఆంక్షలు ప్రకటించింది. ఏడు వందల కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతోపాటు రష్యా చమురుపై ధరలపరిమితులు విధించింది. ఇప్పటికే అమెరికా రష్యాపై అనేక ఆంక్షలు ప్రకటించింది. రష్యా నుంచి ఆయుధ కొనుగోళ్లు చేయవద్దని కూడా ఇతర ప్రపంచదేశాలకు పిలుపునిచ్చింది. అసలు పుతిన్ ముందున్న లక్ష్యం ఏమిటి? ఉక్రెయిన్‌ను స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రపంచదేశాలకు ఇచ్చే సంకేతాలేమిటి? ఉక్రెయిన్‌ను పూర్తిగా వశపరుచుకునే ప్రక్రియను నాటో కూటమి ప్రతిఘటిస్తుందా? నాటో విస్తరణ లక్ష్యం ఎంత వరకూ వచ్చింది. నాటో సభ్యత్వం ఉక్రెయిన్‌కు ఇవ్వడంలో నాటో ఎందుకు తాత్సారం చేస్తోంది? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. ఇపుడు నాటో చేస్తున్న జాప్యానికి ఉక్రెయిన్ మూల్యం చెల్లించుకుంటోంది. నాటో దేశాల్లో సభ్యత్వం ఇవ్వకూడదన్న ఆంక్షలతోనే పుతిన్ ఉక్రెయిన్‌పై దండయాత్రకు పూనుకున్నారు. ఇప్పటికి రెండుసార్లు దరఖాసు చేసుకున్నా ఉక్రెయిన్ నాటోలో చేరలేకపోయింది. పరోక్షంగా మద్దతును మాత్రమే పొందగలుగుతోంది. ఇప్పటికే యుద్ధం కారణంగా 2 లక్షల కోట్ల డాలర్లవరకూ ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ నష్టపోయిందని నిపుణులు తేల్చారు. ఉక్రెయిన్‌పై మరింత ప్రతీకార చర్యలకోసం రష్యా మిలిటరీ ప్రత్యేక టార్చర్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసాయి. వివిధ పద్ధతుల్లో యుద్ధనేరస్తులను భౌతికంగా నిర్వీర్యంచేసే ప్రక్రియను చేపట్టి ఆదేశ ప్రజలను మరింత భయపెట్టే చర్యలకు పాల్పడుతోంది. ఈ సంఘటనల నేపథ్యంలోనే ఇపుడు రష్యా భూభాగంలోకి చేరిన క్రిమియాకు నేరుగా వెళ్లేందుకు వీలుగా అక్కడ సరిహద్దుల్లో ఉన్న ప్రధాన నాలుగు నగరాలను తమ భూభాగంలో కలిపేసుకుంది. ఈ ప్రాంతాలు మళ్లీ ఉక్రెయిన్ అదుపులోకి రావాలంటే ఉక్రెయిన్ తన యుద్ధతంత్రాన్ని మరింత విస్తరించక తప్పదు. తద్వారా ఇప్పటికే స్మశానంగా మారిన ఆ దేశంలో మరింతగా రక్తపుటేరులు ప్రవహించక తప్పదు. ప్రపంచ శాంతి, సామరస్య వాతావరణం పెంపొందించాలని పాటుపడే అగ్రరాజ్యాలు తమ రక్షణరంగ వాణిజ్యాన్ని పక్కనపెట్టి ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను ప్రత్యక్షంగా ఎదుర్కొంటే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదని చెప్పవచ్చు. ఈలోపు రష్యా మరిన్ని ప్రాంతాలను తమలో కలిపేసుకున్నా ఆశ్చర్యపోనవసరంలేదు.

పదుగురు తలవంచే చోట మనమూ తలవంచటం వినయ లక్షణం.



పుల్లర్

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలాకష్టమైన పని.



సిసిరో

## ప్రజావాక్కు



### గో సంరక్షణ చట్టం తీసుకురావాలి

గో సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గుడికో గోమాత కార్యక్రమాన్ని ప్రారంభించడం ముదావహం. రాష్ట్రంలోని మఠాలు, వంశపారపర్యపర్యవేక్షణ ఆలయాలు, లేదా పాఠశాలలకుతిథిది, రాష్ట్రప్రభుత్వం సంయుక్తంగా సదరు కార్యక్రమం ద్వారా దేశవాళి ఆవుదూడలను ఉచితంగా అందించే సదరు బృహత్తర కార్యక్రమం గోవులసంతతి అభివృద్ధికి నిస్సందేహంగా తోడ్పడుతుంది. హైందవ ధర్మంలో ఆవుకు తల్లిస్థానం ఇచ్చారు. గోసంతతి సుభిక్షంగా ఉన్నప్రాంతాలలో అష్టఐశ్వర్యాలు అభివృద్ధిచెంది ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో గోసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ముసలి, అనారోగ్యంతో ఉన్న ఆవులకు ప్రత్యేక వైద్యసదుపాయం అందించాలి. కళేబరాలకు గోవులను తరలించడాన్ని నిషేధిస్తూ గోసంరక్షణ చట్టం తీసుకురావాలి.

–సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కాదా?

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులను, ఉపాధ్యాయులను జైళ్లలో పెడుతున్నారంటూ తెలంగాణా రాష్ట్రమంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించగా, అలాంటిదేమి లేదని మన విద్యాశాఖమంత్రి సెలవిచ్చారు. అయితే గతంలోకూడా తెలంగాణ మంత్రులు ఆంధ్రాలో కరెంటు లేదని, రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. రాజధానే లేదంటూ పలు వ్యంగ్య వ్యాఖ్యానాలు చేశారు. వాటిలో నిజం లేకపోలేదు. ఇలాఎవరైనా సామాన్యులు సోషల్ మీడియాలో పోస్టులుపెడితే వారిపై పోలీసు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేయడం చూస్తున్నాం. మరి అవే చట్టాలు పక్క రాష్ట్రాల మంత్రులు చేస్తే వర్తించవా? ఇదెక్కడి ద్వంద్వ నీతి?

–జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

### కాంగ్రెస్ అవినీతి ఎక్కడ!

కాంగ్రెస్ పార్టీ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లరూపాయలు సంపాదించుకున్నారనిబిజెపినాయకులు అదేపనిగా విమర్శిస్తుంటారు. ప్రజల మనసులలో ఈ మాటలు నాటుకుపోయేలా చేస్తుంటారు. అధికారం కోసంప్రజలను మాయచేస్తుంటారు. ఇన్ని చేస్తున్నవారు కాంగ్రెస్ హయాంలో అవినీతికి పాల్పడినది ఎంత మంది? వారుఎవరు? ఎమ్‌పిలా, ఎమ్మెల్యేలా, మంత్రులా, అనేది తెలుసుకోలేకపోతున్నారు. అవినీతిఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది అనేదికూడా తెలుసుకోలేకపోతున్నారు. కాంగ్రెస్‌పట్ల ప్రజలలోఉన్న అనుమానాలను తీర్చలేకపోతున్నారు.

–బి.పెంటయ్య, హైదరాబాద్

### మహిళా వాక్కుల్ని గౌరవించే సుప్రీం తీర్పు

వైవాహిక స్థితితో సంబంధంలేకుండా మహిళ చట్టబద్ధంగా అబార్షన్‌పై నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుఅభినందనీయం. ఇంతవరకూ 20నుంచి 24 వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునే హక్కు అవివాహితులకు లేదు. ఒక్క వివాహితులకు, ఆరోగ్యపరమైన అవసరాలు ఉన్నవారికే పరిమితమైన హక్కు అని అందరికీ కల్పించడం ద్వారా మహిళకున్న నిర్ణయాధికారాన్ని సుప్రీంసమర్థించింది. చట్టపరమైన అడ్డంకుల్ని తొలగించింది. తద్వారా తన శరీరంపై, గర్భధారణ పట్ల తన స్వీయాధికారంపైమహిళ నిర్ణయం తీసుకోవచ్చు. దేశంలో జరిగే అబార్షన్లలో సగభాగందొంగచాటుగా, సరైన వైద్యనిపుణుల పర్యవేక్షణ లేకుండా జరుగుతున్నాయి. చట్టం ఒప్పుకోని సమయంలోవక్రమార్గంలో జరుగుతున్న వీటివల్ల తల్లిప్రాణాలకు ముప్పు ఎక్కువ కావడమే కాకుండా అవమానభారం, ఆర్థికభారం వారిపై పడుతుంది. ఇప్పుడీ తీర్పు ద్వారా అలాంటి సంఘటనలు కూడా తగ్గుతాయి. గర్భవిచ్ఛిత్తికై నిర్ణయించుకున్న వంచితులైన మైనర్ బాలికల పేర్లు, అవివాహితల పేర్లు బహిరంగపరిచే అవసరం వైద్యులకు లేనందున వారి వివరాలు గోప్యంగా ఉండివారి హక్కు పరిరక్షించబడుతుంది.

–డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### ఒక్కసారి ఆలోచించండి

తమ కోరికలు తీర్చినందుకు దేవుడికి మొక్కులు పేరిట ధనాన్ని హుండీలో వేస్తున్న వారు, అలా చేస్తే నిజంగా దేవుడు సంతోషిస్తాడా అని ఒక్కసారి ఆలోచించాలి. ఆ డబ్బులతో పేదవారికి అన్నంపెట్టి వారి కడుపు నింపితే అప్పుడు నిజంగా దేవుడు సంతోషిస్తాడు అని తెలుసుకోవాలి. అంతేకాదు దేవుడికి ఏ కానుకలు అవసరం లేదని ఆ ధనంతో ఏ జీవి ఆకలి తీర్చినా ఆ భగవంతుడు మిక్కిలి ఆనందించి వారిపై తన చల్లనిచూపు ప్రసరింపచేస్తాడు అని గ్రహించగలగాలి.

–నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### వైఫల్యాల బాటలో సంక్షేమ పథకాలు

పేదలకు లబ్ధి చేకూర్చే సంక్షేమ పథకాలు అనేకం వైఫల్యాల బాటలో ఉన్నాయి. ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ప్రజలకు ఒకవ్యక్తికి నెలకుఆరుకిలోల చొప్పున దొడ్డు బియ్యం ఉచితంగా సరఫరా చేస్తున్నారు. రకరకాల కారణాలతో వీటిని నల్ల బజారులో కిలోకు పదినుండి ఇరవై రూపాయల వరకు విక్రయిస్తూ వారికినచ్చిన ఖరీదైన బియ్యంకొనుగోలు చేసి వినియోగించుకుంటున్నారు. అలాంటి పక్షంలో ప్రభుత్వం ఉచిత బియ్యం సరఫరా చేసి ప్రయోజనం ఏమిటి?

–జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఆహార భద్రతకు భరోసా ఏది?

**ఆహార ధాన్యాల ఉత్పత్తి చేసే వ్యవసాయరంగానికి తక్కువ నిధులు మంజూరు చేస్తూ, కమర్షియల్ లాభసాటి వ్యాపారానికి ఎక్కువనిధులు మంజూరు ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. ఆహార భద్రతా చట్టం అందరికీ ఆహారం అందించడమేకాదు. అన్ని విష యాల్లో భాగస్వామ్యం అని గ్రహించాలి. ముఖ్యంగా భవిష్యత్‌లో భారత్‌లో ఆహార కొరత నివారించడానికి ప్రజలందరూ, ప్రభుత్వా లు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకుని యుద్ధప్రాతిపదికన కదలాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని అభివృద్ధివరచడానికి బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలి. రైతు లకు అండగా నిలవాలి. రైతులే దేశానికి విధాతలు అని తెలియ చేయాలి. భారతదేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దాలి.**

ఐ.పి.రావు

కరోనాతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవటంతోపాటు ఆహార ద్రవ్యోల్బణాన్ని కూడా సృష్టించింది. దీనికితోడు ప్రస్తుతం కొనసాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధం పుండుమీద కారం చల్లినట్లు వ్యవసాయరంగాన్ని అతలాకుతలం చేసింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి, మార్కెట్, సరఫరా గొలుసును గందరగోళంతో ముంచెత్తింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆహార సమస్యలు పెరుగుతున్నాయి. అందరికీ ఆహారం అందని ద్రాక్షవలే ఉండబోతోంది. మానవుని మనుగడనే ప్రశ్నార్థకం చేయనుంది. చాలా అప్రమత్తంగా ఉంటూ, చాకచక్యంగా ఈ సమస్యల నుండి ఈ సమాజం బయట పడాలి. భవిష్యత్తు తరాలకు ఆహార నిల్వలు సమకూర్చాలి ఇదే ప్రపంచదేశాలకు, దేశాధినేతల భుజస్కంధాలపై ఉన్న తక్షణ కర్తవ్యం. ప్రస్తుతం 93శాతం పేద మధ్యతరగతి దేశాలు, 89 శాతం మధ్య ఉన్నతివర్గ దేశాలు ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారని పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ 2022 ఏప్రిల్-జూన్ నెలల మధ్యకాలంలో ఐదు శాతం ఆహార ద్రవ్యోల్బణం చవిచూసాం. 2022 ఆగస్టు ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం సుమారు 23 దేశాలు ఆహార ధాన్యాల ఎగుమతులపై నిషేధం విధించారు. మరో ఏడు దేశాలవారు ఆహార ధాన్యాల ఎగుమతులపై ఆంక్షలు, నిబంధనలు విధించారు. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యు.ఎఫ్.పి) నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 345 మిలియన్ల జనాభా 82 దేశాల్లో ఆహార లేమితో బాధపడుతున్నారు అని తెలిపారు. ఇది మరింత ముదిరి ఈ సంవత్సరం సెప్టెంబర్ నాటికి మరో 20 దేశాలు మరింతగా ఆహార సంక్షోభంలోకి నెట్టవేయబడతాయి అని తెలిపారు. నగరీకరణ పట్టణీకరణ పేరులో గ్రామాల్లో ప్రజలు అందరూ పట్టణాలకు వలస వెళ్లడం, వాతావరణ మార్పులు, వ్యవసాయరంగాన్ని సంక్షోభంలో పడేశాయి. అభివృద్ధి చెందుతున్న, అధిక జనాభా కలిగిన మనలాంటి దేశానికి ఈ ఆహార భద్రత విషయంలో భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే 'ఫుడ్ అండ్ అగ్రికల్చర్' సంస్థ నివేదిక ప్రకారం భారతదేశంలో సుమారు 189 మిలియన్ల జనాభా పోషకాహారం లోపంతో బాధపడుతున్నారు అని తెలిపింది. ఇదే అభిప్రాయాన్ని ఇటీవల మన నేషనల్‌కుటుంబ ఆరోగ్య సర్వే కూడా పలు విషయాలు బహిర్గతం చేసింది. ప్రపంచంలోనే అతి ఎక్కువ మంది మనదేశంలోనే పోషకాహారం లోపంతో బాధపడుతున్నారు అని తెలిపింది. ఉత్పత్తి సరఫరా ప్రకారం నేటికీ మనదేశం వ్యవసాయరంగంలో అగ్రస్థానంలో ఉంది. అయినా 60 శాతం వంటనూనెలు, 35 శాతం పప్పుదినుసులు దిగుమతి చేసుకుంటున్నాం. ఇదే విచిత్రం. మిగులు ఉత్పత్తి లేకుండా దేశం అభివృద్ధి సాధించలేదు. ఆహార భద్రతకు భరోసా ఇవ్వలేదు అని పాలకులు గ్రహించాలి. అనగా ఎగుమతులు పెరిగి దిగుమతులు తగ్గాలి. భారత్‌లో సేద్యం చేయడం ఖరీదుగా మారింది. సన్నచిన్నకారు రైతులు ఆర్థికంగా చితికిపోవడం, పెట్టుబడులు పెరిగిపోవడం, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ఉప




యోగించలేకపోవడం, భూసారం తగ్గటం వలన వ్యవసాయం భారంగా మారింది. పంట దిగుబడి తక్కువగా ఉండుట గమనార్హం. 1991-2011 మధ్యకాలంలో సుమారు 14 మిలియన్ల మంది వ్యవసాయరంగాన్ని విడిచిపెట్టడం జరిగింది. కొందరు తమ భూములను కౌలు రైతులకు ఇవ్వడం జరిగింది. దీనికి కారణం ఆర్థిక ఇబ్బందులు, వలస కార్మికుల సమస్యలు. భవిష్యత్తులో ఆహార ధాన్యాల కొరత మనదేశానికి పెను సవాలుగా పరిణమిస్తున్నాయి. రాబోయే కాలంలో ఇండియా జనాభా 150 కోట్లు, 200 కోట్లు పెరిగే పరిస్థితుల్లో అందరికీ మూడు పూటలా ఆహార ధాన్యాలు సమకూర్చడం నిజంగా పెద్ద సవాల్. ఇకనుంచైనా ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడానికి పలు నిర్ణయాలు తీసుకోవాలి. కొవిడ్ నియంత్రణకు ఎంత శ్రమపడ్డారో అంతకంటే ఎక్కువగా ఆహార భద్రత అందరికీ కల్పించుటలో ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. అప్పుడే భారత్ 'అన్నపూర్ణ' అనే పేరు సార్థకం చేసుకుంటుంది. అమెరికా తరువాత ఇండియాకు 1.56 మిలియన్ల స్క్వేర్ కిలోమీటర్ల సాగు విస్తీర్ణం ఉంది. అయితే వసతులు కొరత వెంటాడుతూనే ఉంది. ముందుగా కనీస మద్దతు ధర ఇవ్వడం ద్వారానే వ్యవసాయం పరిపూర్ణ అభివృద్ధి సాధించదు అని గ్రహించాలి. నేటికీ 70 శాతం జనాభా వ్యవసాయరంగంలో ఉపాధి పొందేవారు ఉండగా వీరిలో 82 శాతం మంది సన్నచిన్నకారు రైతులు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. ఆర్థిక సహకారం రైతులకు ఇవ్వాలి. సబ్సిడీలు రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసం. నకిలీల బెడదలు తొలగించాలి. విత్తనాలు, ఎరువులు, విద్యుత్, వ్యవసాయ పనిముట్లు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవాలి. సకాలంలో అందరికీ అందివ్వాలి. పంటమార్పిడి విధానం ప్రోత్సహించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. ఖరీఫ్‌తో సమానంగా రబీలోనూ సమానంగా పంటలు పండించే విధంగా లక్ష్యం నిర్దేశించాలి. రబీ కాలంలో నాలుగోవంతు భూమినే సాగు చేయుట గమనార్హం. వ్యవసాయంపైపెట్టే ఖర్చులు కూడా 2010-11లో 11 శాతం ఉండగా 2019-20 నాటికి 9.5శాతం తగ్గింది. ఇదే అమెరికాలో అయితే 33శాతం, ఇటలీలో 43శాతం ఉంది. ఆదాయం పెరుగుదలకు, అప్పులు ఇవ్వడానికి ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయి. కానీ ప్రొడక్షన్ విషయంలో డబ్బులు ఖర్చు చేయడం లేదు. అదే మత్స్యరంగం అభివృద్ధికి 73 శాతం, యానిమల్ అజబెండరికి 26 శాతం ఎక్కువగా నిధులు మంజూరు చేశారు. అనగా ఆహార ధాన్యాల ఉత్పత్తి చేసే వ్యవసాయరంగానికి తక్కువ నిధులు మంజూరు చేస్తూ, కమర్షియల్ లాభసాటి వ్యాపారానికి ఎక్కువనిధులు మంజూరు ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. ఆహార భద్రతా చట్టం అందరికీ ఆహారం అందించడమేకాదు. అన్ని విషయాల్లో భాగస్వామ్యం అని గ్రహించాలి. ముఖ్యంగా భవిష్యత్‌లో భారత్‌లో ఆహార కొరత నివారించడానికి ప్రజలందరూ, ప్రభుత్వాలు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకుని యుద్ధప్రాతిపదికన కదలాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని అభివృద్ధిపరచడానికి బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలి. రైతులకు అండగా నిలవాలి. రైతులే దేశానికి విధాతలు అని తెలియ చేయాలి. భారతదేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దాలి. ●

# పొంచి ఉన్న ఆర్థిక మాంద్యం

మేకిరి దామోదర్

భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉండేది. కానీ నేడు ద్రవ్యోల్బణం పెరిగి రూపాయి మారక విలువ డాలర్‌తో పోల్చితే గణనీయంగా పతనమవుతుంది. సుమారుమూడు దశాబ్దాల కాలం నాడు ఒక డాలర్ రూ. 21 పలికేది. 2014 ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన నాటికి అది కాస్త 63 రూపాయలకు చేరింది. నేడు ఒక్కో డాలర్ 81 రూపాయల స్థాయి తాకుతుండడం గగ్గోలు పుట్టిస్తుంది. ఇలా రూపాయి విలువ ఇదివరకు ఎప్పుడూ లేని స్థాయికి క్షీణించింది. దీనితో దేశీయంగా స్టాక్ మార్కెట్లో భారీ పతనం, ఎఫ్ఐఐలు తరలిపోవడం, విదేశీ మారకం విలువల్లో తగ్గుదల, వాణిజ్యలోటు పెరుగుదల మొదలగు పరిణామాలు రూపాయి విలువను పతనానికి దారితీస్తున్నాయి. ఇది రూపాయి చరిత్రలోనే ఆల్‌టైం కనిష్ఠం కావడం గమనార్హం. ఇలానే పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తే మహామాంద్యానికి చేరువ అవుతున్నామా అనిపిస్తుంది. భారత ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలతో మందగమనం ప్రారంభమైంది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్టీ అమలు వంటి చర్యలు ఆర్థికరంగం జోరుకు కళ్లెం వేశాయి. అదే సమయంలో కరోనా విజృంభించి దేశ ఆర్థికాన్ని పాతాళానికి నెట్టింది. ఆ తర్వాత రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మరింత కుంగదీసింది. దీనితో ధరలు పెరిగి సామాన్యుని జీవనం పెనుభారంగా మారింది. కారణంగా అధిక ద్రవ్యోల్బణంతో ఏం కొందామన్నా, ఏం తిందామా అన్న భరించలేని భారమైంది. అన్ని రకాల వస్తువులు, సేవలు, ధరలు పెరిగి చుక్కలు నడుతున్నాయి. దీనితోపాటు తినుబండారాలు, కూరగాయలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగినాయి. అంతేకాదు మూడేళ్లలో స్టీల్, సిమెంట్, ఇసుక ధరలు 50 శాతం పెరిగినాయి. స్కూల్, కాలేజీల ఫీజులు, పాలు, పండ్లు, పప్పు, ఉప్పు బియ్యం నూనెలు కూరగాయలు నిత్యవసరాల అన్నింటి ధరలు ఆకాశానంటుతున్నాయి. ధరల నియంత్రణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేయడంతో ప్రజల బతుకులు గాలిలో దీపంగా మారింది. మరోవైపు స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. ధరల భారంతో పేద, మధ్య తరగతి వారి కష్టాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పేద, గొప్ప వ్యత్యాసం లేకుండా అందరి ఆకలి తీర్చేది అన్నం. కానీ నేడు ఆ బియ్యం ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. గత



రెండునెలల కింద క్వింటాల్ ధర 4200గా బియ్యం ధర రూ. 5200వరకు చేరింది. ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని బియ్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి మార్కెట్‌ను శాసిస్తున్నారు. నూనెల ధరలు మార్చిలో లీటరు ధర 133 దాకా ఉండేది. మే నెల వచ్చేసరికి వాటికి రూ. 195 నుండి 200వందలవరకు చేరింది. నేడు కొంత తగ్గినప్పటికీ ఇంకా తగ్గాల్సి ఉంది. అలాగే కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ 2014లో సిలిండర్‌ధర రూ.399 ఉండేది. ప్రస్తుతం అది 1130 చేరింది. గ్యాస్ సిలిండర్ ధర కొన్నాళ్లుగా అసాధారణ స్థాయిలో పెరుగుతూ వస్తుంది. ఇది చాలదన్నట్లు కేంద్ర ప్రభుత్వం 'మూల్గే నక్కపై తాటిపండు'లా గ్యాస్ రాయితీని వెనక్కి తీసుకుంది. నామమాత్రంగా రూ.40 రూపాయలు మాత్రమే రాయితీ ఇస్తుంది. రాష్ట్రంలో కరెంటు ఛార్జీలు కూడా పెరిగాయి. ఇంతకుముందు 50 యూనిట్లలోపు కరెంటు వాడి 87రూపాయల వరకు చెల్లించేవారు. ఇప్పుడు 150 రూపాయల వరకు కట్టాల్సివస్తుంది. స్కూల్ ఫీజులు 50 శాతం వరకు పెంచారు. ప్రైవేట్‌పాఠశాలలు, కళాశాలలో కరోనా కాలంలో కుదేలై వారు ఫీజులను గణనీయంగా పెంచారు. ఈ కట్టలేని వారు ప్రభుత్వపాఠశాలలో వాళ్ల పిల్లలను చేర్పిస్తున్నారు. దీనికితోడు పుస్తకాలు, ఆటో, బస్సు ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగినాయి. అలాగే నిర్మాణ భారం కూడా పెరిగిపోయింది. మూడు ఏళ్ల కిందట ప్రతి చదరపు అడుగుకు రూపాయలు వెయ్యి ఉండగా, అది ఇప్పుడు 1600 రూపాయలకు చేరింది. అలాగే స్టీల్, సిమెంట్, ఇసుక ధరలు 50 శాతం పెరగడంతో ఆ మేరకు పెంచక తప్పలేదని నిర్మాణదారులు అంటున్నారు. రిజిస్ట్రేషన్ విలువ కూడా ప్రభుత్వాలు గణనీయంగా పెంచాయి. కొత్త ఇల్లు కట్టలేరు, ఇంటి జాగలు కొనలేరు. ఇంటి అద్దె రేట్లు కూడా పెరిగినాయి. వీటికితోడు సర్కారి దోపిడీ అంతే లేదు. టాక్సీలు, సెస్సులు, సర్చార్జీల రూపంలో అన్నింటిపై వసూలు చేస్తున్నారు. మద్యం ధరలు పెంచారు. ట్రాఫిక్ నిబంధన పేరుతో బాదుడు శృతిమించుతుంది. ఇలాధరల విజృంభణతో బతుకుబండి అమాంతం తలకిందులై సాధారణ జనం అల్లాడిపోతున్నారు. ధరల స్థిరత్వంపై ఆర్‌బిఐ ద్రవ్యక్రమశిక్షణపై ప్రభుత్వం దృష్టికేంద్రీకరించాలి. రూపాయి బలపడాలంటే వస్తు ఉత్పత్తి, సేవలరంగాల్లో మనదేశం అంతర్జాతీయస్థాయి అందుకోవాలి. విదేశీ చెల్లింపులకు సంబంధించి మిగులు స్థాయిలోనే దిగుమతులు జాబితాను కనిష్టస్థాయికి కుదించాలి. ఈ ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని, ఉపాధి లేమిని సాధ్యమైనంత మేరకు నియంత్రించాలి. రూపాయి క్షీణతతో పెరిగే రుణభారం మనదేశానికి ఎంత మాత్రం ఆర్థికపరంగా క్షేమంకాదు. రూపాయి విలువబలపడితేనే మన దేశ ఆర్థిక రంగం కోలుకుంటుందనే ఆర్థిక నిపుణల సూచలన మేరకు ప్రతికూలతలు, ప్రతిబంధకాలను అధిగమిస్తూ ప్రభుత్వం వెంటనే శాస్త్రీయ, ప్రణాళిక బద్ధ కార్యాచరణతో నిపుణులు సూచన మేరకు దిద్దుబాటు చర్యలకు పూనుకోవాలి. ●

# నేతల వరాలు ప్రజలకు శాపం కారాదు!

బి. లలితానంద ప్రసాద్

ఏ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి అయినా సమిష్టికృషి అవసరం. సాంఘిక చైతన్యం తప్పనిసరి. తద్వారానే సమస్త వనరుల సంపూర్ణ సద్వినియోగం జరిగేది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కొనుగోలుశక్తి, జీవన ప్రమాణాలు పెరిగేది. ఇందుకు మన పొరుగు రాష్ట్రం తమిళనాడు ప్రత్యక్ష సాక్ష్యం అన్నది జగమెరిగినది. అందుకు పూర్తి భిన్నంగా ఉండుటవిభక్తి, అవిభక్త మనరాష్ట్రం ఉండటం సర్వజన విదితం. ఇది మరోసారి తాజాగా నిరూపితమవుతుంది. ఎంతో గట్టిపోటీలో సొంత ప్రభుత్వం ఉన్న కర్ణాటక రాష్ట్రాన్నికాదని, ఎన్నో సదుపాయాలు ఉన్న ఇతర దక్షిణాది రాష్ట్రాలనీకాదని కేంద్రం మన రాష్ట్రానికి 'బల్క్ డ్రగ్ పార్క్' కేటాయించడం హర్షనీయం. అయితే కొందరు రాజకీయ జీవులు, ఆర్థిక జీవులు, సాంకేతిక జీవులు కలగలసి, విడివిడిగా, పరస్పరం మమేకమై పలు రూపాల శంకుల లేవనెత్తడం, అనుమాన బీజాలు నాటడం, సందేహాలు గుప్పించడం వారి సహజ నైజానికి నిలువెత్తు నిదర్శనం. వారు ఎల్లవేళలా మానవతా హృదయంతో అందరి శ్రేయస్సును మనసారా కోరే సాంస్కృత్ జీవులకు అతీతంగా అన్నింటా వక్రంగా, క్రూరంగా ఆలోచిస్తుంటారు. అంతా అలాగే ఉండాలని, ఉంటారని ఆశిస్తారు. పైగా కొంతకాలంగా రకరకాల సంకుచితత్వంలతో నిండిన ఊబిలో కొందరి మేధస్సు కూరుకుపోయి ఏకపక్షంగా కోరిన వారి సేవలో తరిస్తోంది. 'మేక వన్నె పులి' లాగ వీరు ప్రజల పేరుతో స్వీయ రాగద్వేషాల విషాన్ని విరజిమ్ముటకు నిరంతరం ప్రయత్నిస్తుంటారు. వీరి కారణంగా ఆయా ప్రాంతాల ప్రజల సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, దీర్ఘకాల, బహుళ ప్రయోజనాలకు తీవ్రంగా ఎప్పటికీ కోలుకోలేనంతగా విఘాతం కలుగుతుంటుంది. వీరిని ప్రభుత్వం, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండి ఎల్లవేళలా గమనిస్తుండాలి. స్వీయరక్షణతో కార్యాచరణకు పూనుకోవాలి. తమతమ రక్షణ, శాశ్వత ప్రయోజనాలు ప్రస్తుత రాబోవు తరాల కోసం కాపాడుకోవాలి. కేవలం ప్రత్యర్థులనే కారణంతో వారి వాదనను పూర్తిగా కొట్టిపారేయకూడదు. ఎంత పాక్షికమైనా వారి వాదనలో అభిప్రాయాలలో వాస్తవాలు ఉంటే వాటిని తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ ఏ ఒక్కరి గుత్తసొత్తుకాదని గ్రహించాలి. వాస్తవాల్ని అంగీకరించాలి. వారు చెప్పే ప్రమాదాలకు నిజంగా అవకాశం ఉంటే వాటి నివారణకు, నిరోధానికి తొలి నుండి సంపూర్ణంగా జాగ్రత్తలు గైకొనాలి. వారు ఎవరుఅన్నది కాదు ముఖ్యం. చెప్పేదానిలో నిజాయతీ వాస్తవం ఎంత అనేది కీలకం. ప్రజల ప్రాణాల కన్నా మించినది ఏదీలేదు. ఉండదు, ఉండకూడదు. దీనికి సంబంధించి అనేక భయాలు కాలుష్యాలకు సంబంధించినవిగా ఉన్నాయి. వాటిని సంబంధితులు తప్పనిసరిగా నివృత్తి చేయాలి. విజ్ఞతతో కూడిన నిర్ణీత కాలప్రణాళిక, కార్యాచరణ, సమీక్ష, నిరంతరం పర్యవేక్షణతో, పారదర్శకతతో మెరుగుదల ఉండాలి. విశ్వస్థాయిలోప్రపంచ అనుభవాన్ని, పరిణామాల్ని, పర్యవసానలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఎక్కడ ఎలాంటి రాజీలకు సర్దుబాటుకు తావివ్వరాదు. ఈ సందర్భంలో విమర్శకులను అంతా గుర్తు చేసుకోవాల్సింది. గతంలో చెర్నోబిల్ అణుప్రమాదం అనంతరం ఘోరాతిఘోరదారుణాలు అన్నీ తెలిసి ఉండి మన దేశం అమెరికాతో అణు ఒప్పందం ఏర్పర్చుకోవడం జగద్వితం. అలాగే భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో తరతరాలుగా బహురూపాల పీడనకు గురవుతున్న అక్కడి ప్రజల గోడు మన ఉన్నత న్యాయస్థానాల ఉక్కుగోడల ఉపరితలాన్ని స్పృశించలేకపోవడం, దశాబ్దాలుగా గడుస్తున్నా సభ్యసమాజం జనులంతా అప్పటి హృదయవిదారక దారుణాలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. విలువల బేరీజులకు సామాన్య ప్రజల ప్రాణాల కన్నా మానవతా రహిత సంపన్నుల లాభార్జనలే మిన్నగా రూపుదాల్చడం అత్యంత విచారకరం. రాష్ట్రానికి సంబంధించి ఇటీవల కేంద్రం కేటాయించిన బల్క్‌డ్రగ్ పార్క్ విషయంలో ప్రముఖంగా వెల్లడవుతున్న ఆందోళన కాలుష్యానికి సంబంధించినది. ప్రజల ప్రాణాలను కాటువేయగల కాలుష్య విషయంలో ఎలాంటి రాజీ లేకుండా సమస్త ముందు జాగ్రత్తలు గైకొనాలి. లేకుంటే ఇప్పుడు 'వరం' అనుకుంటున్న ఈ బల్క్‌డ్రగ్ పార్క్ రాబోయే రోజుల్లో శాపం కాగలదు. అలా కాకుండాచూడాల్సిన సంపూర్ణ బాధ్యత ప్రభుత్వానిది. అందులోను సంబంధిత యంత్రాంగంది. ఇక్కడ డ్రగ్ కర్మాగారాల్లో నిర్మాణం నుండి అత్యాధునిక ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అన్ని రకాల కాలుష్యం నివారణకు, లేక వీలైనంతగా తగ్గింపునకు ప్రయత్నించాలి. మిగతా ఫ్యాక్టరీలకు మించి వీటిలో ముడిపదార్థం నుండి తుది పదార్థం వచ్చేలోపు కాలుష్యం కలిగించే విసర్జకాలు అనేకం ఉంటాయి. అవి అవిభాజ్యం. వీటి కారణంగా తయారీ నిలిపివేస్తే ప్రపంచమంతా వాటి తయారీ నిలిచిపోతుందనే కనీసఅవగాహన అవసరం. ఈ అత్యవసరాలు లేకుంటే మానవాళి అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది. కొవిడ్ కాలంలో ప్రపంచ ప్రజానీకం అందరికీ ఈ విషయం బాగా అవగతమైంది. కాలుష్య కారణంగా పరిశ్రమలు అందునా ప్రాణావసర మందులవి వద్దనడం, జీర్ణం కాదని తినరాదనడం, ఉపద్రవాలతో పంటలు పండవని విత్తులు నాటొద్దనడం లాంటిదే. వీటన్నింటి రీత్యా మందుల తయారీలో వీలైనంతగా పలురకాల కాలుష్యాల తగ్గింపు, నిల్వ, విడుదల, వగైరా ప్రక్రియల్లో అన్నివిధాల తటస్థీకరణ జరిపి జనావాసాలకు సుదూరంగా విడుదల చేయాలి. భూగర్భజలాలు ఏమాత్రం కలుషితం కాకుండా చూడాలి. నదులు, సముద్రంలోకి విడుదల చేసే వాటి వలన అక్కడ జలచరాలకు హాని కలగరాదు. పారిశ్రామిక కాలుష్యం నుండి ప్రజల ప్రాణాలను కాపాడటంలో తమ కర్తవ్య నిర్వహణ, విద్యుక్తధర్మం నెరవేర్చడంలో ప్రలోభాలకు అతీతంగా ఉండాలి. అన్నివిధాలా తమ అస్తిత్వలక్ష్యాన్ని అకింతభావంతో నిర్వర్తించాలి. పారిశ్రామికవేత్తల కాసుల పంటల కన్నా, వారి ద్వారా పొందే నిధుల గుట్టల కన్నా ఈ పార్కు తీరప్రాంతంలో రావడంతో కొన్ని సౌలభ్యాలు ఉంటాయి. మరికొన్ని ఇబ్బందులు ఉంటాయి. మొదటి వాటిని సంపూర్ణంగా వినియోగించుకోవాలి. రెండో వాటిని అధిగమించడానికి అన్నివిధాలా ప్రయత్నించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ అక్కడిప్రజల ప్రాణాలకు, అందరికీ తిండి పెట్టే పొలాలకు, పంటలకు ఏ రూపంలోనూ ఏమాత్రం హానిజరగనివ్వరాదు. వ్యతిరేకులు, ప్రత్యర్థులు అనే పేరుతో ప్రతిదీ తిరస్కరించనవసరం లేదు. వాటిల్లో నిజాయితీతో కూడిన వాస్తవిక ప్రాతిపదికపై ప్రజా శ్రేయస్సు రీత్యా నిష్కల్మషంగా వచ్చిన వాటిని అన్ని విధాలా పరిగణనలోకి తీసుకొని అవసరమైనచోట తగురీతిలో సవరించుకోవాలి. దీర్ఘకాలంలో అవి అందరికీ మేలు చేస్తాయి. బహుళ ప్రయోజనాలనిస్తాయి. నిజమైన విలువైన సలహాలు పాటించగలిగితే అవి ఇచ్చిన వారికన్నా పాటించిన వారే ప్రయోజనం పొందుతారు. ఈ విజ్ఞత పాలకులలో ఏ మేరకు ఉంటే ఆ సమాజం అంతగా సర్వతోముఖాభివృద్ధి చెందుటకు ఎక్కువఅవకాశాలు ఉంటాయి. ●

# గాంధీజీ ఆదర్శాలకు పునరంకితం

● 153వ జయంతి సందర్భంగా ఘన నివాళి ● రాజ్‌ఘాట్‌ను సందర్శించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియా



**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ జీవితాదర్శాలైన శాంతి, సమానత్వం, మత సామరస్యానికి మనమందరం పునరంకితమవుదామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. మహాత్ముడి 153వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ఆమె ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య అమృత్ మహోత్సవాల వేళ జరుపుకుంటున్న ఈ జయంతికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని ముర్ము అన్నారు. గాంధీజీ కలలుకన్న ఆదర్శాలు సాకారం కావడం కోసం మనమంతా కృషి చేయాలని ఆమె సూచించారు. అక్టోబర్ 2న జన్మించిన మరో ప్రముఖ నేత, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రికి కూడా రాష్ట్రపతి నివాళులర్పించారు. విజయ్‌ఘాట్‌లోని శాస్త్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. జైజవాన్, జైకిసాన్ నినాదాలిచ్చిన శాస్త్రీజీ హరిత విప్లవం, శ్వేత విప్లవంలో కీలక పాత్ర పోషించారని ముర్ము గుర్తు చేశారు.

**గాంధీజీకి నివాళిగా దేశీయ ఉత్పత్తులు కొనాలి : ప్రధాని మోడీ :** ప్రధాని మోడీ కూడా రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్ముడికి నివాళులర్పించారు. గాంధీజీకి నివాళిగా ఖాదీ, దేశీయ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. మహాత్ముడి ఆదర్శాలకు అనుగుణంగా జీవించాలన్నారు. లాల్ బహదూర్‌శాస్త్రికి కూడా ప్రధాని నివాళులర్పించారు. నిరాడంబరతకు శాస్త్రీజీ పెట్టింది పేరని, దేశ చరిత్రలో కీలక సమయంలో ఆయన పటిష్ట నాయకత్వం అందించారని ప్రధాని గుర్తు చేశారు.

గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రీజీలకు నివాళులర్పించినవారిలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జునఖర్గే, కేంద్రమంత్రులు, ఇతర పార్టీల నేతలున్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ప్రస్తుతం కర్నాటకలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మైసూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని మహాత్ముడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ వెంట సీనియర్ నేత డికె శివకుమార్‌సహా ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలున్నారు.

**నేటి ప్రపంచ సవాళ్లకు ఆయన మార్గమే పరిష్కారం : ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్**

మరోవైపు గాంధీ జయంతిని ఏటా అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ మహాత్ముడి ఆదర్శాలను గుర్తు చేసుకున్నారు.

గాంధీ బాటలో అహింసా మార్గాన్ని అనుసరిస్తూ ప్రపంచవ్యాప్తంగా శాంతిసాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పుడే యావత్ ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగ మించగలదని ఆయన అన్నారు.

## ఒక్కరోజులో కరోనా కేసులు 3364, మృతులు 7
## దేశంలో మొత్తం బాధితులు 4,45,94,487

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్2:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 3364 కేసులు నమోదయ్యాయి. 7 మంది మరణించారు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,45,94,487కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,40,28,370 మంది కోలుకోగా 39,293 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,28,673కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.73 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 81,21,873కి చేరగా, 79,70,493మంది వరకు కోలుకున్నారు. 1,48,346 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటివ్ కేసులసంఖ్య 68,05,661కి చేరింది. అందులో 67,22,898మంది కోలుకున్నారు. 71,158 మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 40,64,979కిచేరింది. అందులో40,21,860మంది కోలుకున్నారు. 40,284 మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య 35,83,613కి చేరింది. అందులో35,40,100మందికోలుకున్నారు. 38,047మంది మరణించారు.



## ముంబయిలో 1476 కోట్ల డ్రగ్స్ పట్టివేత

**ముంబయి, అక్టోబరు 2:** భారత్‌లోమరోసారి భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారు. నవీ ముంబయిలో 198 కిలోల హైప్యూరిటీక్రిస్టల్ మెథాంపెటమైన్ తొమ్మిదికిలోల హైప్యూరిటీ కొకైన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మాదకద్రవ్యాల విలువ 1476 కోట్లరూపాయలుంటుందని అంచనా వేసారు. ఈ మత్తు ఉత్పత్తులను వాలెన్షియారకం విదేశీ కమలా ఫలాల బాక్సుల్లో ఉంచి అక్రమ రవాణాచేస్తున్నారు. ఈ హైప్యూరిటీ డ్రగ్స్ తీసుకున్నవారికి ఆమత్తు 12 గంటలవరకూ ఉంటుందని నిపుణులు చెపుతున్నారు. దక్షిణాఫ్రికానుంచి భారత్‌కు ఈ మత్తు ఉత్పత్తుల అక్రమ రవాణాచేస్తున్నట్లు అధికారుల అనుమానం. ఈ డ్రగ్స్‌ను దిగుమతిచేసుకున్న వ్యక్తిని డిఆర్ఐ అధికారులు అరెస్టుచేసారు. ఆతడికి సహకరించిన కస్టమ్స్ హౌస్ ఏజెంట్‌కోసం స్థానిక నార్కోటిక్స్ నెట్‌వర్క్ సభ్యుల కోసం అధికారులు, దర్యాప్తు ఏజెన్సీలు విస్తృత గాలింపు చేపట్టాయి.

## సమస్యలు, సవాళ్లు అధిగమించేందుకు కేడర్ సిద్ధం కావాలి
## చైనా కమ్యూనిస్టు మహాసభలకోసం అధ్యక్షుడు జిన్‌పింగ్ దిశానిర్దేశం



**బీజింగ్, అక్టోబరు 2:** భవిష్యత్తులో భారీ సవాళ్లు, మరింత సంక్లిష్ట పరిస్థితులనుఅధిగమించేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ కేడర్ సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యులు తమ ప్రయాణంలో సంయమనం, సమైక్యతను పాటించి పట్టుదలతో ముందుకు పోవాలని కోరారు. ఈనెలలోనే చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభలను జరగనున్నందున పార్టీకేడర్‌ను సమాయత్తం చేసేందుకు జిన్‌పింగ్ ఇప్పటినుంచే సిద్ధం అయ్యారు. చైనా నేషనల్‌డే సందర్భంగా పార్టీ జర్నల్ క్విషిలో ప్రచురితం అయిన వ్యాసం ప్రకారంచూస్తే మన ప్రయాణంలో చివరి మైలువరకూ కూడా సవాళ్లు సమస్యలే ఎక్కువ ఉన్నాయని జిన్‌పింగ్‌చెప్పినట్లు తెలుస్తోంది. మన ప్రయాణంలో ఎదురయ్యే భారీ అడ్డంకులన్నింటినీ అధిగమించి వివాదాలనుపరిష్కరించుకోవాల్సిన తరుణం ఆసన్నం అయిందని, కొత్త చరిత్రాత్మక నిర్ణయాలతో మరిన్ని భారీ సంఘర్షణలకు సిద్ధం కావాల్సి ఉందని అన్నారు. ఐదేళ్లకోసారి చైనాలో జరిగే అధికార చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభల నిమిత్తం జిన్‌పింగ్ సౌత్‌చైనా మార్నింగ్‌పోస్టులో సంపాదకీయం కూడా రాసారు. 96 మిలియన్ల సభ్యత్వం ఉన్న కమ్యూనిస్టుపార్టీ మహాసభలు ఈ అక్టోబరులోనే జరగనున్నాయి. ఇదే సమావేశాల్లో జిన్‌పింగ్ మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికవడం లేదా చైనాకమ్యూనిస్టుపార్టీకి శాశ్వత అధ్యక్షుడుగారావడం అధ్యక్షుడి ప్రధాన లక్ష్యంగా ఉన్న సంగతి తెలిసిందే. అదే జరిగితే పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత పదేళ్లకు మించి అధికారంలో ఉన్న ఏకైక నేతగా జిన్‌పింగ్ నిలుస్తారు. అయితే తైవాన్‌పైచైనా వైఖరికి అటు అమెరికా, ఇటు యూరోపియన్ యూనియన్, జపాన్‌లు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తుండటంతోపాటు సైనిక చర్యను అడ్డుకుంటామని తైవాన్‌కు భరోసా ఇవ్వడం, దేశీయంగా కూడా పలు ఒత్తిళ్లు ఎదురవుతుండటంతో జిన్‌పింగ్ మూడోసారి అధ్యక్షఎన్నికకావడం ఆయనకు సవాలుగానే మారింది. జిన్‌పింగ్‌చేపట్టిన జీరో కొవిడ్‌పాలసీతో దేశీయంగా ఆర్థిక మందగమనం చోటుచేసుకుంది. పాతవిధానాలు, పిడివాదం, మూస విధానాలకు మళ్లీ వెళ్లేప్రశ్నేలేదని జెండాలుమార్చే పద్ధతులు అలవాటులేదని ఆదివారం కేడర్‌నుద్దేశించి జిన్‌పింగ్ హితబోధచేసారు. రాజకీయ వ్యవస్థను మార్చే విప్లవాత్మక భావజాలంతోనే ముందుకువెళతామని జిన్‌పింగ్ కమ్యూ నిస్టుపార్టీ కేడర్‌కు దిశా నిర్దేశంచేసినట్లు తెలుస్తోంది. 2012 లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి జిన్‌పింగ్ అవినీతి వ్యతిరేక జాతాను కొనసాగించారు. పదిలక్షలమందికిపైగా ప్రభుత్వ సిబ్బంది, టాప్ మిలిటరీ అధికారులు డజను కుపైగా శిక్షలకు లోనయ్యారు. ఈ విధానంతోనే జిన్‌పింగ్ తన పార్టీ, ప్రభుత్వంపై పట్టును పెంచుకోగలిగారని, మిలిటరీపైనా తన పట్టును కొనసాగించగలుగుతున్నారని పరిశీలకులు అంటున్నారు. ఐదేళ్లకోసారి చైనా కమ్యూనిస్టుపార్టీ సమావేశాలు జరగడం సహజమే అయినా ఈసారి జరిగే సమావేశాలు నాయకత్వ మార్పుకోసం జరుగుతున్నట్లుగా ఉండటంతో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. చైనా ప్రీమియర్ లీ ఖెయాంగ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు మరింతగా కృషిచేసి ఆర్థిక వ్యవస్థను పటిష్టంచేయాలని కోరారు. జిన్‌పింగ్ తర్వాత రెండో స్థానంలో ఉన్న కీలకమైన ప్రతినిధి కావడంతో ఆయనకు సైతం చైనా ప్రభుత్వంలో మంచి పట్టుంది. కెఁయాంగ్‌మాట్లాడుతూ చైనా ఆర్థిక వ్యవస్థ ఇపుడు అనేక కష్టాలు, సవాళ్లను ఎదుర్కొంటున్నదని, సమయం మనకోసం ఆగదని, మనమే అన్ని నివారణ చర్యలకు ఉపక్రమించాలని, ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ ముఖ్యలక్ష్యంగా పనిచేయాలనిసూచించారు.

## ఉక్రెయిన్ అధ్యక్షుడు స్వస్థలంలో రష్యా డ్రోన్‌దాడులు



**క్యీవ్, అక్టోబరు 2:** ఉక్రెయిన్‌పై తన దండ యాత్రను కొనసాగిస్తున్న రష్యా తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు స్వస్థలం క్రివ్యీరీహ్‌పై ఆత్మా హుతి డ్రోన్లతో దాడులునిర్వహించింది. లైమాన్ నగరాన్ని రష్యాదళాలనుంచి ఉక్రెయిన్ సైనికులు తిరిగి తమ అధీనంలోకి తీసుకోవడంతో ఇపుడు రష్యా మరింతగా రెచ్చిపోతోంది. లైమాన్‌నగరం కీలకమైన రవాణా హబ్‌గా నిలిచింది. దీనితో ఇపుడు తమ స్వాధీనంనుంచి తిరిగి ఉక్రెయిన్ పట్టులోకి వెళ్లిపోవడంతో రష్యాకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను తమభూభాగంలోనివేనని ఎవ్వరు దాడులుచేసినా రష్యాపై దాడులుచేసినట్లుగానే పరిగణిస్తామని అధ్యక్షుడు పుతిన్ చెప్పిన తర్వాత 24 గంటల్లోనే లైమాన్ నగరాన్ని స్వాధీనంచేసుకుని ఉక్రెయిన్ దళాలు తమ పట్టును మరింత పెంచుకున్నాయని తెలుస్తోంది. లైమాన్ నగరంలో ఉక్రెయిన్‌పతాకం ఎగురుతోందని, మరో వారంరోజుల్లో మరికొన్ని నగరాల్లో ఉక్రెయిన్‌పతాకాలు కనిపిస్తాయని, డాన్‌బాస్‌పైనా ఉక్రెయిన్‌పతాకం ఎగురుతుందని అధ్యక్షుడు వోలోదిమిర్‌జెలెన్‌స్కీ తెలిపారు. కాగా ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు స్వస్థలంలోని పాఠశాలపై ఆత్మాహుతి డ్రోన్‌దాడిజరిగిందని, ఈ మంటలను సకాలంలోనేఆర్పివేసినట్లు ఆప్రాంత గవర్నర్ వెల్లడించారు. రష్యా తన దాడులను జపోరిఝియాపైనే కేంద్రీకరించిందని తెలిపారు. రష్యాకు చెందిన ఆయుధడిపోపై దాడిని చేసామని, చెర్నిహివ్‌లో ఉన్న ఈ ఆయుధడిపో ధ్వంసంతో రష్యాకు భారీ నష్టం కలిగించగలిగినట్లు ఉక్రెయిన్‌మిలిటరీ వెల్లడించింది. రెండు ఎస్300 యాంటి ఎయిర్‌క్రాఫ్ట్ బ్యాటరీలను కూడా నాశనంచేసింది. రష్యా స్వాధీనంచేసుకున్న ప్రాంతాలపై ఉక్రెయిన్ మళ్లీ పట్టు సాధించి తిరిగి స్వాధీనంచేసుకోవడంతో రష్యాకు ఆగ్రహం పెంచింది. మరింత ఉద్రేకానికి లోనయింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌కు పెరుగుతున్న ఈ మద్దతు అంతా అమెరికా పర్యవేక్షణలోనే జరుగుతోందని రష్యాను మరింత నాశనం చేయాలన్న కుట్రతోనే అమెరికా వ్యవహరిస్తోందని విమర్శించారు. పశ్చిమదేశాలన్నీ ఒక్కటయినా రష్యా తన సార్వభౌమత్వ పరిరక్షణకు అవసరమైతే అణుదాడులకుసైతం సిద్ధం కావాల్సి వస్తుందని మరోసారి ఆయన హెచ్చరికలుచేసారు.

## ఆర్థికవ్యవస్థ స్థిరీకరణకే నా తొలిప్రాధాన్యం: బ్రిటన్‌ప్రధాన మంత్రి లిజ్‌ట్రస్



**లండన్, అక్టోబరు 2:** ప్రభుత్వ వ్యయపరిమితులు పెరిగిపోతుండటం, పౌండ్ కనిష్టస్థాయికి తాకినందున బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు తాను అత్యంత ప్రాధాన్యతనిస్తానని బ్రిటన్ కొత్తప్రధాన మంత్రి లిజ్‌ట్రస్ వెల్లడించారు. బిబిసి టివితో జరిగిన చిట్‌చాట్‌షోలో ఆమె మాట్లాడుతూ కేబినెట్ మంత్రులకు ప్రభుత్వం పన్నుల్లో ఉన్న టాంప రేట్‌ను రద్దుచేస్తామన్న సమాచారం ఇవ్వలేదని, బడ్జెట్‌కు సంబంధించిన రూపకల్పన, తీసుకునే నిర్ణయాలు కొన్ని గోప్యంగానే జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. అయితే తాము చేపట్టే ఆర్థిక స్థిరీకరణ చర్యలకు మార్కెట్లనుంచి ప్రతికూల స్పందన కూడా అతితక్కువగానే ఉండేటట్లు చూస్తామని అన్నారు. కన్సర్వేటివ్‌పార్టీ వార్షిక సదస్సు సందర్భంగా మొదటిరోజు లిజ్‌ట్రస్ మాట్లాడుతూ ఆర్థికవ్యవస్థ స్థిరీకరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తానని, ఆర్థికవృద్ధి ప్రణాళికపైనే తాను కొనసాగుతానని, ఇన్వెస్టర్లు, ఆర్థికవేత్తలు విమర్శలు చేసినా అదనపు వ్యయంకోసం ప్రస్తుతం బిలియన్లకొద్దీ పౌండ్లను కేటాయింపులు జరిపినా కొన్ని వివరాలు మాత్రమే ఇవ్వడంపై వచ్చిన ప్రశ్నలకు ఆమె స్పందించారు. వారి ఆందోళనను అర్థంచేసుకోగలనని, మేం ప్రకటించిన ప్యాకేజికే తాను కట్టుబడి ఉన్నానని, సత్వరమే అమలుకు సైతం బాధ్యత తీసుకుంటానన్నారు. అయితే ఇం దుకు క్షేత్రస్థాయినుంచి మంచి ప్రణాళికను అమలు చేయాల్సి ఉందన్నారు. తన కేబినెట్‌లోని కీలక మంత్రులకు టాప్‌రేట్‌టాక్స్ రద్దుపై ముం దస్తు సమాచారం లేదన్న ప్రశ్నలపై ఆమె మాట్లాడుతూ ఈ నిర్ణయం తమ ఆర్థికమంత్రి క్వాసీ క్వార్టెంగ్ తీసుకున్నారని, ట్రెజరీ ఛాన్సలర్ తీసుకున్న నిర్ణయం అని ఆమె తెలిపారు. బడ్జెట్లను రూపకల్పన చేసే సమయంలో వాటిని అత్యంత గోప్యతతో కూడిన విధానంలో రూపొందిస్తారని లిజ్‌ట్రస్ వెల్లడించారు.

## ఆప్‌ను ఓడించేందుకు ఒక్కటైన కాంగ్రెస్, బిజెపిలు
## గుజరాత్‌లో ఆప్ అధినేత కేజ్రీవాల్

**అహ్మదాబాద్, అక్టోబరు 2:** గుజరాత్‌లో ఆమ్ ఆద్మీపార్టీ అధికారంలోకి వస్తే గోవుల పరిరక్షణకోసం రోజుకు 40 రూపాయలుచొప్పున చెల్లిస్తామని, పాడిలేని పశువులకోసం కొత్తగా షెల్టర్ ఏర్పాటుచేస్తామని ఆమ్ ఆద్మీపార్టీ అధినేత కేజ్రీవాల్ వెల్లడించారు. హిందూ ఓటర్లను ఆకట్టుకునేందుకు గుజరాత్‌లో ఆమ్ ఆద్మీపార్టీ పలు హామీలు కుమ్మరిస్తున్న సంగతి తెలిసిందే. బిజెపి, విపక్ష కాంగ్రెస్‌పార్టీలు ఆప్ ఓట్లను చీల్చేందుకు ఇపుడు రాష్ట్రంలో ఒక్కటి అయ్యాయని ఇంటెలిజెన్స్ నివేదికలే స్పష్టంచేస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల నంతరం తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని వెల్లడించారు. ఢిల్లీలో తాము ప్రతి గోవుకు రోజుకు 40 రూపాయలు చెల్లిస్తున్నామని, ఢిల్లీ ప్రభుత్వం 20 రూపాయలు, మున్సిపల్‌కార్పొరేషన్ 20 రూపాయలు చెల్లిస్తు న్నట్లు తెలిపారు. ఆప్ గుజరాత్‌లో అధికారంలోకి వస్తే రోజుకు ఒక్కొక్క గోవుకు 40 చొప్పున చెల్లిస్తామన్నారు. పశువులకోసం గోశాలలు ఏర్పాటుచేస్తామని ప్రతిజిల్లాలోను పాడి ఇవ్వని పశువులకు కూడా గోశాలలునిర్మిస్తామన్నారు. దీనివల్ల గోవులు రోడ్లపై తిరగడం తగ్గుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో గోసరంక్షణకు ఆప్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుం టుందన్నారు. గోశాలలకోసం ప్రభుత్వం హామీ ఇచ్చిన 500 కోట్ల నిధులను విడుదలచేయడంలో జరుగుతున్న జాప్యంపై షెల్టర్ నిర్వాహకులు చేపట్టిన నిరసనలపై ఆప్ అధినేత స్పందించారు. తాను భోజనంచేసిన ఆటోడ్రైవర్ తాను బిజెపికే మద్దతిస్తానన్న వ్యాఖ్యలపై వ్యక్తులను పార్టీల ఆధారంగా వివక్ష చూపించలేనని అదివారి స్వేచ్ఛ అని ఆయన అన్నారు. వారు కాంగ్రెస్ అయినా బిజెపి అయినా వారు తనను డిన్నర్‌కు ఆహ్వానించారని, అందువల్లనే పార్టీ రహితం గానే ఆలోచించి తాను వారి ఇంటికి వెళ్లానన్నారు. వారి స్వేచ్ఛకు అనుగుణంగా ఏపార్టీకి అయినా వారు ఓటువేయవచ్చన్నారు. నేనెవ్వరినీ మీరేపార్టీకి ఓటువేస్తారని అడగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటిరోజునుంచే అన్ని వర్గాలప్రజల సంక్షేమానికి పనిచేస్తామని ఎలాంటి వివక్ష ఉండబోదన్నారు. బిజెపి కాంగ్రెస్ పార్టీలు ఇపుడు గుజరాత్‌లో ఒక్కటిఅయ్యాయని, ఆప్‌ను ఓడించే లక్ష్యంతోనే పనిచేస్తున్నాయన్నారు. గుజరాత్‌లో బిజెపి ఆప్ ఓట్లను సంగ్రహించేందుకు కాంగ్రెస్‌పార్టీకి బాధ్యతలు అప్పగించిందన్నారు. ఇంటెలిజెన్స్ నివేదికలు వచ్చిన తర్వాతనుంచే బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు వణుకు ప్రారంభం అయిందని, రెండు పార్టీలు ఒక్కటయ్యాయని, రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నాయన్నారు. 182 మందిసభ్యులున్న గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్‌పార్టీకి ఈసారి పదిస్థానాలకు మించి రావన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ బిజెపిజేబులోని మనుషులేనన్నారు. అవసరమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేస్తుందని, మరికొందరిని అలా స్టాకులో పెట్టుకుందని ఎద్దేవాచేసారు. దేశం మొత్తం ఇపుడు ఇదే జరుగుతోందని దుయ్యబట్టారు. ప్రధానిమోడీ ప్రారంభించిన 20వేల కోట్ల ప్రాజెక్టులు కాంట్రాక్టర్లు, మంత్రులకే లాభం చేకూరుతుందని, ప్రజలకు కానేకాదని అన్నారు. ప్రజలకు మంచి విద్య, ఉపాధి, విద్యుత్ వ్యయంలో తగ్గింపు, సురక్షిత మంచినీరు, ద్రవ్యోల్బణంనుంచి ఊరట కలిగించాలని కోరుతున్నారని, ఢిల్లీ పంజాబ్‌లలో మేం చేసి చూపించామని, గుజరాత్‌లో కూడా చేపట్టిన విజయం సాధిస్తామన్నారు.



## ఇరాన్ హిజబ్ నిరసనల్లో ఇప్పటివరకూ 92 మందిమృతి

**టెహ్రాన్, అక్టోబరు 2:** మెహసా అమిని మృతిసంఘటనను పురస్కరించుకుని ఇరాన్‌దేశవ్యాప్తంగా ఎగిసిపడిన నిరసనల్లో ఇప్పటివరకూ 92 మంది చనిపోయారు. ఇరాన్ నైతికత పోలీసులు అరెస్టుచేసిన మహసా అమినిని దారుణంగా హింసించడంతో ఆమె చనిపోయింది. నార్వే కేంద్రంగాపనిచేస్తున్న ఇరాన్ మానవహక్కుల ఎన్‌జిఓ ఆదివారం మొత్తం 92 మంది చనిపోయారని ప్రకటించింది. ఇరాన్‌ప్రభుత్వ అకృత్యాలపై అంతర్జాతీయ సమాజం విచారణచేయాల్సిన అవసరం ఎంతో ఉందని సంస్థ డైరెక్టర్ మహమూద్ అమిరి మోఘద్దమ్ వెల్లడించారు. అంతకుముందు 83 మంది చనిపోయారని, రానురాను నిరసనలు మరింత ఉధృతం అవుతుండటంతో అణిచివేత కార్యాచరణలో పోలీసులు చేపట్టిన దమనకాండలో 92 మంది ఇప్పటివరకూ చనిపోయినట్లు మహమూద్ అమిరి తెలిపారు. హిజబ్ నిబంధనల ప్రకారం వదులుగా ఉన్న దుస్తులు ధరించి పూర్తిగా శిరస్సును కూడా కప్పి వేసుకోవాలని ఆవిధమైన వస్త్రధారణమాత్రమే అనుమతిస్తామని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై ఇరాన్‌మహిళలనుంచి తీవ్రస్థాయి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. మోహసా అమిని మృతితో ఇపుడు ఈనిరసనలు దేశవ్యాప్తంగా ఎగిసిపడుతున్నాయి.

# తిరుమల బ్రహ్మోత్సవాలు



## హనుమంతునిపై 'వేంకటాద్రిరాముడు'

**తిరుమల, అక్టోబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** అంజనాద్రీశుడు శ్రీవేంకటేశ్వరుడు ఆదివారం ఉదయం ప్రియదాసభక్తుడైన ఆంజ నేయుడిపై వేంకటాద్రిరాముడుగా దర్శనమిచ్చాడు. ఏడుకొండల్లో అంగరంగవైభ వంగా జరుగుతున్న సాలకట్లబ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు ఆదివారం ఉదయం మలయప్పస్వామి విశేషఅలంకారభూషితుడై వాహనమండపం వద్దకు వేంచేపు చేశారు. ఇక్కడ వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని హనుమంతవాహనంపై అధిరోహింపజేశారు. ఉదయం 8గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. భక్తులు ఆదపమొక్కులవాడా..గోవిందా..వేంకట రమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు.

**భగవంతుని వాహనంమోసిన సిజెఐ లలిత్:** దేశఅత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి అయినా భగవంతుని చెంత సేవకుడిగానే జస్టిస్ యుయు లలిత్ దంపతులు భక్తితో హనుమంతవాహనాన్ని భుజాలపైమోశారు. దైవంముందు సేవకులుగా అనందపరవశుల య్యారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్‌దంపతులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్ర దంపతులు, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు పోకలఅశోక్‌కుమార్, నందకుమార్, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మాం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, డిప్యూటీ ఇఓ రమేష్‌బాబు, పేష్కార్ శ్రీహరి, విజిఓ బాలిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



## ఉభయదేవేరులతో స్వర్ణరథంపై శ్రీనివాసుడు

**తిరుమల, అక్టోబర్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడు, భక్తులకు కొంగుబంగారంగా నిలిచిన ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆదివారం సాయంత్రం తనకెంతో ఇష్టమైన స్వర్ణరథంపై ఉభయదేవేరులతో కలసి ఊరేగారు. కలియుగవైకుంఠమ్‌లో జరుగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు సాయంత్రం బంగారుదేవుడు స్వర్ణాభూషితఅలంకృతుడై ధగధగమెరిసే ఆభరణాలతో బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సంధ్యాసమయంలో చల్లటిగాలులు వీస్తుండగా స్వర్ణరథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్దనుంచి బయలుదేరింది. ఈ స్వర్ణరథోత్సవంలో కల్యాణకట్టమిరాశీదారులు సమర్పించిన ఒక సువర్ణఛత్రాన్ని తొలుత రథంపై అలంకరించారు. భగవంతుడు శైల్య, సుగ్రీవ, మేఘ, పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయమినిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. స్వర్ణరథంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు పోకలఅశోక్‌కుమార్, నందకుమార్, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మాం, సివిఎస్ఓ నరసింహకిశోర్, మహిళా భక్తులు పాల్గొన్నారు.



## గజవాహనంపై గోవిందుడు దర్శనం

**తిరుమల, అక్టోబర్ 2 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలదేవుడు ఆదివారం రాత్రి గజవాహనాన్ని అధిరోహించి మాఢవీధుల్లో భక్తులకుదర్శనమిచ్చాడు. శ్రీవారి సాలకట్లబ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి గజవాహనంపై గజరాజరక్షకుడు అభయమిచ్చాడు. రాజులకు విజయచిహ్నంగా గజాలపై యుద్ధాలకు వెళతారు. అంతటి శక్తివంతమైన గజాన్ని దేవదేవుడు వాహనంగా చేసుకుని గజేంద్రమోక్షకుడు దర్శనమివ్వడం శుభకరం. రాత్రి 7గంటలకు అర్చకులు కర్పూరహారతులిచ్చి వాహనం బయలుదేరింది. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ వైవిసుబ్బారెడ్డి దంపతులు, ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 62.33 కోట్లకుపెరిగిన ప్రపంచ వైరస్ కేసులు
## 65.50 లక్షలకు చేరుకున్న మరణాలు

**జెనీవా, అక్టోబరు 2:** ప్రపంచదేశాల్లో కరోనా కేసులు స్వల్పంగాపెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఆదివారంనాటికి కరోనా కేసులు 62.33 కోట్లకుపైగా నమోదుకాగా 65.50 లక్షలమంది చనిపోయారు. మరో 39,485 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 60.32కోట్లవరకూ ఉన్నాయి. మరో 1.36 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 22.77 కోట్లమందికికరోనాసోకి 19.21 లక్షల మంది చనిపోయారు. మరో 9324 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 22.10 కోట్లకుపైగా నమోదుకాగా మరో 47.19 లక్షల మంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో 11.64 కోట్ల మందికి కరోనాసోకి 15.40 లక్షలమంది చనిపోయారు. మరో 8091 మంది పరిస్థితి ఆందోళనగాఉంది. రికవరీలు 11.13 కోట్లకుపైగా నమోదుకాగా మరో 35.68 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 19కోట్లమందికికరోనాసోకితే వారిలో 14.80లక్షలమంది మృతిచెందారు. మరో 10,696 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 18.42 కోట్లకుపైగా నమోదు కాగా మరో 43.69 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాడుతున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 64.11కోట్లకుపైగాబాధితులుంటేవారిలో 13.30 లక్షలమందిచనిపోయారు. రికవరీలు 6.23కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,03,633 మంది ఇప్పటికీ వైరస్‌తో ఉన్నారు. ఆఫ్రికాదేశాల్లో మొత్తం కరోనాబాధితులు 1.26 కోట్లకుపైగా ఉంటే వారిలో 2,57,633 మందిచనిపోయారు. రికవరీలు 1.20 కోట్లవరకూ ఉన్నాయి. వీరుకాకుండా మరో 4.02 లక్షలమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతూ వైరస్‌తో సతమతం అవుతున్నారు. 19 ద్వీపకల్పదేశాల పరంగాచూస్తే మొత్తం 1.24 కోట్లమందికి కరోనాసోకి 20,973 మందిచనిపోయారు. రికవరీలు 1.22కోట్లకు పైగా ఉన్నాయి. మరో 1.36లక్షల మంది ఇప్పటికీ ఆందోళనకర పరిస్థితుల్లోనే ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థకు ఈ దేశాలనుంచి నివేదికలు వెళ్లాయి.

# జాతిపితకు ఘన నివాళులు అర్పించిన మంత్రులు

## వివిఐపిలు, విద్యార్థులు లేక బోసిపోయిన బాపూఘాట్

**హైదరాబాద్ (నార్సింగి), అక్టోబరు 2, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, ప్రశాంత్‌రెడ్డి, టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కేశవరావ్ పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం మంత్రులు బాపూఘాట్‌కు వచ్చి నివాళులు అర్పించారు. గాంధేయవాదులు, టిఆర్ఎస్ నాయకులు మహాత్మాగాంధీ అమర్‌హై అంటు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాపూఘాట్ మైదానంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి కూడా పుష్పాలతో నివాళులు అర్పించారు. సిఎం, గవర్నర్ రాకపోవడంతో ఈసారి బాపూఘాట్ కళతప్పి కనిపించింది. బాపూఘాట్ నిర్మించిన తరువాత తొలిసారిగా ఇలా వివిఐపిలు లేకుండా గాంధీజయంతి వేడుకలు జరుపు కోవడం బాధగా ఉందని పలువురు గాంధేయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతిపిత గాంధీ జయంతి వచ్చిందంటే బాపూఘాట్‌లో పండగ వాతావరణం ఉండేదని, ఈసారి ఆ కళనే కనిపించలేదని పేర్కొన్నారు. సెలువులు ఉండడం వలన విద్యార్థులు కూడా రాకపోవడంతో ప్రాం గణమంతా బోసిపోయి కనిపించింది. ప్రముఖులెవరూ బాపూఘాట్‌కు రావడం లేదని తెలియడంతో పోలీసు బందోబస్తు కూడా అంతంతమాత్రంగానే నిర్వహించారు. బాపూఘాట్‌లో ఏర్పాట్లు ఘనంగానే చేసినా వివిఐపిలు రాకపోవడంతో సాదాసీదాగా సాగింది. పలువురు స్థానిక నాయకులు, గాంధేయవాదులు, జర్నలిస్టులు బాపూ జీ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి ఘన నివాళులు అర్పించారు.



### మహాత్ముడి స్ఫూర్తితో ముందుకు సాగాలి : భట్టి విక్రమార్క

**మెహిదీపట్నం:** మహాత్మాగాంధీ ఇచ్చిన శాంతి స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. గాంధీ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో జరిగిన జయంతి వేడుకల్లో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హనుమంతురావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ వైస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. నీరంజన్, మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డితో కలిసి గాంధీ సమాధి, విగ్రహం వద్ద పూలమాళలు వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ నాయకులు కూరాకుల కృష్ణ, చంటిబాబు స్థానిక నేతలు ఉన్నారు.

# సమసమాజ స్థాపనకు బసవేశ్వరుడి బాటలో పయనిద్దాం

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కోకాపేట్‌లో బసవేశ్వర భవనానికి భూమిపూజ

**హైదరాబాద్ (నార్సింగి), అక్టోబరు 2, ప్రభాతవార్త :** సమసమాజ స్థాపన కోసం బస వేశ్వరుడు చూపిన బాటలో పయనిద్దామని వైద్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గండిపేట్ మండలంలోని కోకాపేట్‌లో ఎకరం భూమిలో రూ.10.కోట్లతో నిర్మిస్తున్న "బసవేశ్వర భవనం"కు మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి హరీశ్‌రావు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభ సభా వేదిక వద్దకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చిన వేలాది మంది లింగాయత్‌లను ఉద్దేశించి హరీష్‌రావ్ ప్రసంగించారు. బసవేశ్వరుడు 12.వ,శతాబ్దంలోనే కుల,మతాలకు అతీతంగా సమానత్వం ఉండాలని, మహిళలకు కూడా సమాన అవకాశాలు దక్కాలని పోరాడారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఓట్ల కోసం లింగాయత్‌లను వాడుకున్నారని, స్వరాష్ట్రం ఏర్పడిన తరువాతనే రూ.కోటి వెచ్చించి బసవేశ్వరుడి విగ్రహంను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని కుల సంఘాలకు సీఎం కేసీఆర్ రాష్ట్రంలోనే అత్యంత విలువైన కోకాపేట్ భూములలో ఆత్మీయ భవనాలు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. అన్ని ప్రాజెక్టులకు దేవతల పేర్లు పెట్టారని, అలాగే సంగారెడ్డి జిల్లాలో 2.లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే ప్రాజెక్టుకు బసవేశ్వరుడి పేరు పెట్టినట్లు ప్రకటించారు. పాఠ్యపుస్తకాలలో ఆ మహాత్ముడి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టడం జరిగిందన్నారు. లండన్ పార్లమెంట్ భవనం వద్ద బసవేశ్వరుడి విగ్రహంను చూసి సంతోషం కలిగిందన్నారు. లింగాయత్‌లను తెలంగాణలో బిసిలుగా గుర్తింపునిచ్చామని, కేంద్రంలో ఓబీసీలుగా గుర్తింపు ఇచ్చేలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృషి చేయాలన్నారు. భవన నిర్మాణం పూర్తయిన తరువాత భారీ బసవేశ్వరుడి విగ్రహంను పెట్టి, స్వయంగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకుందామని హరీష్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా సభా ప్రాంగాణమంతా జై బసవ అంటూ లింగాయత్‌లు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిలు బిబి.పాటిల్, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, క్రాంతికిరణ్‌లతోపాటు లింగాయత్ సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.




కోకాపేట్‌లో బసవేశ్వర భవన్ భూమిపూజ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



# ప్రజలకు ముఖ్యమంత్రి కెసిఆర్ 'సద్దుల బతుకమ్మ' శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** రాష్ట్ర పండుగ బతుకమ్మ ఆఖరి రోజు 'సద్దుల బతుకమ్మ' సందర్భంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై, తొమ్మిది రోజుల పాటు సాగిన ఆడబిడ్డల ఆటా పాటలతో,పల్లెలు పట్టణాలు ప్రత్యేక సాంస్కృతిక వాతావరణాన్ని సంతరించుకున్నాయని అన్నారు. విజయవాలనందించే విజయ దశమిని స్వాగతిస్తూ ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయని సిఎం కెసిఆర్ తెలిపారు. ఇందుకు సహకరించిన ప్రతి వొక్కరికి అభినందనలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లేలా,ప్రజలంతా సుఖ శాంతులతో జీవించేలా దీవించాలని మరోసారి అమ్మవారిని సిఎం కెసిఆర్ ప్రార్థించారు.

# తగ్గిన ఆయిల్‌పాం గెలల రేట్లు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణలో ఆయిల్ ఫాం గెలల రేటు తగ్గింది. ఫ్యాక్టరీలు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల వద్ద నుండి తీసుకునే ఆయిల్ ఫాం గెలలను టన్నుకు 3 వేల రూపాయలు చొప్పున తగ్గించి ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో ఆయిల్ పామ్ గెలలు టన్నుకు 16,295 రూపాయల చొప్పున ఫ్యాక్టరీలు కొనుగోలు చేయగా, ఇప్పుడు అందులో 3 వేల రూపాయలు కోత పెట్టి కోనుగోలు చేస్తామని చెబుతున్నాయి. దీంతో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట్‌లోని పామాయిల్ ఫ్యాక్టరీలో రైతులు శనివారం ఆందోళన చేశారు. మూడు రోజులుగా పడిగాపులు పడుతుంటే కొత్తగా వచ్చే ధరను ఇస్తామని ఫ్యాక్టరీ స్పష్టం చేయడంతో రైతులు ఫ్యాక్టరీ గేట్ వద్ద ట్రాక్టర్లను అడ్డం పెట్టి పాత రేటుకే కొనుగోలు చేయాలని నిరసన తెలిపారు.

# మత్స్య రంగంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** ఆత్మనిర్భర భారత్ ప్యాకేజీలో భాగంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద ఐదేళ్ల కాలంలో దేశంలో మత్స్య రంగంలో కేంద్రం 20,050 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు పెడుతోంది. ఈ నిధులను 2024-25 సంవత్సరం వరకూ తెలంగాణతో సహా దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఖర్చు చేయనున్నట్లు కేంద్ర మత్స్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఈ మొత్తంలో 12,340 కోట్ల రూపాయలను ఆక్వా, మత్స్య రంగంలో పెట్టుబడులు పెడతారు. మరో 7,710 కోట్ల రూపాయలను ఆయా రంగాల్లో కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం పెట్టుబడిగా వినియోగించనున్నారు. ఈ పథకం వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ దేశంలో అదనంగా మరో 70 లక్షల టన్నుల మత్స్య సంపద పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా మత్స్య రంగం ఎగుమతుల ద్వారా 1.5 లక్షల కోట్ల రూపాయల ఆదాయం సమకూరనుంది. అలాగే మత్స్యకారులకు కలిగే నష్టాలు 25 నుండి 19 శాతానికి తగ్గుతాయి. తద్వారా దేశంలో 55 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని మత్స్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

# రాష్ట్రంలో తగ్గిన పప్పు ధాన్యాల సాగు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణలో పప్పు ధన్యాల సాగు తగ్గింది. గత ఏడాది కంటే పప్పు ధాన్యాల సాగును పెంచాలని వ్యవసాయ శాఖ పట్టుదలతో ప్రయత్నం చేసినా రైతాంగంలో స్పందన కనిపించ లేదు. దీంతో ప్రస్తుత వానాకాలం సీజనులో గత ఏడాది ఇదే సమయంలో సాగైన విస్తీర్ణం కంటే తగ్గింది. వ్యవసాయ అధికారుల నివేదికలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 10,36,198 ఎకరాలు కాగా వానాకాలం పంట సమయం ముగిసిన నాటికి 64 శాతం మేర 6,59,202 ఎకరాల్లో కంది, పెసర, మినుము, ఉలవలు తదితర పప్పు ధాన్యాలను రైతులు సాగు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 9,12,785 ఎకరాల్లో పప్పుధాన్యాలు సాగయ్యాయి. కాగా ఈ వానాకాలం సీజనులో ఇంత వరకూ కంది 5,62,007 ఎకరాల్లోను, పెసర 66,869 ఎకరాలు, మినుములు 29,578 ఎకరాల్లోను, ఉలవలు 376 ఎకరాల్లో, బొబ్బర్లు, అనుములు 362 ఎకరాల్లో సాగయ్యాయి. గత ఏడాది ఇదే కాలానికి కంది 7,71,217 ఎకరాలు, పెసర 89,139 ఎకరాల్లోను, మినుములు 47,730 ఎకరాల్లోను, బొబ్బర్లు, అనుములు 3,681 ఎకరాల్లో సాగయ్యాయి.

### వైఎస్ఆర్‌టిపి అధికారంలోకి వస్తే.. వంద రోజుల్లో

# నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం

### పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**మెదక్ అర్బన్, అక్టోబరు 2 ప్రభాతవార్త:** వైఎస్ఆర్‌టీపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల అన్నారు. ఆదివారం మెదక్‌లో వైఎస్. షర్మిల పాదయాత్ర కొన సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలోకి రాకముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారని, చెరుకు రైతుల పొట్టగొట్టార న్నారు. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆ రోగ్యశ్రీ పథకాన్ని రామాయంపేట పట్టణం నుండే ప్రారంభించారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. దీంతో పేదలకు కార్పోరేట్ వైద్యం అందకుండా చేస్తున్నారన్నారు. కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలన్నారు. లబ్ధిదారులందరికీ డుబల్ బెడ్‌రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి అందజేయాలన్నారు. వీఆర్ఏలు 70 రోజులుగా దీక్ష చేస్తూ ఇప్పటికీ 40 మంది వీఆర్ఏలు మృతి చెందినా ముఖ్యమంత్రికి చలనం లేదన్నారు. కేసీఆర్ ప్రభు త్వానికి పోయేకాలం దగ్గర పడిందన్నారు. ఓటు అనే ఆయుధంతో మంచి నేతలను ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు వనపర్తి వెంకటేశం, వైఎస్ఆర్‌టీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

# చరిత్రను తుడిచేసేందుకు యత్నించారు!

### మంత్రిపై మాజీ ఎమ్మెల్యే మర్రి ధ్వజం

**బేగంపేట, అక్టోబరు 2, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట డివిజన్ పరిధి లోని ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం ఉన్నచోట చరిత్రను తుడిచి వేసేందుకు అధికార పార్టీ నేతలు యత్నించగా తాము అడ్డుకున్నామని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి అన్నారు. ఆదివారం గాంధీజయంతి సందర్భంగా ఆయన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఎంజీ రోడ్డులో దాతల సహకారంతో ఇటలీ నుంచి తెప్పిం చిన పంచలోహ గాంధీవిగ్రహాన్ని ఏర్పాటు చేసారని, దాన్ని దివంగత ప్రధాన మంత్రి నెహ్రూ ప్రారంభించారని చెప్పారు. ఆ చారిత్రక ఆనవాళ్లను చెరిపివేసేలా యత్నించారని, ఈ విగ్రహ ప్రాధాన్యత తగ్గించేందుకు కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచించారన్నారు. గాంధీ విగ్రహాన్ని అప్పట్లో అంజయ్య అనే దాత ఏర్పాటు చేసారని చెప్పారు. ఈ విషయాన్ని తాను ముందే పసిగట్టానని, విగ్రహ దాతలు,తాను అడ్డుకోవడంతో ఇక్కడ ఏర్పాటు చేయాలనుకున్న విగ్రహాన్ని గాంధీ ఆస్పత్రి వద్దకు తరలించారని, చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల విషయంలో కూడా కుటిలయత్నాలతో చరిత్రను తిరగ రాయాలని యత్నిస్తున్నారని, ఇవన్ని తాము అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే పార్కును ఆధునీకరించడం కోసం రూ 1.39కోట్లు ఖర్చుచేసారని చెబుతున్నారని, ఇందులో అవినీతి డబ్బు ఎవరికి చేరిందో ముఖ్యమంత్రి చెప్పాలని మర్రి డిమాండ్ చేసారు. కేవలం గ్రీనరీ, ఫ్లోరింగ్, ట్రాన్స్‌ఫార్మర్లకే ఇంత మొత్తం ఖర్చయిందా అని ఆయన ప్రశ్నించారు.



గాంధీవిగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

### మహాత్ముడికి పూలదండ వేయని స్థానికులు

**ఘట్‌కేసర్ :** గాంధీ జయంతి రోజునే జాతిపితకు అవమానం జరిగింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ గాంధీనగర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి కనీసం పూలదండ కూడా వేయకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా మహాత్మాగాంధీని ఘనంగా జరుపుకుంటుండగా ఇక్కడ మాత్రం విగ్రహాన్ని మరిచిపోయారు. గాంధీ యూత్ సభ్యులు 2014 అక్టోబర్ 2వ తేదీన గాంధీనగర్‌లో మహాత్ముని విగ్రహం ఏర్పాటు చేయగా అప ్పటి మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గాంధీనగర్ పేరుతో ఉన్న కాలనీలో ఉన్న విగ్రహాన్ని కూడా గౌవవించలేని స్థితిలో స్థానికులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం మున్సిపల్ బిజెపి నాయకులు విగ్రహాన్ని గమనించి పాతమాలను తీసేసి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు జాతిపిత జయంతి రోజున గాంధీ విగ్రహానికి పూలదండ వేయకుండా అగౌరపరిచారని పేర్కొన్నారు.

### తల్లీకొడుకుల ఆత్మహత్య కేసు విషయంలో..

# మున్సిపల్ చైర్మన్ ఇంటిపై దాడిచేసిన వారికి నోటీసులు

**రామాయంపేట, అక్టోబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన తల్లీ కొడుకుల ఆత్మహత్య కేసు మళ్లీ రామాయంపేటలో చర్చనీయంశమైంది. రామా యంపేటకు చెందిన గంగం సంతోష్, అతని తల్లి పద్మ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జిలో గత ఏప్రిల్ 16న ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. రామాయంపేట వాస్తవ్యులు, అధికార టిఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది ప్రజా ప్రతినిధుల వేధింపుల వల్లే తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తల్లీకొడుకులు సూసైడ్‌నోట్‌లో రాసారు. తాజాగా పోలీసుల నోటీసులతో తల్లీకొడుకుల ఆత్మహత్య కేసు గురించి ప్రజలు మళ్లీ చర్చించుకుంటున్నారు. ఇకపోతే తన ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. గత ఏప్రిల్ 16న మున్సిపల్ చైర్మన్ ఇంటిపై దాడి జరగగా, అప్పుడే ఆయన తమకు ఫిర్యాదు చేశా రని, నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేష్ మీడియాకు తెలిపారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి, దాదాపు 30 మందికి నోటీసులను అందజేశామని ఆయన తెలిపారు. నోటీసులు అందుకున్న వారందరూ తప్పనిసరిగా మూడు రోజుల్లోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నోటీసులు అందుకున్న వారు హాజరుకాకపోయినా, వివరణ ఇవ్వకపోయినా వివిధ సెక్షన్ల కింద వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వివరించారు. తమ విచారణకు వారందరూ సహకరించాలని, లేదా జైలుకు వెళ్తారని తెలిపారు.

### కాంగ్రెస్, బిజెపితోపాటు 30 మందికి నోటీసులు

తల్లీకొడుకుల ఆత్మహత్య అనంతరం రామాయంపేటలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ఇంటిపై దాడిచేసిన సంఘటనలో పోలీసులు బిజెపి, కాంగ్రెస్ నాయ కులతోపాటు 30 మందిపై కేసు నమోదు చేసి నోటీసులు అందజేస్తున్నారు. ఈ దాడి ఘటనతో సంబంధం లేనివారికి కూడా నోటీసులు అందాయని, పోలీసులు తమకు నోటీసు ఇవ్వడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా సం ఘటన జరిగిన ఆరు నెలల తర్వాత మళ్లీ తల్లీకొడుకుల ఆత్మహత్య కేసు తెరపైకి రావడంతో రామాయంపేటలో ఎక్కడ చూసినా పోలీసుల నోటీసుల గురించే చర్చించుకుంటున్నారు.

# 10 కిలోల గంజాయి పట్టివేత

### నలుగురు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**హైదరాబాద్ (దుండిగల్), అక్టోబరు 2, ప్రభాతవార్త :** గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న నలుగురిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద 10కిలోల గంజాయి, కారు, మొబైల్స్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఏపిలోని విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన కొందూరు రోహిత్‌రెడ్డి(22)కి మిత్రుల ద్వారా నగరంలోని యూసఫ్‌గూడకు చెందిన దాసరి వెంకటేష్(24), మియాపూర్ ప్రాంతానికి చెందిన గుంజి భరత్‌చంద్ర(23), ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన జోగ ఫాల్గుణ(25)లు పరిచయమయ్యారు. వ్యసనాలకు అలవాటు పడిన వీరికి అడ్డదారిలో డబ్బు సంపాందించేందుకు గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నారు. రోహిత్‌రెడ్డికి పరిచయస్తులైన వైజాగ్ పరిసర ప్రాంతానికి చెందిన కొందరి దగ్గర గంజాయిని కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా నగరానికి తీసుకవచ్చి విక్రయిస్తుండేవారు. ప్రధానంగా శివారులోని కళాశాల విద్యార్థులే వీరి లక్ష్యం. కాగా శనివారం రాత్రి దుండిగల్ ఓఆర్ఆర్ రోటరి వన్ దగ్గర రాత్రి 9గంల సమయంలో ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో మల్లంపేట నుండి సర్వీసురోడ్డులో కారు(ఎపి28బిఎక్స్3733)లో రోహిత్‌రెడ్డి, వెంకటేశ్, భరత్‌చంద్ర, ఫాల్గుణలు వస్తుండడంతో పోలీసులు అడ్డగించారు. వాహనం ధృవపత్రాలు, వారి వివరాలు అడుగగా నలుగురు పొంతన లేని సమాధానాలు తెలపడంతో అనుమానం వచ్చిన ఎస్సై కారులో తనిఖీలు చేయగా కారు డిక్కీలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద 10కిలోల గంజాయి, కారు, మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# తెలంగాణలో విస్తరిస్తున్న లంపీ స్కిన్

### 22 జిల్లాల్లో కన్పిస్తున్న వైరస్ ప్రభావం

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** వివిధ రాష్ట్రాలను బెంబేలెత్తిస్తున్న లంపీ స్కిన్ వైరస్ తాజాగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తోంది. రాష్ట్రంలోని 22 జిల్లాలకు చెందిన 255 గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ వైరస్ ప్రభావం కన్పిస్తుండడంతో వాటి యజమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపధ్యంలో పశు సంవర్ధక శాఖ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకుగాను ప్రభుత్వం 15 కోట్ల రూపాయల మంజూరుకు అనుమతినిచ్చింది. ఇందులో ఇప్పటికే 3 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. కాగా లంపీ స్కిన్ వైరస్ తెలంగాణతో పాటు, దేశంలోని 15 రాష్ట్రాలకు వ్యాపించింది. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో ఈ వ్యాధి సాధారణ స్థాయిలో ఉంది. అలాగే ఈ వైరస్‌కు సంబంధించి కొన్ని అరుదైన కేసులు ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులలో కూడా నమోదయ్యాయి. దేశ వ్యాప్తంగా లంపీ వైరస్ కారణంగా ఆయా రాష్ట్రాల్లో ఇప్పటి వరకూ మొత్తం 19 లక్షల పశువులకు లంపీ స్కిన్ వైరస్ వ్యాపించింది. వీటిలో 80,500 పశువులు మృతి చెందినట్లు కేంద్ర పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. తాజాగా లంపీ స్కిన్ వైరస్ వ్యాధి సోకిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా చేరింది. మరోపక్క దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో లంపీ స్కిన్ ప్రబలుతుండడంతో కేంద్రం ఆయా రాష్ట్రాలతో పాటుగా, వాటి పొరుగున ఉన్న రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించినా కొన్ని రాష్ట్రాలు కేంద్ర ఆదేశాలను ఖాతరు చేయలేదు. దీంతో లంపీ వైరస్ మరికొన్ని రాష్ట్రాలకు విస్తరించాయని కేంద్ర పశు సంవర్ధక మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఒకరు వెల్లడించారు.

# తెలంగాణలో ఇప్పటికీ శాంతి లేదు!

### ప్రత్యేక రాష్ట్రం కోసం 1200 మంది యువకులు ప్రాణత్యాగం

### న్యాయస్థానం అనుమతితో సభ నిర్వహించుకున్నాం: కెఎ పాల్

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 2, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చినప్పటికీ ఇప్పటికీ రాష్ట్రంలో శాంతి లేదని,తెలంగాణా కోసం 1200మంది యువకులు ప్రాణత్యాగం చేసారని, ప్రపంచశాంతి దూత కెఎ పాల్ ఆరోపిం చారు.ఆదివారం సికింద్రాబాద్ జింఖానామైదానంలో ప్రపంచశాంతి సభ నిర్వహించారు. ఈ సభలో కే.ఏ.పాల్ మాట్లాడుతూ తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తరువాత పేదలకు మేలు జరుగుతుందని,భావించారని,అయితే ప్రస్తుతం తెలంగాణాలో కుటుంబపాలన సాగుతు ందని ఆయన అన్నారు.తెలంగాణా కోసం పోరాడిన ప్రొఫెసర్ కోదండరాం వంటి వారు జైళ్లకు వెళ్లారని,ఏమి చేయ చేయని వారు అధికారాన్ని అనుభవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తరువాత పేదలు పేదరికంలోనే మగ్గుతున్నారని, ధనికులు మాత్రం మరింత ధనవంతులయ్యారని అన్నారు. శాంతిలేదని, ఉద్యోగాలు లేవని, తినడానికి సరియైన తిండి దొరకని పరిస్థితులు నేటికీ రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. తాము ప్రపంచశాంతి సభ నిర్వ హించాలనుకుంటే కొన్ని చీకటి శక్తులు అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నాయని, న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారు అనుమతించడంతో సభ నిర్వహించుకున్నామని కే.ఏ.పాల్ వెల్లడించారు.రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతుందని, రెండు వేల కోట్లతో గుడి కడితే తమ కుటుంబం రక్షించబడుతుందని,కొందరు నమ్ముతున్నారని,డబ్బు మనిషిని కాపాడలేదని ఆయన అన్నారు. సోమవారం అమీర్‌పేటలో గం 1.19నిమిషాలకు ప్రత్యేక ప్రకటన చేయనున్నట్లు కే.ఏ.పాల్ ప్రకటించారు.గం 1.19నుంచి గం 1.30ల వరకు రా ష్ట్ర ప్రజలంతా తన సందేశాన్ని తప్పకుండా వినాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేసారు.రాష్ట్రంలో మార్పు తప్పని సరి కావాలన్నారు.ఈ సందర్భంగా ప్రజా గాయకుడు,యుద్ధనౌక గద్దర్ కు గ్లోబల్ పీస్ అంబాసిడర్ అవార్డు ప్రధానం చేసిన కే.ఏ.పాల్ ఆయన్ను ఘనంగా సత్కరించారు.ఈ అవార్డును గద్దర్‌కు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ సభలో ఇంకా ప్రొఫెసర్ కొదండరామ్,విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్,జ్యోతి,అనువాద కర్త ఫాస్టర్ సువార్తరాజు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ఈ సభ సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసారు.



# దసరా పర్వదినం తర్వాత ప్రచారం ఉధృతం

## మునుగోడులో జాతీయ పార్టీ తరుపునే పోటీ

## సర్వేలన్నీ టిఆర్ఎస్‌కే అనుకూలం: కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** దసరా తర్వాత మునుగోడు ప్రచారాన్ని ఉధృతం చేయాలని టిఆర్ఎస్ అధినేత,ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మంత్రి జగదీశ్ రెడ్డితో సమావేశమయ్యారు. ఏ క్షణమైనా మునుగోడు ఉప ఎన్నిక షెడ్యూల్ రావచ్చని సిఎం కెసిఆర్ చెప్పారు. సర్వేలన్నీ టిఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని, ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,శ్రేణులు కోరారు. టిఆర్ఎస్ పేరు మార్చుకుని నూతనంగా ఏర్పాటు చేయబోయే జాతీయ పార్టీ తరఫున అభ్యర్థిని మునుగోడు ఎన్నిక బరిలోకి దింపుతామని చెప్పారు. ఈసారి మునుగోడు బరిలో మూడు జాతీయ పార్టీలు ఉంటాయని వ్యాఖ్యలు చేశారు. మునుగోడులో అన్ని వర్గాలు టిఆర్ ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంక్షేమ హాస్టళ్లలో అరకొర కాస్మొటిక్స్

## తీవ్ర ఇబ్బందుల్లో విద్యార్థులు

## ఇప్పటికీ 14 యేళ్ల క్రితం చార్జీలే దిక్కు

## అమలుకాని సౌందర్య సాధనాల కిట్

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** క్రాప్ వేయించుకోలేక, తలకు రాసుకునేందుకు నూనె లేక, స్నానం చేసేందుకు సబ్బు లేక, పళ్లు తోముకునేందుకు పేస్ట్ లేక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. చింపిరి జుట్టు, అపరిశుభ్రతతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు అయినా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇచ్చే కాస్మొటిక్ చార్జీలు మాత్రం పెరగ లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 14 ఏళ్ల క్రితం పెంచిన చార్జీలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు.

ప్రతీ ఏటా కాస్మొటిక్ రేట్లు, ముఖ్యంగా కరోనా తరువాత భారీగా వాటి ధరలు పెరిగాయి. అయితే ఇందుకు అనుగుణంగా సంక్షేమ హాస్టళల్లో ఇచ్చే కాస్మొటిక్ చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో గత ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కాస్మొటిక్ చార్జీలకు బదులుగా కాస్మొటిక్ కిట్లు అందించాలని గతంలో మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అయితే ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి. కాస్మొటిక్ కిట్లు ఇవ్వక పోయినా, కనీసం కాస్మొటిక్ చార్జీలను అయినా పెంచుతారని ఆశించిన విద్యార్థులకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. చివరి సారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 సంవత్సరంలో కాస్మొటిక్ చార్జీలను అప్పటి ప్రభుత్వం పెంచింది. ఓ వైపు ధరలు భారీగా పెరిగినా అప్పటి నుండి వీటిని సవరించ లేదు. ప్రస్తుతం బాలికలకు నెలకు 75 రూపాయలు, బాలురకు 50 రూపాయలను ఇస్తున్నారు. అది కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి ఇస్తుండటంతో పెరిగిన ధరలతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రస్తుత ధరలకు అనుగుణంగా విద్యార్థినులకు నెలకు కనీసం 450 రూపాయల నుండి 500 రూపాయలు, బాలురకు నెలకు 300 రూపాయల నుండి 350 రూపాయల వరకూ కాస్మొటిక్ చార్జీల కింద చెల్లించాల్సిన అవసరం ఉందని సంక్షేమ శాఖలకు చెందిన అధికారులే చెబుతున్నారు. అరకొర చార్జీలతో స్నానం సబ్బులు, దుస్తుల సోపులు, టూత్ పేస్టు, బ్రెష్‌లు వంటి వాటిని కొనలేని పరిస్థితి ఉందని అంటున్నారు ఇక కొబ్బరి నూనె, టాల్కం పౌడర్లు, షాంపూలు, బాలికలకు శానిటరీ నాప్కిన్లు, బాలురకు ప్రతీ నెలా క్షవరం వంటి వాటి ఖర్చులకు ఈ సొమ్ము సరిపోవడం లేదు. క్షవరం చేయడానికే 100 రూపాయలకు పైగా తీసుకుంటున్నారు. మరోపక్క కాస్మొటిక్ చార్జీలు పెంచకపోవడంతో శానిటరీ నాప్కిన్లు కొనలేక తరగతులకు హాజరు కాలేక డుమ్మా కొట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని బాలికలు వాపోతున్నారు.

# క్షీణించిన ములాయంసింగ్ ఆరోగ్యం



**గురుగ్రామ్, అక్టోబరు 2:** సమాజ్‌వాదిపార్టీ వ్యవస్థాపకులు, ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం ములాయం సింగ్ యాదవ్ ఆరోగ్యం క్షీణించింది. ప్రస్తుతం గురుగ్రామ్ లోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ములాయం ఆరోగ్యం క్షిణించడంతో ఆయన్ను ఐసియుకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ప్రముఖ వైద్యనిపుణులు సుశీలా కటారియా వైద్యబృందం ములాయంకు వైద్యం అందిస్తున్నారు. తండ్రి ఆరోగ్యం విషమించిందని తెలియగానే యుపి మాజీ సిఎం ఎస్‌పి చీఫ్ అఃలేష్ యాదవ్ హుటాహుటిన్ తరలివెళ్లారు. 82 ఏళ్లములాయంసింగ్‌యాదవ్‌మూడుసార్లు యుపికి సిఎంగాపనిచేసారు. యుపిఎ ప్రభుత్వంలో రక్షణమంత్రిగా కూడా సేవలందించారు. పదిసార్లు ఎమ్మెల్యేగాను, ఏడుసార్లు ఎంపిగా ములాయం ఎన్నికయ్యారు. అత్యధికంగా మెయిన్‌పురి నియోజకవర్గంనుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 99 ఎన్నికల్లో సంభాల్, కన్నౌజ్ స్థానాలనుంచి పోటీచేసి రెండుచోట్లా విజయం సాధించారు. కొన్నివారాలుగా ములాయంసింగ్ యాదవ్ గురుగ్రామ్ మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కరోనా బారినపడి కోలుకున్నప్పటికీ ములాయంగ్‌సింగ్‌ను అనారోగ్యసమస్యలు వెంటాడుతున్నాయి. రెండోభార్య మరణం కూడా ఆయన్ను మరింత కృంగదీసింది. ఆరోగ్యం సహకరించకపోవడంతో క్రియాశీల రాజకీయాలకు కొంతకాలంగాములాయం దూరంగానే ఉన్నారు. కుమారుడు అఃలేష్ అన్నీ తానై పార్టీ వ్యవహారాలునడిపిస్తున్నారు.

# మిషన్ భగీరథకు జలజీవన్ పురస్కారం

## ఢిల్లీలో ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

## 13 స్వచ్ఛ అవార్డులు అందుకున్న కలెక్టర్లు, అధికారులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయ వంతంగా అమలవుతున్న 100శాతం ఇంటింటికి శుద్ది చేసిన మంచినీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మిషన్ భగీరథ పథకానికి కేంద్ర ప్రభుత్వ జల జీవన్ మిషన్ పురస్కారం లభించింది. అత్యున్నత ప్రతిభ, అత్యద్భుతంగా నిర్వర్తి స్తున్న రాష్ట్రంగా కేంద్రం తెలంగాణను అభినందించింది. అలాగే స్వచ్ఛ సర్వేక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యున్నత ప్రతిభావంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొంది ఏకంగా 13 పురస్కారాలను సొంతం చేసుకుంది. మిషన్ భగీరథ, స్వచ్ఛ భారత్ సర్వేక్షణలో నెంబర్ వన్‌గా నిలిచిన తెలంగాణ తరఫున ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో ఆదివారంనాడు వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ హనుమంతరావు ఉన్నారు.

ముర్ము చేతుల మీదుగా సందీప్‌కుమార్, హనుమంతరావు అవార్డులు అందుకోగా, షెకావత్ చేతుల మీదుగా ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా,మండల,గ్రామాల ప్రతినిధులు అధికారులు అందుకున్నారు. అధికారులతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు,జిల్లా,మండల,గ్రామాల ప్రజాప్రతినిధులు,అధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుభాకాంక్షలు చెప్పారు. వారిందరినీ అభినందించారు. సిఎం కెసిఆర్ ఆలోచనా పథంలో పని చేస్తూ,ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, దేశానికి ఆదర్శంగా తెలంగాణను నిలపాలని,అన్ని రంగాల్లో ఇప్పటికే అగ్రగామిగా ఉన్న తెలంగాణను మరింత సమున్నతంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు.

# ఎస్‌బిఐలో గాంధీ జయంతి వేడుకలు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** ఎస్‌బిఐ, హైదరాబాద్ సర్కిల్‌లో గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు జరిగాయి. వీటిని పురస్కరించుకుని ఆదివారం నెక్లెస్ రోడ్‌లో వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిజిఎం ఎ జింగ్రాన్ జెండా ఊపి




ప్రారంభించారు. ఈ సందర్భంగా జింగ్రాన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ, శాస్త్రీజీ స్వయం సమృద్ధి కలిగిన భారత దేశం గురించి కలలు కన్నారన్నారు. అదే బాటలో ప్రధానమంత్రి కూడా నడుస్తూనే ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో ఎస్‌బిఐ ఉద్యోగులు భాగస్వామ్యం కలిగి ఉన్నందుకు గర్వంగా ఉందని చెప్పారు. వ్యవసాయ, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విద్య, విజ్ఞానశాస్త్రం వంటి వాటిపై స్వీయ ఆధార పడటం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా సాంకేతికత, భారతీయుల ఆర్థిక భద్రత దిశగా దేశం ముందుకు వెళుతోందని పేర్కొన్నారు.

# వివాదాస్పద వ్యాఖ్యలతో లెక్చరర్ ఉద్యోగం ఊడింది!

## వర్సిటీ చర్యపై విద్యార్థుల్లో భిన్నాభిప్రాయాలు

**లక్నో, అక్టోబరు 2 :** వారణాసి విశ్వవిద్యాలయానికి చెందిన ఓ గెస్ట్ లెక్చరర్ దేవీ నవరాత్రుల్లో మహిళల ఉపవాసం గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ఉద్యోగాన్ని కోల్పోయారు. యూనివర్సిటీ పరిధిలోని మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్‌లో అతిథి అధ్యాపకుడిగా పని చేస్తున్న అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. నవరాత్రులల్లో మహిళలు పాల్గొనకూడదని సోషల్ మీడియాలో ఆ లెక్చరర్ చేసిన పోస్ట్ వివాదాస్పదమైంది. రాజనీతిశాస్త్రంలో గెస్ట్ లెక్చరర్ అయిన డాక్టర్ మిథిలేశ్‌కుమార్ గౌతమ్‌ మహిళలు నవరాత్రులు జరిగే 9 రోజుల్లో ఉపవాసం ఉండే బదులు భారత రాజ్యాంగం, హిందూకోడ్ బిల్లు చదడవడం మంచిది. వారి జీవితాలు భయం, బానిసత్వం నుంచి విముక్తి పొందుతాయి. జైభీమ్ష్ అని హిందీలో ట్వీట్ చేశారు.

ఆ ఒక్క ట్వీట్‌తో ఆయన ఉద్యోగం కాస్తా ఊడిపోయింది. ఆ లెక్చరర్‌ను క్యాంపస్‌లోకి రాకుండా నిషేధం కూడా విధించారు. కొందరు విద్యార్థులు కూడా లెక్చరర్‌పై చర్యను సమర్థించారు. హిందువుల దేవుళ్లను అవమానించిన అతనిపై చర్యలు తీసుకోవాల్సిందే అంటున్నారు. మరికొందరు మాత్రం ఆయణ్ని ఉద్యోగం నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. ఆ లెక్చరర్ దళితుడు అయినందునే బలిపశువును చేశారని విమర్శించారు. తమ చర్యను సమర్థించుకున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ సునీతా పాండే మాట్లాడ్తూ..ఓ మతంపైనా, మహిళలపైనా ఇలాంటి వ్యాఖ్యలు చేసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలపై విద్యార్థులు ఫిర్యాదు చేయడం వల్లే చర్యలు తీసుకున్నామన్నారు. ఆ లెక్చరర్ పట్ల విద్యార్థుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని, అందుకే క్యాంపస్‌కు రావొద్దని సూచించామని ఆమె తెలిపారు.

# ఉక్రెయిన్‌పై యుద్ధం వెంటనే నిలిపివేయండి



## రష్యా అధ్యక్షుడికి పోప్ ఫ్రాన్సిస్ పిలుపు

**వాటికన్‌సిటీ, అక్టోబరు 2:** ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దండయాత్రను నిలిపివేయాలని పోప్‌ఫ్రాన్సిస్ రష్యాకు విజ్ఞప్తిచేసారు. యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి ఉక్రెయిన్ అధ్యక్షుడుతో చర్చలుజరపాలని పోప్ ఫ్రాన్సిస్ సూచించారు. ఇటీవలికాలంలో తీవ్రస్థాయి పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయని, అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా సంఘటనలు వెల్లువెత్తుతున్నాయని పోప్ ఆందోళన వ్యక్తంచేసారు. అణు ఉద్రిక్తతలు రానున్నాయన్న ఆందోళనలు ప్రజల్లోపెరిగాయని, ప్రపంచ వ్యాప్తంగా ఇటీవలికాలంలో తలెత్తినపరిణామాలు మానవాళికి పెనుముప్పును సూచిస్తున్నాయని అన్నారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న దాడులు, యుద్ధంవల్ల సంభవిస్తున్న మరణాలు పరిగణనలోనికి తీసుకుని వెంటనే యుద్ధం ఆపివేయాలని, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్‌జెలెన్‌స్కీతో చర్చలుప్రారంభించాలని, శాంతిసామరస్య వాతావరణం నెలకొనేందుకు కృషిచేయాలని ఇరుదేశాలకు సూచించారు.

# విదేశీ శానిటరీ ఉత్పత్తులపై శ్రీలంక సుంకాలు తగ్గింపు

## సంక్షోభంలో సంక్షేమానికి విక్రమ్‌సింఘే సర్కారు నిర్ణయం

**కొలంబో, అక్టోబరు 2:** శ్రీలంకప్రభుత్వం మహిళలు వినియోగించే శానిటరీ ఉత్పత్తులపై పన్నురేట్లను తగ్గించింది. దేశ ఆర్థికసంక్షోభంలో మహిళలు, యువతులు వారు వినియోగించే శానిటరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంచే లక్ష్యంతోనే పన్నులు తగ్గిస్తున్నట్లుప్రకటించింది. పాఠశాలలకువెళ్లే విద్యార్థినులు, మహిళలు కూడా శానిటరీ ఉత్పత్తులు లభించక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. నిరుపేద దేశాల్లో ఉన్న పరిస్థితులను శ్రీలంకలో కూడా గడచిన కొన్ని నెలలుగా ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. శ్రీలంకలోని 5.3 మిలియన్ల మహిళలు పునరుత్పత్తి వయసులోనే ఉన్నారు. మొత్తం 5.3 మిలియన్లమందిలో 50శాతం వారే ఉన్నారు. ద్రవ్యోల్బణం 70శాతానికి పెరగడంతో పన్నురేట్లు కూడాపెరిగిపోయాయి. దీనితో ఆర్థికసంక్షోభంనుంచి శ్రీలంక బయటపడేందుకు దారులు వెతుక్కుంటున్న సంగతి తెలిసిందే. అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింగే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనచేస్తూ కస్టమ్స్ సుంకాలు, ఎయిర్‌పోర్టు లెవీలు, ఇతర స్థానిక పన్నులు వంటి వాటిని మహిళల ఆరోగ్య ఉత్పత్తులపై రద్దుచేస్తున్నామని, తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటన విడుదలచేసింది. సుంకాల తగ్గింపువల్ల దిగుమతిచేసుకుంటున్న శానిటరీ ప్యాడ్స్ 20శాతం తక్కువధరకే లభిస్తాయని



అధ్యక్షభవనం వెల్లడించింది. శ్రీలంక ప్రస్తుతం 51 బిలియన్ల విదేశీ రుణం చెల్లించాల్సి ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థతో సంప్రదింపులు జరుపుతూ 2.9 బిలియన్ దాలర్ల బెయిలౌట్ ప్యాకేజికోసం కృషిచేస్తోంది. విక్రమ్‌సింఘే కొత్తప్రభుత్వం ఆదివారం నుంచి అన్ని ఉత్పత్తులు, సేవలపైనా 2.5 శాతం టర్నోవర్‌ట్యాక్స్‌ను అమలుచేస్తోంది. దీనివల్ల పన్నురాబడులు పెరిగి కొంత సంక్షోభం తగ్గుతుందని అంచనావేసింది. అలాగే కొత్తప్రభుత్వం పెట్రోలు ధరలను స్వల్పంగా తగ్గించింది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా సవరణలుచేసింది. అయితే డీజిల్‌ధరలు మాత్రం యధాతథంగా కొనసాగించింది.

# మహారాష్ట్ర సిఎంకు ప్రాణహాని

## హెచ్చరికలపై భద్రత పెంపు



**ముంబయి, అక్టోబరు 2:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండేకు ప్రాణహాని ఉన్నట్లు ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు హెచ్చరించాయి. ముంబయి పోలీసులకు నిర్దిష్టమైన సమాచారం అందడంతో ముందుగానేభద్రతా ఏర్పాట్లను పెంచాలని, షిండే అధికార నివాసం, ప్రైవేటు నివాసాలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టంచేయాలని ఆదేశాలు అందాయి. ముంబయి పోలీస్ టాప్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఎం భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ప్రాణహాని ఉందని వచ్చిన కాల్‌పైనా దర్యాప్తుసంఘాలు ఫోకస్‌పెట్టాయి. రాష్ట్ర ఇంటెలిజెన్స్ శాఖ శనివారం సాయంత్రం ప్రత్యేకమైన కీలక సమాచారం అందుకుంది. ముఖ్యమంత్రి షిండే ప్రాణాలకు ముప్పు ఉందని ఒక అధికారి తెలిపారు. ఇంటెలిజెన్స్ కమిషనర్ అశుతోష్ డుంబ్రే కూడా ఈ సమాచారాన్ని ధృవీకరించారు. దీనితోముఖ్యమంత్రికి ఉన్న భద్రతను కూడా మరింతపెంచినట్లు డుంబ్రే తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రికి జడ్‌ప్లస్ కేటగిరీ రక్షణ ఉందని, మరింతగాపెంచుతున్నట్లు తెలిపారు. అలాగే షిండేకు థాణెలో ఉన్న ప్రైవేటు నివాసం, అధికార నివాసం వర్షాలో కూడా భద్రతను మరింత పెంచినట్లు డుంబ్రే తెలిపారు. ఈనెల 5వ తేదీ షిండే తన మొట్టమొదటి దసరార్యాలీ ప్రసంగం చేయనున్నారు. ముంబయిలోని ఎంఎంఆర్‌డిఎ గ్రౌండ్స్‌లోభారీ ఎత్తున దసరా ర్యాలీ నిర్వహిస్తున్నారు. అంతకుముందు కూడా థాకరే ప్రభుత్వంలో గడ్చిరోలికి షిండే ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్నారు. అప్పుడు కూడా ఆయనకు నక్సల్స్‌నుంచి హెచ్చరిక లేఖలు అందాయి. 2021 నవంబరులో 21 మంది నక్సల్స్‌ను మట్టుబెట్టిన సంఘటనకు ప్రతీకారం తీర్చుకుంటామని నక్సల్స్ ఆ లేఖలో వెల్లడించారు.

# విశాఖలో భీమ జ్యుయెలరీ



## సినీనటి నిక్కీ గల్రానితో ప్రారంభం

**విశాఖపట్నం (అల్లిపురం), అక్టోబరు 2, ప్రభాతవార్త:** బంగారం, వజ్రాలు కొనాలనుకునేవారికి శుభవార్త ప్రముఖ ఆభరణాల సంస్థ భీమ జ్యూయలరీ స్టోర్ తన సరికొత్త షోరూంను ఆదివారం విశాఖలో ప్రారంభించారు. ఆశీలమెట్ట సంపత్ వినాయక గుడి రోడ్డు వేమనమందిరం దరి లాంఛనంగా ప్రారంభించింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనా కార్యక్రమం సినీనటి నిక్కీ గల్రాని చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ నేపధ్యంలో ముఖ్యఅతిధులు మాట్లాడుతూ భీమ గ్రూప్ దక్షిణ భారతదేశం, యు.ఎ.ఇ లలో 50 వరకు షోరూమ్‌లను కలిగివుందన్నారు. బెంగళూరు, మంగుళూరు, ఊడిపి, హాసన్ షియోగ, త్రివేంద్రం, నాగర్‌కోయిల్, మధురై, అడోర్, మర్తనదం, అతింగల్, సేలం, కాసరాగాడ పోతిన్‌కోడ్, తిరున్‌వెల్లి, పతనమ్‌తిట్ట, విజయవాడల్లో సోట్ర్స్ ఉన్నాయన్నారు. వివిధ ప్రాంతాలు, తరాల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ట్రెండ్స్‌ప్రకారం, భీమ తమ ఆభరణం స్వచ్ఛత యొక్క ఉన్నత ప్రమాణాలైన 916 హాల్ మార్క్‌ను కలిగి ఉంటుందన్నారు. చైన్స్, గాజులు, ఆభరణాలు, డిజైనర్‌వేర్, వజ్రాలు, బంగారం, వెండి ఆభరణాలను నిష్కలంకమైన పనితరంతో సమకాలిన, సాంప్రదాయ డిజైన్స్‌ను భీమ అందిస్తుందన్నారు. మా ఖాతాదారుల జీవితంలోని ప్రతి దశలోనూ పాపాయి కడియాల నుంచి మంగళకరమైన మంగళ సూత్రం వరకు భీమ ఒక ముఖ్య భూమికను పోషిస్తున్నందుకు మాకు చాలా గర్వంగా ఉందని డాక్టర్ బి.గోవిందన్ తెలిపారు. వివిధ ప్రాంతాల అభిరుచులకు అనుగుణంగా ట్రెండ్స్ ప్రకారం భీమ తన ఆభరణాలను స్థిరంగా రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలు సంస్థ ప్రతినిధులు గాయిత్రి సుహాస్, ఎంఎస్ సుహస్, దీపా కపూర్, సుదీర్ కపూర్, ఆర్తీ గురురాజ్, గురురాజ్, జయ, శివన మేనేజర్ కృష్ణభాస్కర్, వివిధ సంస్థల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## విండ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా

# సుజ్లాన్ ఎనర్జీ వ్యవస్థాపకుడు తులసీతాంతీ కన్నుమూత

## పవనవిద్యుత్ గురించి చాటిచెప్పిన దార్శనికుడు

## ప్రధాని మోడీ, కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ సంతాపం

**న్యూఢిల్లీ, అక్టోబరు 2 :** ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ సుజ్లాన్ ఎనర్జీ వ్యవస్థాపకుడు, చైర్మన్ తులసీతాంతీ(64) కన్నుమూశారు. గుండెపోటుతో ఆయన శనివారం రాత్రి మరణించారని కంపెనీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అహ్మదాబాద్‌లో విలేకరులతో సమావేశం ముగించుకొని తిరిగొచ్చిన ఆయన పుణెలో ఉండగా ఛాతీలో నొప్పిగా ఉన్నట్లు డ్రైవర్‌తో చెప్పారు. డ్రైవర్ ఆయణ్ని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు కోల్పోయారని వైద్యులు తెలిపారు.



దేశంలో పవన విద్యుత్ రంగంలో ఉన్న అవకాశాల్ని చాటి చెప్పిన తులసీతాంతీని భారత ' విండ్ మ్యాన్'గా పిలుస్తారు. 1995లో సుజ్లాన్ ఎనర్జీని స్థాపించి అతికొద్ది కాలంలోనే దానిని అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడేలా తీర్చిదిద్దారు. ఆయన నేతృత్వంలో సుజ్లాన్ 19.4 గిగావాట్ల సామర్థ్యంతో 33 శాతం మార్కెట్ వాటాతో దేశంలోనే అతిపెద్ద పవన విద్యుదుత్పత్తి సంస్థగా ఎదిగింది. దాదాపు 17 దేశాల్లో ఈ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అమెరికాలోనూ 2 గిగావాట్ల వ్యవస్థాపక సామర్థ్యాన్ని సాధించింది. 2003లో తొలిసారి ఈ కంపెనీకి అమెరికా నుంచి ఆర్డర్ వచ్చింది. మిన్నెసోటలో 24 టర్బైన్ల ఏర్పాటుకు అవకాశం లభించింది. ఈ రంగంలోకి రావడానికి ముందు తాంతీ వస్త్ర వ్యాపారంలో ఉండేవారు. 2001లో ఆ వ్యాపారాన్ని మానేశారు.

గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో 1958లో తులసీతాంతీ జన్మించారు. గుజరాత్ యూనివర్సిటీ నుంచి కామర్స్‌లో డిగ్రీ చేశారు. అనంతరం వ్యాపారంలోకి ప్రవేశించిన ఆయన 1995లో సుజ్లాన్ ఎనర్జీని స్థాపించారు. ప్రస్తుతం ఈ కంపెనీ విలువ రూ.8536 కోట్లు. తాంతీ మరణంపై సుజ్లాన్ కంపెనీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తాంతీ కలల్ని నిజం చేస్తామని తెలిపింది.

తాంతీ మరణంపై ప్రధాని మోడీ, కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌సహా పలువురు వ్యాపార ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ' తులసీ తాంతీ గొప్ప దార్శనికుడు. దేశ ఆర్థిక ప్రగతికి ఆయన ఎంతో కృషి చేశారు. భారత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో తోడ్పాటునందించారు. ఆయన అకాల మరణం నన్ను కలిచివేసింది. ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాన్న అని ప్రధాని ట్వీట్ చేశారు. తాంతీకి భార్య గీత, కుమారుడు ప్రణవ్, కుమార్తె నిధి ఉన్నారు.

# డబుల్‌బెడ్ ఇళ్ల పేరిట 150 మందికి బురిడీ

## పోలీసుల అదుపులో నిందితులు



పోలీసుల అదుపులో ఉన్న బాలరాజు, రాజు

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), అక్టోబరు 2, ప్రభాతవార్త:** డబుల్ బెడ్ ఇళ్లు ఇప్పిస్తామని 150 మందిని మోసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. ఏజీ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మియాపూర్ న్యూహాఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్‌కు చెందిన పండరి బాలరాజు(29), మీర్‌పేట్ వరలక్ష్మీనగర్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ పావని రాజు(47)తో కలిసి డబల్‌బెడ్ రూమ్‌లు ఇప్పిస్తామని సుమారు 150మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. డబల్‌బెడ్‌రూమ్‌కు రూ.70వేల నుంచి లక్ష రూపాయలు, వ్యక్తిగత ఇంటి గురించి లక్ష రూపాయల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేశారు. వీరు హౌసింగ్ సొసైటీ ఉద్యోగి అయినా ఆనంద్‌కిషోర్‌తో కలిసి మోసానికి పాల్పడ్డారు. పలు బస్తీలకు చెందిన వారిని టార్గెట్ చేసి వారిని నమ్మబలికి ఈ ముగ్గురు మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చాలా రోజుల నుంచిడబల్‌బెడ్ రూమ్ కానీ, వ్యక్తిగత ఇల్లు కానీ ఇచ్చే విషయంలో ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. దీంతో అనుమానం కలిగి పలువురు బాధితులు బాలరాజును తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పలువురు బాధితులు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాల్ రాజ్, రాజులను శనివారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆనంద్ కిషోర్ గురించి వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# సఫారీలను బెంబేలెత్తించిన టీమిండియా



## రెండో టి20లో 16 పరుగుల తేడాతో గెలుపు

**గువాహతి:** గెలుపేలక్ష్యంగా గౌహతి వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 16 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. చివరివరకూ ఉత్కంఠగా సాగిన ఈ పోరులో దక్షిణాఫ్రికా మూడు వికెట్ల నష్టానికి 221 పరుగులుచేసి ఓవర్లు పూర్తికావడంతో ఇక భారత్ 16 పరుగుల తేడాతో విజయం సాధించేందుకు మార్గం వేసింది. సఫారీలతో సిరీస్ ఆధిక్యంతోనిలిచింది. 2:0 తేడాతో ప్రస్తుతం టీమిండియా మూడో మ్యాచ్‌నుసైతం గెలిచేవిధంగా ఉరకలు వేస్తోంది. గెలుపేలక్ష్యంగా టీమిండియా బ్యాటర్లు దూకుడు చూపించారు. మొదటినుంచే చొరవగా సాగిన టీమిండియా బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లతో స్కోరుబోర్డును పరుగులుపెట్టించారు. రాహుల్, సూర్యకుమార్ యాదవ్, కోహ్లీలు చెలరేగి ఆడటంతో 20 ఓవర్లకు 3 వికెట్లనష్టానికి 237 పరుగులు చేసి భారీ లక్ష్యం దక్షిణాఫ్రికాకు ఉంచింది. ఓపెనర్లుగా వచ్చిన రోహిత్ రాహుల్‌లు దూకుడుతో సాగారు. తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్య కుమార్ యాదవ్ ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోయాడు. కోహ్లీకి దినేశ్‌కార్తీకజత కావడంతో 20 ఓవర్లు ముగిసేసరికే భారత్ భారీ స్కోరుచేసి సఫారీలకు భారీ లక్ష్యం ముందుంచింది. 9.5 ఓవర్లలోనే భారత్ 96 పరుగులుకు చేరింది. వీరిద్దరిని కేశవ్‌మహరాజ్ వేరుచేయగా భారీ షాట్‌కు ప్రయత్నించి కెప్టెన్ రోహిత్‌శర్మ, ట్రిస్టన్ స్టబ్స్ చేతికి దొరికిపోయి పెవిలియన్‌కు చేరుకున్నాడు. 37 బంతుల్లో 43పరుగులుచేసిన రోహిత్ తృటిలో అర్ధసెంచరీ మిస్ అయ్యాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీ కాసేపటికే అర్ధసెంచరీపూర్తిచేసుకున్న రాహుల్‌కూడా కేశవ్‌మహరాజ్ బౌలింగ్‌లోనే ఔట్ అయ్యాడు. 28 బంతుల్లోనే 57 పరుగులుచేసి ఎల్బీ డబ్ల్యు అయ్యాడు. తర్వాత సూర్యకుమార్ ఎంట్రీతో సౌతాఫ్రికా బౌలర్లకు చుక్కలు కనిపించాయి,. వచ్చినబంతిని వచ్చినట్లు బౌండరీకి తరలించడంతో సఫారీ బౌలర్లకు దిమ్మదిరిగింది. 18 బంతుల్లోనే సూర్యకుమార్ అర్ధసెంచరీపూర్తిచేసాడు. 22 బంతుల్లోనే ఐదుఫోర్లు, ఐదు సిక్సులతో 61 పరుగులుచేసి స్కోరు బోర్డును పరుగులుపెట్టించాడు. 18 ఓవర్లలో మొదటి బంతికి అవసరమైన పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా క్రీజును వీడాడు. కోహ్లీకూడా దూకుడుగా ఆడి 28 బంతుల్లోనే ఏడుఫోర్లు ఒక సిక్స్‌తో 49 పరుగులుచేసాడు. సూర్యకుమార్ వికెట్‌తోక్రీజులోకి వచ్చిన దినేశ్‌కార్తీక్ రెండుసిక్సులు ఒక ఫోరుతో 17 పరుగులుచేసాడు. 20 ఓవర్లుపూర్తి చేసేసరికే 237 భారీ పరుగులతో టీమిండియా సఫారీలకు పనిచెప్పింది. బ్యాటింగ్‌లోదూకుడుచూపించిన టీమిండియా సభ్యులు మొత్తం బౌలింగ్‌లోను తమ సత్తాచూపించి సఫారీ జట్టుసభ్యులకు ఊపిరాడనీయకుండా కట్టడిచేసారు. లక్ష్యఛేదనకు వచ్చిన సఫారీ బ్యాటర్లు తొలినుంచే తడబడ్డారు. ఓపెనర్లుగా క్వింటన్ డీకాక్, టెంబా బువమా క్రీజులోకి రాగా తొలి ఓవర్‌ను దీపక్‌చాహర్ మెయిడిన్‌చేసాడు. తర్వాత బౌలింగ్‌చేసిన అర్ష్‌దీప్‌సింగ్ రెండో బంతికే దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా కోహ్లీచేతికి క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన రొసోవ్, అదే ఓవర్‌లో నాలుగో బంతికి దినేశ్‌కార్తీక్‌కు చిక్కాడు. ఒక్కపరుగుకే సఫారీజట్టు రెండు వికెట్లు నష్టపోయింది. భారత్ బౌలర్ల ధాటికి 47 పరుగులవద్ద సఫారీలజట్టు మూడో వికెట్ నష్టపోయింది. జట్టును ఆదుకునే బాధ్యత డీకాక్, డేవిడ్‌మిల్లర్లపైనే పడింది. పది ఓవర్లకు 70 పరుగులు మాత్రమే ఉన్న స్కోరును వీరిద్దరూ 17వ ఓవర్‌ముగిసే సమయానికి 175 పరుగులకు చేర్చారు. చివరి ఓవర్‌లో మూడో బంతికి భారీ సిక్స్ కొట్టి మిల్లర్ తన సెంచరీపూర్తిచేసాడు. డేవిడ్ మిల్లర్ సెంచరీచేసినా జట్టు విజయం సాధించలేకపోయింది.



# ఒడిఐ కెప్టెన్‌గా శిఖర్‌ధావన్

## వైస్‌గా శ్రేయస్ అయ్యర్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆడుతున్న భారత ద్వితీయ శ్రేణిజట్టును బిసిసిఐ వెల్లడించింది. 16 మంది సభ్యులతోకూడిన జట్టు వివరాలను వెల్లడించింది. శిఖర్ దావన్ జట్టుకు కెప్టెన్‌గా ఉంటాడు. సంజూశాంసన్‌కు వైస్‌కెప్టెన్సీ ఇస్తారని భావించినా సెలక్టర్లు శ్రేయస్ అయ్యర్‌ను ధావన్ డిప్యూటీగా ఎంపికచేసారు. యువ ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్, శుభ్‌మన్‌గిల్ ఛాన్స్ దక్కించుకోగా ఇండియా ఎ జట్టు తరపున చెలరేగిన ఆర్సీబి స్టార్ బ్యాటర్ రజత్ పటీదార్‌కు తొలిసారి టీమిండియా పిలుపు వచ్చింది. షమీ తప్ప స్టాండ్‌బై ఆటగాళ్లంతా ఉన్నారు. రాహుల్‌త్రిపాఠికి మరోసారి అవకాశం దక్కింది. వికెట్ కీపర్లుగా ఇషాన్ కిషన్, సంజుశాంసన్‌కు అవకాశం దక్కితే స్పిన్ ఆల్‌రౌండర్లు షాబాజ్ అహ్మద్, పేస్ ఆల్‌రౌండర్‌గా శార్దూల్ ఠాకూర్ జట్టులోకి వచ్చారు. స్పెషలిస్టు స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, రవిబిష్ణోయ్‌లను తీసుకున్నారు. దేశవాలీ క్రికెట్‌లో సత్తాచాటిన ముకేష్‌కుమార్‌కు తొలిసారి టీమిండియా పిలుపు అందింది. ఇక వరల్డ్‌కప్ టీమ్ స్టాండ్‌బైలో ఉన్న మహ్మద్ సిరాజ్, దీపక్ చాహర్‌లను కూడా ఈసిరీస్‌కు ఎంపికచేసారు. ఆసియా కప్‌లో దారుణంగా విఫలమైన ఆవేశ్‌ఖాన్ మళ్లీజట్టులోకి వచ్చాడు. ఇక తెలుగు క్రికెటర్ తిలక్‌వర్మకు మరోసారి మొండి చెయ్యి చూపించారు. టి20 ప్రపంచకప్ స్టాండ్‌బైగా ఉన్న అందరినీ సిరీస్‌కు ఎంపికచేసారు. మూడు వన్డేల సిరీస్‌లోభాగంగా తొలిమ్యాచ్ లక్నో వేదికగా దసరా పండుగ మరుసటిరోజే జరుగుతుంది. రెండోమ్యాచ్ రాంచీ వేదికగా తొమ్మిదిన జరుగుతుంది. చివరిమ్యాచ్ ఢిల్లీ వేదికగా ఈనెల 11న జరుగుతుంది. చివరిగా వన్డేసిరీస్‌కు కెప్టెన్‌శిఖర్‌ధావన్, వైస్‌గా శ్రేయస్ అయ్యర్, రుతురాజ్‌గైక్వాడ్, శుభ్‌మన్‌గిల్, రజత్ పటీదార్, రాహుల్‌త్రిపాఠి, ఇషాన్‌కిషన్, సంజూశాంసన్, షెహబాజ్ అహ్మద్, శార్దూల్‌ఠాకూర్, కుల్దీప్‌యాదవ్, రవిబిష్ణోయ్, ముకేష్‌కుమార్, ఆవేశ్‌ఖాన్, మహ్మద్‌సిరాజ్, దీపక్‌చాహర్‌లున్నారు.

# ప్రపంచంలో బుమ్రా లాంటి పేసర్లు ఎవ్వరూలేరు!





## ఆసీస్ మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్

**న్యూఢిల్లీ:** జస్‌ప్రీత్‌బుమ్రా లాంటి భారతపేస్‌బౌలర్‌ప్రపంచంలో మరొకరు లేరని, మిగిలిన ఎవ్వరూ ఆతడిస్థానం భర్తీచేయలేరని ఆసీస్‌మాజీ ఆల్‌రౌండర్ షేన్‌వాట్సన్ పేర్కొన్నాడు. అటాకింగ్, డిఫెన్సివ్ బౌలర్ అయిన బుమ్రా లేకపోతే ప్రపంచకప్ గెలవడం భారత్‌కుకష్టమేనన్నాడు. అద్భుతనైపుణ్యం కలిగిన బుమ్రాఅటాకింగ్, డిఫెన్సివ్‌గా బౌలింగ్‌చేయడంలో ప్రపంచంలోనే ఉత్తమం అని అన్నాడు. ఫిట్‌గా లేక ఆతడు ఈ ప్రపంచకప్‌లో ఆడలేకపోతే టీమిండియాకు తీవ్రనష్టం అన్నాడు. డెత్‌ఓవర్లలో విజయవంతంగా బౌలింగ్‌చేసే బౌలర్లు దొరకడమే అదృష్టమని, అదే పెద్ద ఛాలెంజ్ అన్నాడు. టోర్నీలో భారత్‌చివరివరకూ నిలవాలంటే జట్టులోని పేసర్లు ఆతడి పాత్రను పోషించాలని అన్నాడు. బుమ్రాగాయంపై కోచ్ ద్రవిడ్ ఇప్పటికే స్పందించాడు. పరీక్షలకోసం జాతీయ క్రికెట్ అకాడమికి వెళ్లాడని, అక్కడ వైద్య బృందం పరిశీలించి పరిస్థితి ఏంటనేది వెల్లడిస్తుందని తెలిపాడు. ఇప్పటివరకూ అధికారిక ప్రకటన ప్రకారం బుమ్రా దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌కుమాత్రమే అందుబాటులోలేడని, జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లాడని అక్కడవైద్యబృందం పరిశీలించిస్పష్టంచేస్తుందన్నాడు. బుమ్రాను దక్షిణాఫ్రికాతోసిరీస్‌కు మాత్రమే తప్పించారని, సానుకూల నిర్ణయం వస్తుందనే భావిస్తున్నట్లు చెప్పాడు.

# రోడ్‌సేఫ్టీసిరీస్ విజేత భారత్ లెజెండ్స్



**రాయ్‌పూర్:** రోడ్‌సేఫ్టీ వరల్డ్‌సిరీస్ టైటిల్‌ను భారత్ రెండోసారి కూడా కైవసంచేసుకుంది. రాయ్‌పూర్ వేదికగాజరిగిన ఫైనల్‌లో శ్రీలంక లెజెండ్స్‌ను 33 పరుగులతేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌చేసిన ఇండియా లెజెండ్స్ ఆరువికెట్ల నష్టానికి 195 పరుగులుచేసింది. ఈ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ గోల్డెన్‌డక్‌గా వెడుదిరిగితే మరో ఓపెనర్ నమన్ ఓజా 108 పరుగులు చేసాడు. సెంచరీతో సత్తాచూపించాడు. ఆతడికి వినయ్‌కుమా21 బంతుల్లో 36 పరుగులుచేసి సహకారం అందించాడు. ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు 90 పరుగులుజోడించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక లెజెండ్స్ ప వర్‌ప్లేలో సనత్‌జయసూర్య, దిల్షన్ మునవీర వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ తిలకరత్నే దిల్షన్, ఉపుల్‌తరంగ కూడా త్వరగా పెవిలియన్‌కు చేరడంతో లంక 85 పరుగులకే ఐదు వికెట్లు నష్టపోయింది. శ్రీలంక లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ పోరాటంతో కొంత ఊరటకలిగింది. ఇషాన్‌జయరత్నే 22 బంతుల్లో 51, మహేలా ఉదవట్టే 26 పరుగులుచేసి భారత బౌలర్లను భయపెట్టారు. కానీ వమేలను ఔట్‌చేసిన మిథున్ తర్వాత బంతికే ఉడానాను పెవిలియన్‌కు చేర్చాడు. జట్టుస్కోరు 162 పరుగులవద్ద వినియ్ బౌలింగ్ ఎల్బీగా వెనుదిరిగాడు. మరుసటి బంతికే దమ్మికప్రసాద్‌ను వినయ్‌ఔట్‌చేయడంతో శ్రీలంక లెజెండ్స్ 18.5 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయింది. వినయ్ బౌలింగ్, బ్యాటింగ్‌లోను మెరిసాడు. నాలుగోస్థానంలో బ్యాటింగ్‌కు దిగిన వినయ్ 21 బంతుల్లో 36 పరుగులుచేయడంతోపాటు బౌలింగ్‌లో 3.5 ఓవర్లలో 38 పరుగులిచ్చి మూడు వికెట్లుతీసాడు. ఎలంక బౌలర్ నువాన్ కులశేఖర, సచిన్, రైనా, యువరాజ్‌సింగ్ వికెట్లు తీసాడు.

# పిచ్చిపీక్స్ అంటే ఇదే!

## కోహ్లీతో సెల్ఫీకోసం రూ.23వేలు ఖర్చు



**గువాహతి:** టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. దాయాదిదేశంలోక్రికెటర్లే కోహ్లీకివీరాభిమానులు. విరాట్ కోసం పడిచచ్చే అభిమానులు కూడా లేకపోలేదు. తాజాగా విరాట్ కోహ్లీతో సెల్ఫీదిగేందుకు ఆతని డైహార్డ్‌ఫ్యాన్‌చేసిన పని సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. పిచ్చి పీక్‌స్టేజికి వెళితే ఇలాగే ఉంటుందన్న వ్యాఖ్యలు కూడా వెల్లువెత్తాయి. తాను ఎంతగానో ఆరాధించే క్రికెటర్ విరాట్‌కోహ్లీతో ఎలాగైనా సెల్ఫీదిగాలని భావించిన ఒక అభిమాని ఏకంగా రూ.23, 400 ఖర్చుచేసి తన కోరిక తీర్చుకున్నాడు. గువాహతిలోని శాంతిపూర్‌కు చెందిన రాహుల్‌రాయ్, విరాట్‌తో సెల్ఫీదిగాలని తహతహలాడిపోయాడు. రెండోమ్యాచ్ దక్షిణాఫ్రికాతో గువాహతిలోజరుగుతుందని తెలిసి సెల్ఫీకి కసరత్తులు పూర్తిచేసాడు. ఎయిర్‌పోర్టులోనేసెల్ఫీకోసం ప్రయత్నించినా సెక్యూరిటీని దాటుకుని వెళ్లలేకపోయాడు. దాంతో స్మార్ట్‌గా ఆలోచించిన రాహుల్ టీమిండియా బసచేసిన హోటల్‌లో ఓ రాత్రికి రూ.23,400 చెల్లించి రూమ్ బుక్‌చేసుకున్నాడు. హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ సమయంలో కోహ్లీ దగ్గరకు వెళ్లేందుకుప్రయత్నించి సెక్యూరిటీ ఆడ్డుకుంది. వారిని ఎంత బతిమాలినా వినిపించుకోలేదు. ఆతని ప్రయత్నాలనుచూసిన విరాట్ సెక్యూరిటీని వారించాడు. దాంతో రాహుల్‌రాయ్ తన అభిమాన క్రికెటర్‌ను కలిసి సెల్ఫీతీసుకున్నాడు. ఈ పోటోలు తన సోషల్‌మీడియాలో షేర్‌చేయగా ఒక్కసారిగా వైరల్ అయ్యాయి. బ్రేక్‌ఫాస్ట్‌బేలో కోహ్లీనిచూసి అరిచాను. పిలిచేందుకుప్రయత్నించినా సెక్యూరిటీ అడ్డుకుంది. ఎలాగైనా కలవాలన్న తాపత్రయంతో మళ్లీబ్రేక్‌ఫాస్ట్ బేకువెళ్లానని, కోహ్లీ తనను గమనించి తనవద్దకు పిలిపించుకున్నారని చెప్పాడు.

# అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్

**ముంబై, అక్టోబరు 2:** మీరు వంట గ్యాస్ వాడకం నుంచి ఆదాయపు పన్ను దరఖాస్తు చేసే వరకు ఎన్నో మార్పులు జరుగుతుంటాయి. ఎందుకంటే అక్టోబరు 1 నుంచి దేశంలో కొన్ని పెద్ద మార్పులు జరగబోతున్నాయి. దీని కారణంగా మీకు మరింతగా ఖర్చు పెరిగే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఆదాయపు పన్ను రిటర్న్‌లను



దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులు, అటల్ పెన్షన్ యోజన ప్రయోజనాన్ని అక్టోబరు 1 నుంచి పొందలేవు. దీనితో పాటు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడానికి నియమాలు కూడా మారుతాయి. నామినేషన్ ప్రక్రియ కూడా అవసరమవుతుంది. అదే సమయంలో ఎన్‌పిఎస్‌లో ఇ-నామినేషన్ తప్పనిసరి చేయబడుతుంది. ఇది కాకుండా ఆన్‌లైన్ కొనుగోళ్లకు కార్డులకు బదులుగా టోకెన్లను ఉపయోగించబడుతుంది. మీరు ఎల్‌పిజిని ఉపయోగిస్తుంటే గ్యాస్ సిలిండర్ల ధరలు ప్రతి నెల 1వ తేదీన సమీక్షించబడతాయనే విషయం తెలిసిందే. ఈ సారి గృహ, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గుతాయని భావించినా, వాణిజ్య సిలిండర్‌పై రూ.25 మేర తగ్గించాయి చమురు కంపెనీలు. దీంతో కొంత ఊరట లభించినట్లయింది. ఆర్‌బిఐ సూచనల మేరకు అక్టోబర్ 1 నుంచి కార్డు చెల్లింపులకు టోకెన్ విధానం అమల్లోకి రానుంది. దీని అమలు తర్వాత, వ్యాపారులు, చెల్లింపుల అగ్రిగేటర్లు, చెల్లింపు గేట్‌వేలు కస్టమర్ల కార్డ్ సమాచారాన్ని రక్షించలేరు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలను అరికట్టడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ విధానం ఏర్పాటుతో మీరు మోసాల బారినుంచి కాపాడుకోవచ్చని అంటున్నారు నిపుణులు. ఇంతకుముందు కస్టమర్ తన క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డ్ వివరాలను చెల్లింపు కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌తో పుంచకోవాల్సి ఉండేది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఈ సమాచారాన్ని తమ వద్ద సురక్షితంగా ఉంచడానికి, తదుపరి ఏదైనా లావాదేవీ కోసం ఈ సమాచారాన్ని ఉపయోగించేందుకు ఉపయోగించబడ తాయి. దీంతో సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది. దీన్ని నివారించేందుకు రిజర్వ్ బ్యాంకు టోకనైజేషన్ నిబంధనను రూపొందించింది. వాస్తవానికి మీ క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలకు బదులుగా టోకెన్ జారీ చేయబడుతుంది. మీరు ఆన్‌లైన్ చెల్లింపు చేసినప్పుడు వ్యాపారి ఈ టోకెన్ నంబర్‌ను మాత్రమే పొందుతారు. ఆదాయపు పన్ను రిటర్న్లు దాఖలు చేసే వారు అక్టోబరు 1 నుంచి అటల్ పెన్షన్ యోజన ప్రయోజనాన్ని పొందలేరు. అంటే రూ.2.50 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు అటల్ పెన్షన్ యోజనలో పెట్టుబడి పెట్టలేరు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, 18సంవత్సరాల నుంచి 40సంవత్సరాల మధ్య వయస్సు గల భారతీయ పౌరుల ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లించినా చెల్లించక పోయినా ఈ ప్రభుత్వ పెన్షన్ పథకంలో చేరవచ్చు. ఈ పథకం కింద ప్రతి నెలా రూ.ఐదు వేల ఫించన్ అందచేస్తారు. అక్టోబర్1 నుంచి మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టే వ్యక్తులు నామినేషన్ సమాచారంఇవ్వడం తప్పనిసరి. ఇలా చేయడంలో విఫలమైన పెట్టుబడిదారులు డిక్లరేషన్ ఫారమ్‌ను పూరించాలి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రెపోరేటును పెంచిన తర్వాత బ్యాంకులు పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీని పెంచాయి.

# గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులే ఈ వారం మార్కెట్లకు దిక్సూచి




**ముంబై, అక్టోబరు 2:** అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల ధోరణులు, డాలరుతో రూపాయి మారకం విలువలు, ముడి చమురు ధరలే ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయని ట్రేడర్ల అంచనా. ఈ నెల ఐదో తేదీ దసరా సందర్భంగా మార్కెట్లు మూసివేస్తారు. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులను కూడా ట్రేడర్లు పరిశీలనచేస్తారు. రష్యా ఉక్రెయిన్ సంక్షోభం దృష్ట్యా మార్కెట్లలో ఈవారం కొంతమేర అనిశ్చితి తప్పదన్న అంచనాలున్నాయి. ఇక స్థూల ఆర్థిక గణాంకాలపరంగా చూస్తే ఎస్‌అండ్‌పి గ్లోబల్ ఉత్పత్తిరంగ పిఎంఐ సెప్టెంబరు సూచీని ఈ నెల 3వ తేదీ విడుదల చేస్తుంది. ఎస్‌అండ్‌పి గ్లోబల్ సేవలరంగ పిఎంఐ సూచి ఈ నెల 6వ తేదీ విడుదలవుతుంది. ఆటోరంగ స్టాక్స్‌కు కొంత మేర బూస్ట్‌రావచ్చు. సెప్టెంబరు నెల ఆటోమొబైల్ విక్రయాలు కూడా పెరగడంతో ఆ గణాంకాలు సెన్సెక్స్, నిఫ్టీ సూచీలను ప్రభావితంచేస్తాయి. అలాగే జపాన్ కూడా తన టంకన్ భారీ ఉత్పత్తి దారుల సూచీని మూడో త్రైమాసికానికి సంబంధించి 3వ తేదీ విడుదల చేస్తుంది. అమెరికా ఐఎస్ఎం ఉత్పత్తిరంగ పిఎంఐ గణాంకాలను కూడా 3వ తేదీనే విడుదల చేస్తుంది. ఇక ఉత్పత్తేతర రంగాలకు సంబంధించిన పిఎంఐ గణాంకాలను అమెరికాలో ఐదో తేదీ విడుదలవుతాయి. ఇక అమెరికా ఉపాధిరంగ గణాంకాలు కూడా ఈ నెల ఏడవతేదీనే విడుదలవుతాయి. వీటితోపాటు జపాన్, బ్రిటన్, అమెరికా సెంట్రల్ బ్యాంకులు ఇటీవల ప్రకటించిన వడ్డీరేట్ల నిర్ణయాలు, ఆర్‌బిఐ పాలసీ నిర్ణయాలు కూడా ఈ వారం మార్కెట్లకు దిక్సూచిగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

# వాణిజ్యం

**ముంబై, అక్టోబరు 2:** ఇక పక్క ఐటి కంపెనీలు ఉద్యోగులను భయపెడుతున్నాయి. ఇదే సమయంలో ఉద్యోగులు ఒక బాంబు లాంటి వార్త బయటపెట్టారు. తాజాగా టీమ్‌లీజ్ డిజిటల్ వెల్లడించిన నివేదికలో షాకింగ్ నిజాలు ప్రచురణ కావడం ఐటి కంపెనీలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. టామ్‌లీజ్ డిజిటల్ నిర్వహించిన తాజా సర్వేలో వెలువడిన వివరాల ప్రకారం,

## ఐటి బిపిఎం కంపెనీలకు భవిష్యత్తు ముప్పు!

2025 నాటికి 20 నుంచి 22 లక్షల మంది టెక్కీలు ప్రస్తుత ఉద్యోగాలను వదలిపెట్టాలని నిర్ణయించుకున్నట్లు తేలింది. అయితే వారు జీవితంలో మరోసారి ఈ రంగంలో ఉద్యోగం చేయమని తేల్చి చెప్పడం ఆందోళన కలిగిస్తుంది. దీని వల్ల ఉద్యోగుల రాజీనామాల పరంపర రానున్న కాలంలో ఐటి-బిపిఎం కంపెనీలకు ఉక్కిరిబిక్కిరి చేయనున్నట్లు తెలుస్తోంది. ఐటి సెక్టార్‌లో గ్రేట్ టాలెంట్ ఎక్సోడస్‌ను ఎదుర్కోవడం పేరుతో జరిగిన ఈ సర్వేలో రాజీనామాల రేటు 25.2శాతం ఉంటుందని అంచనా వేయబడింది. ఇది 2023 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 50-55 శాతానికి చేరుకుంటుందని తేలింది. అంటే ప్రతి ఇద్దరి ఉద్యోగుల్లో ఒకరు ఐటి పరిశ్రమకు దూరం కాబోతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే కంపెనీలను అనుభవజ్ఞులైన ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధించనుంది. టెక్కీలు ప్రస్తుతం ఉన్న సంప్రదాయ ఐటి కంపెనీలకు దూరంగా ఇతర రంగాల్లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీని కారణంగా 2025 నాటికి 10 లక్షల కొత్త ఉద్యో గాలు రానున్నట్లు అంచనా. 57 శాతం మంది ఐటి నిపుణులు భవిష్యత్తులో ఐటి సేవల రంగంలోకి తిరిగి రావాలనే ఆలోచనలో లేరని తాజా నివేదికలో వెల్లడైంది. రానున్నకాలంలో ఐటి రంగంలో ఉద్యోగుల సంఖ్య 50లక్షల నుంచి కోటి మందికి చేరుకుంటుందని టీమ్‌లీజ్ డిజి టల్ అంచనా వేసింది.



అయితే ఈ క్రమంలో కంపెనీల యాజమాన్యాలు ఉద్యోగుల జీతాల పెంపు గురించి శ్రద్ధ చూపాలని సూచించింది. రానున్న రెండేళ్ల కాలంలో కంపెనీలు బలమైన నిర్ణయాలు తీసుకోకుంటే అత్యుత్తమ ప్రతిభ కలిగిన ఉద్యోగులను కోల్పోతాయని టీమ్‌లీజ్ డిజిటల్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శివ ప్రసాద్ నందూరి అన్నారు.

# రూ.824 కోట్ల కుంభకోణం

## 16 కంపెనీల భారీ మోసం

**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** జిఎస్‌టి అథారిటీ భారీ మోసాన్ని బయటపెట్టింది. 16 బీమా కంపెనీలు రూ.824 కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను దుర్వినియోగం చేశాయని వస్తువులు, సేవల పన్ను అథారిటీ గుర్తించింది. అథారిటీ వివరాల ప్రకారం, ఈ కంపెనీలు నకిలీ ఇన్‌వాయిస్‌లను జారీచేయడానికి తమ మధ్యవర్తులను ఉపయోగించుకున్నాయి. 16 బీమా కంపెనీలు రూ.824 కోట్ల ఐటిసిని తీసుకున్నాయని, ఈ కంపెనీలు ఇప్పటి వరకు రూ.217 కోట్లను స్వచ్ఛందంగా చెల్లించాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్‌కు తెలిపింది. దీనిపై డిజిజిఐ ముంబై జోనల్ యూనిట్ దర్యాప్తు ప్రారంభించింది. అయితే ప్రకటనలో సంస్థల పేర్లను వెల్లడించలేదు. ఈ కంపెనీలు ప్రకటనలు, మార్కెటింగ్, బ్రాండ్ యాక్టివేషన్ వంటి సేవలను అందించడానికి అనేక మధ్యవర్తులు జారీచేసిన ఇన్‌వాయిస్‌ల ఆధారంగా ఐటిసిని పొందాయి. కానీ ఈ కంపెనీలు వాస్తవానికి అలాంటి సేవలను అందించలేదని ప్రకటనలో పేర్కొంది. అయితే జిఎస్‌టి చట్టాలలో అటువంటి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌కు ఎలాంటి నిబంధనల లేదు. బీమా కంపెనీలు చేస్తున్న ఎన్‌బిఎఫ్‌సిల కోసం ఏజెంట్ వివరాల ప్రకారం,



సూక్ష్మ - ఫైనాన్సింగ్ వ్యాపారాలలో నిమగ్నమై ఉన్న అనేక నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు బీమా కంపెనీల కార్పొరేట్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ కంపెనీలు తమ సింగిల్ ప్రీమియం క్రెడిట్ బీమా పాలసీలను క్రాస్ సెల్లింగ్ చేస్తున్నాయి. ఐఆర్‌డిఎ నిబంధనల ప్రకారం, కార్పొరేట్ ఏజెంట్‌కు నామమాత్రపు కమీషన్ మాత్రమే అనుమతించబడుతుంది. ఈ నిబంధనలను తప్పించుకోవడానికి బీమా కంపెనీలు ప్రకటనలు, వెబ్ మార్కెటింగ్ సేవలను సరఫరా చేయడానికి మధ్యవర్తుల నుంచి ఇన్‌వాయిస్‌లను పొందడం, ఎన్‌బిఎఫ్‌సిలకు కమీషన్‌లను బదలీ చేయడం వంటివి చేవాయి. కానీ సేవలు ఎప్పుడూ అందలేదు. ఈ మధ్యవర్తులు అటువంటి సరఫరాల కోసం ఎన్‌బిఎఫ్‌సిల నుంచి ఇన్‌వాయిస్‌లను అందుకున్నారు. అయితే ఈ బీమా కంపెనీలు ప్రకటనలు, మార్కెటింగ్, బ్రాండ్ యాక్టివేషన్ వంటి సేవలకు అందించడానికి అనేక మధ్యవర్తులు జారీచేసిన ఇన్‌వాయిస్‌ల ఆధారంగా ఐటిసిపొందినట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ 16 కంపెనీల కుంభకోణంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

# వ్యాపార వృద్ధిలో డిజిటల్ మార్కెటింగ్ కీలకం

**ముంబై, అక్టోబరు 2:** ప్రపంచీకరణ విస్తరిస్తున్న తరుణంలో కాలానుగుణంగా మనం మారాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే వాణిజ్య సంస్థలన్నీ కొత్తదారులు వెతుక్కుంటూ వ్యాపార విస్తరణ చేసుకుంటున్నాయి. శాస్త్రీయ సంప్రదాయ మార్కెటింగ్‌ను పక్కను నెట్టి డిజిటల్ మార్కెట్‌పై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. డిజిటల్ మార్కెటింగ్‌లోకి ప్రవేశించకపోతే భవిష్యత్తులో వ్యాపారం వృద్ధి చెందకుండా మన పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. దానికి ఉదాహరణే నోకియా సెల్ ఫోన్ల తయారీ కంపెనీ. ఒకప్పుడు మార్కెట్‌లో ఒక ఊపు ఊపున నోకియా కంపెనీ నేడు దాదాపు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. దానికి కారణం మారుతున్న కాలానుగుణంగా నోకియా మారకపోవడమే. డిజిటల్ మార్కెటింగ్ వ్యాపారానికి ఎన్నో అవకాశాలను, వృద్ధిని తీసుకొస్తుంది. కంపెనీ వస్తువులను ప్రపంచానికి తెలియచేసి అమ్మకాలు పెంచుతోంది. వ్యాపారంలో వృద్ధి చెందాలంటే డిజిటల్ మార్కెటింగ్ మాత్రమే ఈ యుగంలో ఉత్తమ మార్గం. ఇందులో అతి ముఖ్యమైనది సోషల్ మీడియా దీని ద్వారా వ్యాపారులు తమ బ్రాండ్‌కు సంబంధించిన కంటెంట్ సృష్టించి తమ బ్రాండ్ ప్రమోట్ చేస్తారు. వ్యాపారులను, కస్టమర్లతో కమ్యూనికేట్ చేయగల వేదిక కూడా ఇదే. సోషల్ మీడియాలో మీ ర్యాంకును నిర్ణయించేది సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ దీనిని సరిగా నిర్వర్తిస్తే బ్రాండ్ ఇంకా ఎంతో మంది కస్టమర్లకు పరిచయమవుతుంది. ఇది చాలా తక్కువ ఖర్చుతో లభించే టూల్. ఇంకోక వ్యూహం పిపిసి దీనినే పేపర్ క్లిక్ అంటారు. దీని ద్వారా మన వెబ్‌సైట్‌లో వచ్చే యాడ్స్‌ను క్లిక్ చేస్తే పబ్లిషర్‌కు డబ్బులు వస్తాయి. మిగతా వాటి కంటే దీని నుంచి వచ్చే రెవెన్యూ చాలా ఎక్కువ. డిజిటల్ మార్కెటింగ్‌లో మన వస్తువును ఎన్నో రకాలుగా ప్రమోట్ చేసుకోవచ్చు.

## వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

(రూ. కిలోకు) (Rs. Per Kg)

| | | |
|---|---|---|
| ఫామ్‌గేట్ | (Farmgate) | 103 |
| డ్రెస్స్‌డ్ | (Dressed) | 125 |
| విత్ స్కిన్ | (with skin) | 181 |
| స్కిన్‌లెస్ | (Skinless) | 206 |

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. RNI No.APTEL/2001/7563.Postal Licence Regd. No. H/KAR/89/12-14